




# విశ్వం వాయిస్

అవినీతిపై- అక్షరసమరం...

తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY








SIMULTANEOUSLY PUBLISHED FROM EAST GODAVARI DISTRICT, CERCULATED AT IN WEST GODAVARI, VISAKHAPATNAM, SRIKAKULAM, VIJAYANAGARAM, VIJAYAWADA, HYDERABAD, BANGLORE, CHENNAI, DELHI, MUMBAI, TIRUPATHI, ANANTAPUR, GUNTUR, KADAPA, KHAMMAM, KARIMNAGAR, KURNOOL, NELLORE, NIZAMABAD, ONGOLE

సంపుటి : 8 | సంచిక : 343 | అమలాపురం | ఎడిటర్ : కె. సునీల్‌కుమార్ | శనివారం 30 ఆగస్టు 2025 | పేజీలు : 12 | వెల : 2/-


# నీలో ఈ కన్ఫ్యూజన్ ఏంటి పవన్ ?

**సుగాలి ప్రీతి కేసులో ముందుకు వెళ్లలేక, మిన్నకుండలేక అయోమయంలో పవన్ కళ్యాణ్**

- అధికారంలోకి వచ్చాక హత్యాచారం కేసులో మౌనం
- జనసేన ఆఫీసు ముందు ధర్నా చేస్తానని సుగాలి ప్రీతి తల్లి హెచ్చరికతో ఒక్కసారిగా ఉలిక్కిపాటు
- జగన్ హయాంలోనే న్యాయం జరిగిపోయిందని పవన్ వింత వాదన
- గొంతెమ్మ కోరికలు కోరుతున్నారంటూ జనసేన ఎమ్మెల్యేల ఎగతాళి
- నిందితులను కఠినంగా శిక్షిస్తామని పవన్ ఎందుకు హామీ ఇచ్చినట్టు?
- ఎన్నికల్లో లబ్ధి కోసమే సుగాలి ప్రీతి కేసును వాడుకున్నారా?
- పవన్ ఎందుకిలా మాటలు మార్చుతున్నారని జనసేన కేడర్‌లో అయోమయం



(షేక్ కాలీషా వలి)

**అమరావతి, విశ్వం వాయిస్ బ్యూరో చీఫ్ న్యూస్:**

సుగాలి ప్రీతి హత్యాచారం కేసు ఎన్నికలకు ముందు పవన్ కళ్యాణ్ కి ఎంతగా పొలిటికల్ మైలేజీ తీసుకొచ్చిందో ఇప్పుడు అంతలా తనని ఇరుకున పడేస్తోంది. ఒకరకంగా చెప్పాలంటే ఈ కేసుతోనే వైయస్ జగన్ ప్రభుత్వాన్ని తీవ్రంగా ఇబ్బంది పెట్టి యువతను తనవైపు తిప్పుకోవడంలో పవన్ సక్సెస్ అయ్యాడు. చంద్రబాబు హయాంలో జరిగిన సుగాలి ప్రీతి హత్యాచారాన్ని సంబంధం లేకపోయినా జగన్ మెడకి చుట్టి వైయస్సార్సీపీ ప్రభుత్వాన్ని అప్రతిష్టపాల్జేశాడు. ఈ క్రమంలో సుగాలి ప్రీతి కుటుంబానికి వైయస్సార్సీపీ ప్రభుత్వం చేసిన సాయాన్ని కూడా మరుగున పడేలా చేయగలిగాడు. చంద్రబాబుని చాకచక్యంగా ఈ కేసు కష్టం నుంచి తన ఇమేజ్‌తో పవనే బయటపడేశాడు. కానీ ఏడాది తర్వాత అంతా తలకిందులైంది. సుగాలి ప్రీతి మరణానికి న్యాయం చేయాలని ఆమె తల్లి పార్వతి ఉద్యమించడం మొదలుపెట్టింది. అధికారంలోకి రాగానే మొదటి కేసుగా సుగాలి ప్రీతి కేసును టేకప్ చేస్తానని ఎన్నికలకు ముందు చెప్పిన పవన్ కళ్యాణ్ మాటలను ఆమె గుర్తుచేస్తోంది. సుగాలి ప్రీతి పేరును వాడుకుంటూ వైయస్ జగన్ ప్రభుత్వం మీద జనసేనాని చేసిన ప్రసంగాలు ఈ నేపథ్యంలో సోషల్ మీడియాలో బాగా వైరల్ అవుతున్నాయి. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మహిళల రక్షణ గురించి మాట్లాడాల్సినప్పుడల్లా సుగాలి ప్రీతి కేసును కేస్ స్టడీగా ప్రస్తావించిన పవన్.. అధికారంలోకి వచ్చి 15 నెలలు దాటినా ఒక్కసారి కూడా ఈ కేసుపై ఎక్కడా స్పందించిన దాఖలాలు కూడా లేవు. ఇదే ఇప్పుడు ఆయనపై వ్యతిరేకతకి కారణం అవుతోంది. ఏడాది క్రితం వరకు హీరోగా మహిళా పక్షపాతిగా మైలేజ్ తీసుకొచ్చినా కేసే.. ఇప్పుడు ఆయన ఇమేజ్ మీద నీలినీడలు కమ్ముకునేలా చేస్తోంది. ఈ కేసులో ముందుకు వెళ్లలేక, మిన్నకుండలేక పవన్ కళ్యాణ్ రోజురోజుకీ అభాసుపాలవుతున్నాడు.

**న్యాయం చేయడం అంటే ఏంటి?**

అధికారంలోకి వచ్చాక విశాఖలో నిర్వహిస్తున్న సేనతో సేనాని కార్యక్రమాల్లో భాగంగా తొలిసారి సుగాలి ప్రీతి కేసు గురించి పవన్ కళ్యాణ్ మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన సుగాలి ప్రీతి కుటుంబానికి న్యాయం జరిగిపోయిందన్నట్టు చెప్పుకొచ్చారు. ఆ కుటుంబానికి రూ. 10 కోట్లు విలువైన భూమి, రూ. 75 లక్షలు విలువైన ఇంటి స్థలం, తల్లి, తండ్రి ఇద్దరికీ - మిగతా 2లో

# పార్టీని నిలబెట్టేందుకే సినిమాలు చేస్తున్నా



- వైకాపావి విధ్వంసంతో కూడిన విధానాలు.. మనవి సామాజిక స్పృహ కలిగిన కార్యక్రమాలు
- కార్యకర్తలతో జనసేన అధినేత పవన్ కల్యాణ్
- నలుగురు మెచ్చేవి, పదిమందికి ఉపయోగపడే అంశాలనే జనసేన పార్టీ ముందుకు తీసుకెళుతుంది
- కొన్ని సిద్ధాంతాలతో ఏర్పడిన జనసేన పార్టీ కులం పార్టీ లేదా కుటుంబ పార్టీ కాదు
- ప్రజల ఆశలను ముందుకు తీసుకెళ్లగలిగే పార్టీ

**విజయవాడ, విశ్వం వాయిస్ న్యూస్ :**

'అక్రమ మైనింగ్, ప్రకృతి విధ్వంసం, అవినీతి వంటివి వైకాపా విధానాలైతే, సామాజిక స్పృహతో కూడిన కార్యక్రమాలు నిర్వహించడం జనసేన పార్టీ విధానాలు' అని ఆ పార్టీ అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. 'సేనతో సేనాని' రెండోరోజు కార్యక్రమానికి శుక్రవారం రాష్ట్రంలోని 25 లోక్‌సభ నియోజకవర్గాల నుంచి జనసైనికులు, వీరమహిళలు, ఇతర ప్రతినిధులు విశాఖ తరలివచ్చారు. జనసేన పీఏసీ ఛైర్మన్ నాదెండ్ల మనోహర్‌తో కలిసి పవన్ కల్యాణ్ ప్రత్యేకంగా భేటీ అయ్యారు. నలుగురు మెచ్చేవి, పదిమందికి ఉపయోగపడే అంశాలనే జనసేన పార్టీ ముందుకు తీసుకెళుతుందన్నారు. కొన్ని సిద్ధాంతాలతో ఏర్పడిన జనసేన పార్టీ కులం పార్టీ లేదా కుటుంబ పార్టీ కాదని, ప్రజల ఆశలను ముందుకు తీసుకెళ్లగలిగే పార్టీ అని స్పష్టంచేశారు. 2008 నుంచి ఎన్నో అంశాలను చూశా. 2009లో - మిగతా 2లో



## రాహుల్ సభపై దుమారం

- ప్రధాని మోదీ తల్లిపై కొందరు దుర్భాషలాడినట్టు ఆరోపణలు
- బీజేపీ, కాంగ్రెస్ కార్యకర్తల ఘర్షణ
- పట్నాలో రాహుల్ గాంధీపై కేసు
- రాహుల్ క్షమాపణ చెప్పాలన్న షా
- ఓటర్ అధికార్ యాత్రకు బ్రహ్మరథం అందుకే బీజేపీ కుట్రలు: కాంగ్రెస్

6

## సివిల్ దుస్తుల్లో.. పోలీస్ విధులా?

- అలా వచ్చి లా అండ్ ఆర్డర్ విధులు నిర్వర్తిస్తామంటే కుదరదు
- అసలు..ఇంటెలిజెన్స్ అధికారులకు లా అండ్ ఆర్డర్‌తో పనేముంది?
- వారు ఉన్నది కేవలం ప్రభుత్వానికి సమాచారం ఇవ్వడానికే.. బనియన్లు, డ్రాయర్లు, టీ షర్ట్‌లు వేసుకుని పోలీసులమంటే ఎలా?
- సివిల్ దుస్తుల్లో వచ్చి అరెస్ట్ చేయడం 'సుప్రీం' తీర్పునకు విరుద్ధం.. నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డిపై అక్రమ కేసులో పోలీసుల తీరును ఆక్షేపించిన హైకోర్టు

2



## 1991 లోక్‌సభ ఎన్నికల్లో నన్ను మోసపూరితంగా ఓడించారు

కర్ణాటక సీఎం సిద్దరామయ్య

6

## టీడీపీ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి హత్యకు రౌడీషీటర్ల కుట్ర?



- సంభాషణల వీడియో వెలుగులోకి
- వీడియోలో కనిపించిన రౌడీషీటర్ శ్రీకాంత్ అనుచరుడు జగదీశ్
- "రూరల్ ఎమ్మెల్యేను లేపేస్తే డబ్బే డబ్బు.." అంటూ ఓ రౌడీషీటర్ చేసిన వ్యాఖ్యలు సంచలనంగా మారాయి

**విజయవాడ, విశ్వం వాయిస్ న్యూస్ :**

నెల్లూరు రూరల్ నియోజకవర్గం టీడీపీ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి హత్యకు రౌడీ షీటర్లు కుట్ర పన్నారా?. ఆయనను హతమార్చే విషయంపై చర్చించుకున్నారా?. అంటే.. తాజాగా ఎమ్మెల్యేను ఉద్దేశించి రౌడీషీటర్లు మాట్లాడుకున్న వీడియో వెలుగులోకి రావడంతో ఔననే సమాధానమే వినిపిస్తోంది. "రూరల్ - మిగతా 2లో

# సదస్సులు, ట్యాబ్‌ల కొనుగోలులో అక్రమాలు

**దొంగ లెక్కలతో సంజయ్ బిల్లులు మంజూరు చేశారు**

**వాదనలు వినిపించిన ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్**

**కస్టడీ పిటిషన్‌పై ముగిసిన వాదనలు, 1న వెలువడనున్న తీర్పు**



సంజయ్

**విజయవాడ, విశ్వం వాయిస్ న్యూస్ :**

'ఐపీఎస్ అధికారి సంజయ్.. సీఐడీ డీజీగా ఉన్న సమయంలో ఎస్సీ, ఎస్టీ చట్టంపై అవగాహన సదస్సుల పేరిట దొంగ లెక్కలు చూపించి బిల్లులు మంజూరు చేయించారు. సీఐడీ నిర్వహించిన వాటిని ప్రైవేటు సంస్థకు కాంట్రాక్ట్ ఇచ్చి చేయించినట్లు దస్త్రాలు సృష్టించారు. సంజయ్ ఆదేశాలతోనే కాంట్రాక్టర్‌కు బిల్లులు మంజూరయ్యాయి' అని ప్రత్యేక పీపీ వాదించారు. ఈ నెల 26న సంజయ్ ఏసీబీ కోర్టులో లొంగిపోగా న్యాయాధికారి రిమాండ్ విధించారు. అప్పటి నుంచి విజయవాడలోని జిల్లా కారాగారంలో రిమాండ్‌లో ఉన్న సంగతి తెలిసిందే. వారం రోజుల కస్టడీ పిటిషన్‌పై శుక్రవారం విజయవాడ ఏసీబీ కోర్టులో వాదనలు జరిగాయి. ఈ సందర్భంగా ప్రత్యేక పీపీ వాదిస్తూ.. ఫైర్ సర్వీసెస్ డీజీగా ఉన్న సమయంలో 150 ట్యాబ్‌ల కొనుగోలుకు, వెబ్‌సైట్ నిర్వహణకు సాంకేతికా - మిగతా 2లో

# పార్టీని నిలబెట్టేందుకే సినిమాలు చేస్తున్నా

-మొదటిపేజీ తరువాయి

ఒక పార్టీ ప్రారంభానికి రాష్ట్రం నలుమూలల నుంచి 20 లక్షలమంది వరకు వచ్చారని, అయితే తర్వాత ఆ బలం ఎందుకు వీగిపోయింది? అనే వేదన నుంచి తనలో కొత్త రాజకీయ ఆలోచన మొదలైందని, బలమైన సిద్ధాంతం, భావజాలం మాత్రమే రాజకీయ పార్టీని ముందుకు నడిపిస్తాయని అర్థమైందని పేర్కొన్నారు.

**అది నా బలం**

సినిమా మాధ్యమం నా బలం. కోట్లమంది అభిమానులను సంపాదించి పెట్టిన రంగమది. సినిమాల్లో నటించకపోతే రాజకీయంగా ఈ స్థాయికి రావడానికి నాకు కనీసం 30–40 ఏళ్లు పట్టేది. రాజకీయ పోరాటం మొదలుపెట్టినప్పుడు సినిమాలు మానేద్దామని అనుకున్నా. అయితే పార్టీని నిలబెట్టేందుకు సినిమాలు తప్పనిసరై చేస్తున్నా. సినిమా బలాన్ని మెల్లగా జనసేన రాజకీయ వ్యవస్థీకృత సైన్యంగా తయారు చేయాలి. ఇప్పుడు మన పార్టీలోని నిబద్ధతగల నాయకులు 1000 నుంచి 10,000 మందిని కదిలించే శక్తిని సంపాదించారు' అని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు.

**నెలలో పది రోజులు క్యాడర్ కోసం**

'2026 మార్చి 14న జరగబోయే పార్టీ ఆవిర్భావ సభ పూర్తి సంస్థాగత బలంతో చేయాలన్నదే నా లక్ష్యం. దానికి అనుగుణంగా అక్టోబరు నుంచి పార్టీకి నెలలో 10 రోజుల సమయం కేటాయిస్తాను' అని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. 'శాంతి వచనాలు చెప్పేచోట శాంతి వచనాలు చెప్పాలి. పోరాటాలు చేయాల్సినచోట పోరాటం చేయాలి. ఎదిరించేవాడు లేకపోతే గూండాలు, రౌడీలు రాజ్యమేలుతారు. సోషల్ మీడియాలో ఇష్టానుసారం బూతులు తిడతారు. మనల్ని తిట్టినవాడు ఖండాలు దాటి ఉన్నా మెడ పట్టుకుని



లాక్కొస్తామనే భయం పుట్టాలి' అని పేర్కొన్నారు.

**సత్తా ఉంటేనే గౌరవం**

'వైకాపా ప్రభుత్వం నన్ను ఎంతో ఇబ్బంది పెట్టింది. భాజపా పెద్దలతో ఉన్న స్నేహాన్ని ఉపయోగించుకుని నేను ఒక్క ఫోన్ కాల్ చేయించవచ్చు. కానీ, నేను అలా చేయలేదు. ఎందుకంటే నా పొగరు అడ్డమొస్తుంది కనుక. ఇది నా ఇంటి సమస్య.. నేనే తేల్చుకోవాలి అనుకున్నాను. ఎన్నో పోరాటాలు చేశారు కనుకనే మోదీ ప్రధానమంత్రి స్థాయికి ఎదిగారు. మనం పోరాటాలు చేసి వెళ్తేనే వాళ్లు గౌరవం ఇస్తారు. అంతేతప్ప పార్టీల మధ్య ఉన్న స్నేహాన్ని వాడుకుని ఎదగడం నాయకత్వం అనిపించుకోదు' అని వివరించారు.

**ప్రతి అడుగులో తోడున్నది మీరే..**

ఎన్నో వేదనలు, అవమానాలను జయించి ముందుకు నడిచాను. ఈ ప్రయాణంలో ప్రతి అడుగునా తోడున్నది జనసైనికులు, వీర మహిళలే. కూటమి ప్రభుత్వం రాగానే నేను పార్టీని వదిలేశానని, కార్యకర్తలను పట్టించుకోవడం లేదనే మాటలు ప్రచారంలోకి వచ్చాయి. కానీ పార్టీని వదిలేయలేదని, పాలనపై పట్టు పెంచుకున్నానని మీరంతా గుర్తుపెట్టుకోవాలి' అని పవన్ పేర్కొన్నారు.

**నేడు విశాఖలో బహిరంగ సభ**

శనివారం సాయంత్రం విశాఖలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో జనసేన బహిరంగ సభ జరగనుంది.

# నీలో ఈ కన్ఫ్యూజన్ ఏంటి పవన్ ?

-మొదటిపేజీ తరువాయి

గత ప్రభుత్వం ప్రభుత్వ ఉద్యోగాలిచ్చిందని పరోక్షంగా వైయస్ జగన్ ప్రభుత్వమే మేలు చేసిందని చెప్పుకొచ్చాడు. కాకపోతే నేను ఈ కేసు గురించి ప్రస్తావించడం వల్లే వారి కుటుంబానికి న్యాయం జరిగిందనేది పవన్ వాదన. సరే, ఆయన వల్లే మేలు జరిగిందనేది వాస్తవమే అనుకుందాం. మరి ఎన్నికల్లో పవన్ ఏం చెప్పుకోవాలి. సుగాలి ప్రీతి కేసులో వైయస్ జగన్ ప్రభుత్వం మీద నేనే ఒత్తిడి తెచ్చి పరిహారం ఇప్పించానని కదా చెప్పుకోవాలి. కానీ, మేము అధికారంలోకి వస్తే సీబీఐ దర్యాప్తు చేస్తామని, మొదటి కేసుగా సుగాలి ప్రీతి ఘటననే తీసుకుంటామని ఎందుకు చెప్పుకోవాలి. అంటే, ఇంకా జరగాల్సిన న్యాయం మిగిలే ఉందని కదా పవన్ వ్యాఖ్యల సారాంశం? మరి జగన్ ఇచ్చేసిన ఉద్యోగం, డబ్బు, ఇళ్లు, పొలంతో న్యాయం జరిగిపోయిందని చెప్పడం ఏంటి? ఇక్కడ భూమి విలువ సెంట్ రూ. 15 లక్షలుంటుందని చెప్పడంలో పవన్ ఆంతర్యం ఏంటి? మీకు జరగాల్సిన దానికన్నా ఎక్కువే జరిగింది, ఇక మీరు సైలెంట్‌గా ఉంటే మంచిదని హెచ్చరిస్తున్నారా? ఇదే కేసు గురించి జనసేన ఎమ్మెల్యేలు మాట్లాడుతూ తామే అవన్నీ చేశామని చెప్పడం మరింత విడ్డూరంగా ఉంది. పైగా సుగాలి ప్రీతి తల్లి గౌంతెమ్మ కోరికలు కోరుతోందని చెబుతున్నారు. తన కూతురి చావుకి కారణమైన వారిని పట్టుకుని చట్టప్రకారం కఠినంగా శిక్షించాలని కోరడం గౌంతెమ్మ కోరిక ఎలా అవుతుందో జనసేన పార్టీ చెప్పాలి. మన దేశంలో న్యాయం ప్రతి ఒక్కరి ప్రాథమిక హక్కు అనేది చట్టసభల్లో కూర్చునే ఎమ్మెల్యేలకు తెలియకపోవడం బాధాకరమే.

**సీబీఐ చెప్పినప్పుడు కలుగజేసుకోవాల్సింది కదా!**

సుగాలి ప్రీతి కేసు దర్యాప్తు గురించి మాట్లాడుతూ డీఎన్ఏ మార్చేశారని చెప్పాడు. వాస్తవానికి ఈ ఘటన 2017 ఆగస్ట్ 19న జరిగినప్పుడు నారా చంద్రబాబు నేతృత్వంలోని తెలుగుదేశం ప్రభుత్వమే అధికారంలో ఉంది. 2019 జూన్ వరకు చంద్రబాబే సీఎంగా ఉన్నారు. ఒకవేళ ఆధారాలు తారుమారు అయి ఉంటే దానికి బాధ్యులెవరు.. చంద్రబాబే కదా? అంటే ఈ కేసును మళ్లీ సీఎం చంద్రబాబు మీదకు తోసేసి పవన్ కళ్యాణ్ తాను తప్పించుకోవాలని అనుకుంటున్నారా? ఇదేనా ఆయనలోని చిత్తశుద్ధి. బాధిత మహిళలకు న్యాయం చేస్తామని చెప్పడం మాటల వరకేనా? రాష్ట్రంలో మహిళల మీద దాడులు నిత్యకృత్యం అవుతుంటే ప్రభుత్వం మీద తీవ్ర వ్యతిరేకత వస్తున్న నేపథ్యంలో పవన్ కళ్యాణ్.. మహిళల రక్షణ కోసం అవసరమైతే తాను హోంమంత్రి పదవిని తీసుకుంటానని చెప్పారు. నిజంగా తనకి ఆ సత్తా ఉంటే, హోంమంత్రి అనిత మీద నమ్మకం లేకుంటే ఆ పదవి తీసుకొవచ్చు కదా? 30 వేల మంది అమ్మాయిలు అదృశ్యం అయ్యారని చెప్పారు కదా. వారందర్నీ తీసుకురావొచ్చు కదా. ఆఖరిలో లా అండ్ ఆర్డర్ సీఎం దగ్గర ఉంది కాబట్టి ఇంతకు మించి మాట్లాడను అని ఎందుకు అంటున్నారు?. అంటే ఆయన చంద్రబాబుకి భయపడిపోతు న్నారా? మాకు చాలా ముఖ్యమైన కేసులున్నాయి. కాబట్టి సుగాలి ప్రీతి కేసును దర్యాప్తు చేయలేం.. ప్రీతి తల్లిదండ్రుల పిటిషన్ కొట్టివేయండని ఈ ఏడాది ఫిబ్రవరిలోనే సీబీఐ హైకోర్టుకు చెబితే అప్పుడు పవన్ కల్యాణ్ ఎందుకు స్పందించ లేదు. జనసేన ఆఫీస్ ముందు ధర్నా చేస్తామని ప్రీతి తల్లి గారు చెప్పిన తర్వాతనే ఎందుకు స్పందిస్తున్నారు ?

**చట్టం, న్యాయం అందరికీ సమానం కాదా?**

నాకొక చట్టం, పేదవాడికి ఇంకో చట్టం ఉండదు. తప్పు ఎవరు చేసినా తలలు తీసేసే చట్టం రావాలని చెప్పిన పవన్ కళ్యాణ్ ఇలా మాట్లాడటం సొంత పార్టీ కార్యకర్తలకే వింతగా అనిపిస్తోంది. ఇదే పవన్ కళ్యాన్ ఇంకో సందర్భంలో అత్యాచారం చేసిన వాళ్లని రెండు బెత్తం దెబ్బలతో దండిస్తే సరిపోతుందని అభిప్రాయపడతాడు. ఒక్కోసారి ఒక్కోరకంగా పూర్తి భిన్నమైన స్టేట్‌మెంట్స్ ఇవ్వడం ద్వారా పవన్ ఏం సందేశం పంపాలనుకుంటున్నారు?

ఇటీవలే శ్రీశైలం టీడీపీ ఎమ్మెల్యే అటవీ శాఖ అధికారులను జీపులో తిప్పుతూ కొట్టి హింసిస్తే, వారంతా వచ్చి పవన్ ను కార్యాలయంలో కలిసి న్యాయం చేయమని అడిగారు. కానీ ఈ ప్రభుత్వం జనసేన ఇన్‌చార్జిని ఏ1గా, టీడీపీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి ని ఏ2గా ఎఫ్ఐఆర్‌లో చేర్చి కేసు నమోదు చేసేసి వదిలేశారు. అంతకు మించి కేసు ముందుకు కదల్లేదు. కానీ కూటమి ప్రభుత్వం ఏర్పాటైన కొత్తలో వైయస్సార్సీపీ నాయకుడు పంచాయతీరాజ్ శాఖ సిబ్బందితో దురుసుగా ప్రవర్తించాడని పోలీసులను పంపించాడు. వైసీపీ నాయకుడిని అందరి ముందూ చొక్కా పట్టుకుని బయటకు లాక్కొచ్చి అవమానించారు. ఇలాంటివి సినిమాల్లోనే చూస్తుంటాం. ఆ వెంటనే పవన్ కళ్యాణ్ కూడా హుటాహుటిన కడపకు వెళ్లి రౌడీయిజాన్ని సహించనని వార్నింగ్ ఇచ్చి వచ్చాడు. కానీ తాను చూసే అటవీ శాఖ సిబ్బంది మీద సొంత జనసేన పార్టీ ఇన్‌చార్జి, మిత్రపక్ష ఎమ్మెల్యే దాడి చేసి కొడితే హింసిస్తే పవన్ ఎందుకంతా ఉదాసీనంగా ఉన్నట్టు? అంటే అందరికీ ఒకే చట్టం అనే తన సిద్ధాంతం మాటల వరకేనా? ప్రతిపక్ష వైసీపీ నాయకుల మీద మాత్రమే కేసులు పెడతారా? చట్టం, న్యాయం అందరికీ సమానం అనే తన అభ్యుదయ భావాలు ప్రసంగాల వరకే పరిమితమా అని ఆయన్ను ప్రశ్నిస్తున్నారు. వీటన్నింటికీ భవిష్యత్తులో ప్రజలకు పవన్ కళ్యాణ్ సమాధానం చెప్పుకుని తీరాలి. ప్రస్తుతం సుగాలి ప్రీతి కేసు తన మెడకి చుట్టుకున్నట్టే ఏదో ఒకరోజు ఈ ఉదాసీనతే ఆయన ముందరి కాళ్లకి బంధనాలు వేసినట్టు అవుతుందేమో చూసుకుంటే మంచిది.

# తన నియోజకవర్గానికి వెళ్లకుండా ఓ వ్యక్తిని ఎలా అడ్డుకుంటారు..?

అమరావతి

అధికార దుర్వినియోగం, కక్షపూరిత రాజకీయాలే లక్ష్యంగా సాగుతున్న టీడీపీ కూటమి సర్కారుకు సుప్రీంకోర్టులో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి అడుగులకు మడుగులొత్తుతూ.. వైఎస్సార్‌సీపీ మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డిని ఊర్లోకి అడుగుపెట్టకుండా అడ్డుకుంటున్న పోలీసులకు దిమ్మతిరిగే షాక్‌నిచ్చింది. తాడిపత్రిలోని తన ఇంటికి వచ్చేందుకు కేతిరెడ్డి పెద్దారెడ్డికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. "ఓ వ్యక్తిని తన నియోజకవర్గానికి వెళ్లకుండా ఎలా అడ్డుకుంటారు..?" అని పోలీసులను ఘాటుగా ప్రశ్నించింది. సింగిల్ జడ్జి ఇచ్చిన ఆదేశాల మేరకు పెద్దారెడ్డికి తగిన భద్రత కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఆ ఖర్చును భరించాలని పెద్దారెడ్డికి సూచించింది. పెద్దారెడ్డి తాడిపత్రిలోని తన ఇంటికి వచ్చి ఉండేందుకు వీలుగా తగిన భద్రతా ఏర్పాట్లు చేయాలని పోలీసులను ఆదేశిస్తూ సింగిల్ జడ్జి ఇచ్చిన ఉత్తర్వుల అమలును నిలిపేస్తూ ధర్మాసనం ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను సుప్రీంకోర్టు తాత్కాలికంగా పక్కన పెట్టింది. సింగిల్ జడ్జి ఉత్తర్వులపై పోలీసులు దాఖలు చేసిన అప్పీల్‌ను తేల్చాలని ధర్మాసనానికి స్పష్టం చేసింది. ఈ మేరకు సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతాలతో కూడిన ధర్మాసనం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది.

**ధర్మాసనం ఉత్తర్వులపై సుప్రీంను ఆశ్రయించిన పెద్దారెడ్డి...**

తన నియోజకవర్గమైన తాడిపత్రిలోకి వెళ్లేందుకు, అలాగే తన ఇంటిలో ఉండేందుకు పోలీసులు అనుమతించకపోవడాన్ని సవాల్ చేస్తూ కేతిరెడ్డి పెద్దారెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై విచారణ జరిపిన సింగిల్ జడ్జి జస్టిస్ నూనెపల్లి హరినాథ్.. తాడిపత్రిలోని ఇంటికి వెళ్లి నివసించే నిమిత్తం పెద్దారెడ్డికి తగిన భద్రత కల్పించాలని పోలీసులను ఆదేశించారు. అయితే వీటిని పోలీసులు బేఖాతరు చేయడంతో కోర్టు ధిక్కార పిటిషన్‌ను పెద్దారెడ్డి దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై విచారణ జరిపిన జస్టిస్ హరినాథ్... తాడిపత్రిలోని ఇంటికి వెళ్లి ఉండేందుకు వీలుగా పెద్దారెడ్డికి తగిన భద్రత కల్పించాలని పోలీసులను ఆదేశించారు. దీన్ని సవాలు చేస్తూ పోలీసులు ధర్మాసనం ముందు అప్పీల్ దాఖలు చేశారు. ఈ అప్పీల్‌పై విచారణ జరిపిన ధర్మాసనం పెద్దారెడ్డికి భద్రత కల్పించాలంటూ సింగిల్ జడ్జి ఇచ్చిన ఉత్తర్వుల అమలును నిలిపేస్తూ ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో హైకోర్టు ధర్మాసనం ఇచ్చిన ఆదేశాలను సవాలు చేస్తూ కేతిరెడ్డి పెద్దారెడ్డి సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ (ఎస్ఎల్‌పి) దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై శుక్రవారం జస్టిస్ విక్రమ్‌నాథ్ నేతృత్వంలోని ధర్మాసనం విచారణ జరిపింది.

**పోలీసులు పదే పదే అడ్డుకున్నారు**

పెద్దారెడ్డి తరఫున సీనియర్ న్యాయవాదులు సిద్ధార్థ దవే, పొన్నవోలు సుధాకర్‌రెడ్డి, న్యాయవాది అల్లంకి రమేష్ వాదనలు వినిపించారు. ఈ కేసు ఓ పౌరుడి ప్రాథమిక హక్కులతో ముడిపడి ఉన్న వ్యవహారమని నివేదించారు. పిటిషనర్‌ను తన సొంత నియోజకవర్గానికి, సొంత ఇంటికి రాకుండా పోలీసులు పదే పదే అడ్డుకుంటున్నారని, ఇది రాజ్యాంగం ప్రసాదించిన హక్కులను ఉల్లంఘించడమే అవుతుందన్నారు. పిటిషనర్ మాజీ ఎమ్మెల్యే అని, ఆయన్నే పోలీసులు అడ్డుకుంటున్నారంటే రాష్ట్రంలో పరిస్థితులు ఎలా ఉన్నాయో అర్థం చేసుకోవాలని సుప్రీంకోర్టును అభ్యర్థించారు. ఓ వ్యక్తి తనకు నచ్చిన విధంగా, స్వేచ్ఛగా సంచరించే హక్కును రాజ్యాంగం ఇచ్చిందన్నారు. పెద్దారెడ్డి తన ఇంటికి వస్తే శాంతి భద్రతల సమస్య తలెత్తుతుందని చెబుతున్నారని, వాస్తవానికి వాటి పరిరక్షణ బాధ్యత పోలీసులదేనన్నారు.

**భద్రత ఖర్చును భరించేందుకు సిద్ధం**

పెద్దారెడ్డికి భద్రత కల్పించాలంటూ సింగిల్ జడ్జి ఇచ్చిన ఉత్తర్వులను సైతం పోలీసులు అమలు చేయలేదని పెద్దారెడ్డి తరఫు న్యాయవాదులు తెలిపారు. దీంతో పోలీసులపై పిటిషనర్ కోర్టు ధిక్కార పిటిషన్ దాఖలు చేయాల్సి వచ్చిందన్నారు. ఆ ధిక్కార పిటిషన్‌లో సైతం సింగిల్ జడ్జి పిటిషనర్ పెద్దారెడ్డికి భద్రత కల్పించాలంటూ ఆదేశాలు ఇచ్చారన్నారు. పోలీసులు ఈ ఉత్తర్వులు మొత్తాన్ని సవాలు చేయకుండా, కొంత భాగాన్నే ఎంపిక చేసుకుని అప్పీల్ దాఖలు చేశారని దవే, సుధాకర్‌రెడ్డి ధర్మాసనం దృష్టికి తెచ్చారు. ఆ అప్పీల్‌కు ఎలాంటి విచారణార్హత లేదన్నారు. తన భద్రతకయ్యే ఖర్చును భరించేందుకు పెద్దారెడ్డి సిద్ధంగా ఉన్నారని ధర్మాసనానికి దవే తెలిపారు. తాడిపత్రిలోని ఇంటికి వచ్చేందుకు పెద్దారెడ్డికి అనుమతినివ్వాలని కోర్టును కోరారు. సొంత భద్రత లేకుంటే అందుకయ్యే వ్యయాన్ని ఆయనే భరించాల్సి ఉంటుందని ధర్మాసనం పేర్కొంది. అయినా ప్రభుత్వం పెద్దారెడ్డికి భద్రత కల్పిస్తుందనుకోవడం లేదని దవే నివేదించారు.

## సదస్సులు, ట్యాబ్‌ల కొనుగోలులో అక్రమాలు

-మొదటిపేజీ తరువాయి

టెక్నాలజీస్ అనే సంస్థకు కాంట్రాక్ట్ ఇచ్చారు. ట్యాబ్‌ల కొనుగోలులోనూ అవినీతి జరిగింది. నిందితుడిని కస్టడీలోకి తీసుకుని విచారిస్తే మరిన్ని విషయాలు వెలుగులోకి వస్తాయి' అని తెలిపారు. ఎక్కడా అవినీతి జరగలేదని, నిబంధనల ప్రకారమే నిధులు మంజూరుచేశారని సంజయ్ తరఫు న్యాయవాది వాదనలు వినిపించారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయస్థానం.. వచ్చే నెల 1న తీర్పు వెల్లడించనున్నట్లు తెలిపింది. ఆరోగ్య కారణాల దృష్ట్యా మధ్యంతర బెయిల్ మంజూరు చేయాలని సంజయ్ దాఖలు చేసిన పిటిషన్‌ను కూడా సెప్టెంబరు 1కి వాయిదా వేశారు.

## టీడీపీ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి హత్యకు రౌడీషీటర్ల కుట్ర?

-మొదటిపేజీ తరువాయి

ఎమ్మెల్యేను లేపేస్తే డబ్బే డబ్బు.." అంటూ ఓ రౌడీషీటర్ చేసిన వ్యాఖ్యలు సంచలనంగా మారాయి. గత నెలలో నెల్లూరులోని ఓ హోటల్‌లో రౌడీషీటర్లు మద్యం తాగుతూ మాట్లాడుకుంటున్న వీడియో తాజాగా వెలుగులోకి వచ్చింది. ఈ వీడియోలో రౌడీషీటర్ అవిలేలి శ్రీకాంత్ ప్రధాన అనుచరుడైన మరో రౌడీషీటర్ జగదీశ్ ఉండటం మరింత చర్చనీయాంశంగా మారింది. ఈ వీడియో సారాంశం ప్రకారం.. రౌడీషీటర్ జగదీశ్‌తోపాటు పలు కేసుల్లో నిందితులుగా ఉన్న జకీర్, మహేశ్, వినీత్, రాజశేఖర్‌రెడ్డిలు ఓ హోటల్ రూంలో మద్యం తాగుతూ మాట్లాడుకుంటున్నారు. మహేశ్ అనే వ్యక్తి.. "డబ్బు పెద్ద సమస్యా..?" అని మాట్లాడగా, వెంటనే పక్కనే ఉన్న మరో వ్యక్తి.. "రూరల్ ఎమ్మెల్యేను లేపేస్తే డబ్బే డబ్బు.." అంటూ వ్యాఖ్యానించాడు. వెంటనే మహేశ్.. 'చంపేస్తార్రా..' అని సమాధానమిచ్చాడు. 30 సెకన్ల నిడివి ఉన్న ఈ వీడియో రాజకీయ వర్గాల్లో తీవ్ర కలకలం రేపుతోంది. ఎమ్మెల్యే కోటంరెడ్డి హత్యకు రౌడీషీటర్లు కుట్ర పన్నారన్న ప్రచారం జరుగుతోంది. ఈ వ్యవహారం రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. ఈ వీడియో ముందుగా పోలీసుల దృష్టికి రాగా.. వెంటనే స్పందించిన అధికారులు విచారణ చేపట్టారు. ఎస్పీ కృష్ణకాంత్ 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ.. రౌడీషీటర్లు మాట్లాడుకుంటున్న వీడియో రెండు రోజుల క్రితమే తమ దృష్టికి వచ్చిందని, దానిపై లోతుగా విచారిస్తున్నట్లు చెప్పారు. కాగా, వీడియో బయటకు రావడంతో ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి శుక్రవారం సన్నిహితులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. తన ప్రాణానికి సంబంధించిన వ్యవహారం పోలీసుల దృష్టికి వచ్చినా..అధికారులు తనకు సమాచారం ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేసినట్లు తెలిసింది. నిరసనగా గన్‌మెన్లను ఎస్పీకి సరెండర్ చేస్తానన్నట్టు సమాచారం.

**కూపీ లాగుతున్న పోలీసులు**

కోటంరెడ్డిని ఉద్దేశించి వ్యాఖ్యలు చేసిన రౌడీషీటర్ల వ్యవహారాన్ని పోలీసులు సీరియస్‌గా తీసుకున్నారు. వీడియోలో ఉన్న రౌడీషీటర్ జగదీశ్ ఇప్పటికే జైల్లో ఉండగా, మిగిలిన వారిని బాలాజీనగర్ పోలీసులు అదుపులోకి తీసుకుని లోతుగా విచారిస్తున్నారు.

## సివిల్ దుస్తుల్లో.. పోలీస్ విధులా?

అమరావతి




పోలీసులు.. సివిల్ దుస్తుల్లో వచ్చి ఎలా విధులు నిర్వర్తిస్తారని హైకోర్టు సూటిగా ప్రశ్నించింది. అలా సివిల్ దుస్తుల్లో రావడానికి వీల్లేదని, అది నిబంధనలకు విరుద్ధమని తేల్చి చెప్పింది. పోలీసు యూనిఫాంలో కాకుండా సివిల్ దుస్తుల్లో వచ్చి అరెస్ట్ చేయడానికి వీల్లేదని, అది డీకే బసు కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పునకు విరుద్ధమని స్పష్టం చేసింది. సివిల్ దుస్తుల్లో వస్తే వారు పోలీసులని ఎలా తెలుస్తుందని ప్రశ్నించింది. సివిల్ దుస్తుల్లో వచ్చి తమ విధులను అడ్డుకున్నారంటే ఎలా కుదురుతుందని నిలదీసింది. సివిల్ దుస్తుల్లో పోలీసులు లా అండ్ ఆర్డర్ విధులు నిర్వర్తిస్తామంటే కుదరదంది. ఇంటెలిజెన్స్ అధికారులు సివిల్ దుస్తుల్లో ఉన్నప్పటికీ, వారి బాధ్యత శాంతి భద్రతల పరిరక్షణ కాదని, వారున్నది కేవలం ప్రభుత్వానికి సమాచారాన్ని చేరవేయడానికి మాత్రమేనని గుర్తు చేసింది. బనియన్‌లు, డ్రాయర్లు, టీ షర్టుల్లో వచ్చి తాము పోలీసులమంటే ప్రజలకు ఎలా తెలుస్తుందని వ్యాఖ్యానించింది. అసలు సివిల్ దుస్తుల్లో విధులు నిర్వర్తించే ప్రివిలేజీలేవీ పోలీసులకు లేవంది. కనీసం సఫారీ దుస్తుల్లో ఉన్నా కొంతవరకు అర్థం చేసుకోవచ్చునంది. ఎస్‌బీ (స్పెషల్ బ్రాంచ్) పోలీసులు కోవూరు మాజీ శాసనసభ్యుడు నల్లపురెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి వాహనం తనిఖీ సందర్భంగా జరిగిన తోపులాటకు సంబంధించిన వీడియో ఫుటేజీని తమ ముందుంచాలని పోలీసులను ఆదేశించింది. అంతేకాక ఈ కేసుకు సంబంధించి కేసు డైరీని కూడా తమ ముందుంచాలంది. ఈ మేరకు న్యాయమూర్తి డాక్టర్ జస్టిస్ యడవల్లి లక్ష్మణరావు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

**నాపై కేసు కొట్టేయండి...**

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గత నెలలో శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో పర్యటించిన సమయంలో వాహనాలను తనిఖీ చేస్తున్న తనపై కోవూరు మాజీ ఎమ్మెల్యే నల్లపురెడ్డి ప్రసన్నకుమార్ తదితరులు దాడి చేసి గాయపరిచారంటూ స్పెషల్ బ్రాంచ్ (ఎస్‌బీ) కానిస్టేబుల్ కరణం మాలకొండయ్య ఫిర్యాదు చేశారు. దీని ఆధారంగా దర్గామిట్ట పోలీసులు ప్రసన్నకుమార్‌రెడ్డి తదితరులపై అక్రమ కేసు నమోదు చేశారు. దాన్ని కొట్టేయాలని కోరుతూ ప్రసన్నకుమార్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై హైకోర్టు తాజాగా విచారణ జరిపింది.

**సివిల్ దుస్తుల్లో వచ్చి... ఏమైనా చేస్తామంటే ఎలా?**

పిటిషనర్ తరఫున న్యాయవాది వి.రూపేష్ కుమార్‌రెడ్డి వాదనలు వినిపించారు. ఘటన జరిగిన ప్రదేశంలో ప్రసన్నకుమార్‌రెడ్డి లేరని, ఆయన ఎవరినీ తోసివేయలేదని తెలిపారు. ఫోటోలను పరిశీలిస్తే అన్ని విషయాలు తెలుస్తాయంటూ కోర్టుకు సమర్పించారు. వాటిని పరిశీలించిన న్యాయమూర్తి.. సివిల్ దుస్తుల్లో విధుల్లో ఉన్న వారి గురించి ఆరా తీశారు. వారు పోలీసులని రూపేష్ చెప్పడంతో, న్యాయమూర్తి ఒకింత విస్మయం వ్యక్తం చేశారు. పోలీసులు సివిల్ దుస్తుల్లో విధులు నిర్వర్తించడం ఏమిటంటూ ప్రశ్నించారు. స్పెషల్ బ్రాంచ్ పోలీసులు సివిల్ దుస్తుల్లో విధులు నిర్వర్తిస్తారన్న రాష్ట్ర పబ్లిక్ ప్రాసిక్యూటర్ (పీపీ) మెండ లక్ష్మీనారాయణ చెప్పారు. అయితే న్యాయమూర్తి దీంతో విభేదించారు. పోలీసులు ఎప్పుడూ యూనిఫాంలోనే ఉండి విధులు నిర్వర్తించాల్సి ఉంటుందని తేల్చి చెప్పారు. ఈ విషయంలో పోలీసు మాన్యువల్‌ను సైతం పరిశీలిస్తామని స్పష్టం చేశారు. సివిల్ దుస్తుల్లో వచ్చి ఏమైనా చేస్తామని అంటే ఎలా..? అని ప్రశ్నించారు. ఈ మొత్తం ఘటనలో ప్రసన్నకుమార్‌రెడ్డి పాత్ర కీలకమని, ఆయన ప్రోద్బలంతోనే కానిస్టేబుల్‌పై దాడి జరిగిందని పబ్లిక్ ప్రాసిక్యూటర్ పేర్కొన్నారు. గాయపడిన కానిస్టేబుల్‌కి సర్జరీ కూడా జరిగిందన్నారు.

**యూనిఫాంలో లేనప్పుడు పోలీసని గుర్తించడం ఎలా..?**

అనంతరం న్యాయమూర్తి జోక్యం చేసుకుంటూ... గాయపడ్డారని చెబుతున్న కానిస్టేబుల్ పోలీసు యూనిఫాంలో లేరని గుర్తు చేశారు. యూనిఫాంలో లేనప్పుడు పోలీసని గుర్తించడం ఎలా? అని ప్రశ్నించారు. యూనిఫాం ధరించి చట్ట ప్రకారం విధులు నిర్వర్తిస్తున్నప్పుడే ఆరోపణలకు బలం చేకూరుతుందన్నారు. ఇంటెలిజెన్స్, స్పెషల్ బ్రాంచ్ పోలీసులకు యూనిఫాం ఉండదని పీపీ చెప్పగా, అలా అయితే మరి వారు లా అండ్ ఆర్డర్ విధులు ఎలా నిర్వర్తిస్తారని న్యాయమూర్తి ప్రశ్నించారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి ఘటనకు సంబంధించిన వీడియో ఫుటేజీ, కేసు డైరీని తమ ముందుంచాలని పోలీసులను ఆదేశిస్తూ తదుపరి విచారణను సెప్టెంబర్ 8కి వాయిదా వేశారు.

మరిన్ని వార్తా విశేషాలకై... www.viswamvoice.com

విశ్వం వాయిస్
అవినీతిపై- అక్షరసమరం...
కాకినాడ తూర్పు గోదావరి
డా బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ
శనివారం 30 ఆగస్టు 2025





www.viswamvoice.com

# రాజమండ్రినీ స్పోర్ట్స్ హబ్‌గా తీర్చిదిద్దుతాం

**ఆల్ ఇండియా సీనియర్ ర్యాంకింగ్ బ్యాడ్మింటన్ టోర్నమెంటు-2025**

**సెప్టెంబర్ 21నుంచి 28 వరకు..**

**నగరంలో జాతీయ స్థాయి బ్యాడ్మింటన్ పోటీలు..ఒక రోల్ మోడల్ గా నిలుస్తాయి**

**ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ వెల్లడి**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్:** బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (బిఎఐ) ఆంధ్రప్రదేశ్ అసోసియేషన్ (ఎబిఎన్ ఐ),సంయుక్త ఆధ్వర్యంలో యోనెక్స్ సన్రైజ్ ఆల్ ఇండియా సీనియర్ ర్యాంకింగ్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ 2025ను సెప్టెంబర్ 21 నుండి 28 వరకు రాజమండ్రిలోని సిటీ బ్యాడ్మింటన్ కోర్టులు, బొప్పన స్పోర్ట్స్ క్లబ్లో నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ (వాసు)చెప్పారు.శుక్రవారం సిటీ బ్యాడ్మింటన్ కోర్టులో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ భారతదేశం లో అతిపెద్ద సీనియర్ ర్యాంకింగ్ టోర్నమెంట్ను రాజమండ్రిలో నిర్వహించ డం ఇదే మొదటిసారి అది కూడా మన రాజమండ్రిలో రెండు వేదికలలో నిర్వహించడం,గర్వించే విషయమని అన్నారు.ఇది భారతదేశంలో అతిపెద్ద ర్యాంకింగ్ టోర్నమెంట్, ఈ టోర్నమెంట్లో దేశవ్యాప్తంగా దాదాపు 1500 మంది ఆటగాళ్ళు పాల్గొననున్నా రని ఆయన తెలిపారు. భారతదేశంలోని అగ్రశ్రేణి ఆటగాళ్ళు కూడా ఈ టోర్నమెంట్లో పాల్గొంటారని ఎమ్మెల్యే ఆదిరెడ్డివాసు చెప్పారు.గత ఏడాది మన రాజమండ్రిలో 78వ సౌత్ జోన్ ఇంటర్ స్టేట్ బ్యాడ్మింటన్ చాంపియన్ షిప్ -2024 పోటీలను విజయవంతంగా నిర్వహించామని,మళ్లీ ఇప్పుడు సీనియర్ ర్యాంకింగ్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ 2025 ను నిర్వహించేందుకు రాజమండ్రి ముస్తాబవుతోందని ఆయన సంతోషం వ్యక్తంచేశారు.గతంలో నిర్వహించిన ఇంటర్ స్టేట్ బ్యాడ్మింటన్ చాంపియన్షిప్లో ఐదు రాష్ట్రాల నుంచి క్రీడాకారులు పోటీలలో పాల్గొనడానికి వచ్చారని వాళ్ళందరికీ అద్భుతమైన ఆతిథ్యం అందించామని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు.ఆ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా కేంద్ర మంత్రి కె.రామ్మోహన్ నాయుడు,ఎంపీ పురందేశ్వరి,రాష్ట్రమంత్రి కందుల దుర్గేష్ పాల్గొన్నారని,ఈసారి జరిగే పోటీకూడా అంతకంటే ఘనంగా,భవిష్యత్తులో ఈ పోటీలు ఎవరు నిర్వహించాలని చూసినా రాజమండ్రి ఒక రోల్ మోడల్ గా వాళ్లకు నిలిచేలా విజయవంతంగా నిర్వహిస్తామని ఆయన చెప్పారు."ఈ పోటీలకు ముఖ్య అతిథులుగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి,రాజమండ్రి ఎంపీ పురందేశ్వరి,మంత్రి కందుల దుర్గేష్,ఇతర ఎమ్మెల్యేలు జిల్లా కలెక్టర్ , తదితరులు పాల్గొననున్నా రని. క్రీడాకారులు,క్రీడా అభిమానులు అందరూ కూడా ఈ కార్యక్రమంలో పాల్గొని దీనిని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు కోరారు.తాను ఎన్నికల సమయంలో రాజమండ్రిని స్పోర్ట్స్ హబ్ గా తీర్చిదిద్దుతానని హామీ ఇచ్చానని దానికి అనుగుణంగానే అనేక కార్యక్రమాలను చేపడుతున్నామని ఆయన వివరించారు.

క్రీడాకారులందరినీ ప్రోత్సహిస్తామని, దాంతోపాటు రాజమండి ఇన్ఫ్రాస్ట్రక్చర్ కి అనుగుణమైనటువంటి స్పోర్ట్స్ ను కచ్చితంగా ఇక్కడ డెవలప్ చేస్తూ ముందుకు తీసుకుని వెళ్తానని తాను ఆరోజు చెప్పినట్లుగా ఆచరణలో చేసి చూపిస్తున్నామని ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు చెప్పారు. రాజమండ్రిలో బ్యాడ్మింటన్ కి మంచి మౌలిక సదుపాయాలు ఉన్నాయని,అది దినదినాభివృద్ధి చెందుతూ నేడు జాతీయస్థాయి పోటీలను నిర్వహించే స్థాయికి వచ్చిందని ఇది మనమంతా కూడా గర్వించదగ్గ విషయమని అన్నారు.బ్యాట్మెంటన్ డిస్టిక్ కమిటీ, రాష్ట్ర కమిటీ సభ్యుల కృషి కూడా ఎంతో గొప్పదని,వారి దృఢ సంకల్పంతోనే మన రాజమండిలో బ్యాడ్మింటన్ కల్చర్ దినదినాభివృద్ధి చెందుతోందని.ఇతర క్రీడలు కూడా అభివృద్ధి చేసేందుకు ఎంతో కృషి చేస్తున్నారని ఈ సందర్భంగా వారిని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అభినందించారు.రాజమండ్రి నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తామని ఎన్నికల సమయంలో చెప్పామని , అదే బాటలో పయనిస్తున్నా మని,.ఈ పోటీలను విజయవంతం చేసి రాష్ట్రం చూపు రాజమండ్రి వైపు చూసే విధంగా చేస్తామని ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు ధీమా వ్యక్తం చేశారు. ఇప్పటికే మన రాజమండ్రి లో ముందు చూపుతో తాము చేస్తున్న ఎన్నో కార్యక్రమాలు ఎందరికో ఆదర్శంగా నిలుస్తున్నాయని,ఇటీవలే మంత్రి నారా లోకేష్ శ్రీశక్తి పథకంలో భాగంగా రాపిడ్ వారితో ఒప్పందం చేసుకొని మహిళ రైడర్ లకు సబ్సిడీలో ఎలక్ట్రిక్ వాహనాలు అందజేసి వారి సాధికారతకు తోడ్పడే నిర్ణయం తీసుకున్నారని, ఇదే కార్యక్రమాన్ని,ఆరు నెలల ముందు మన రాజమండ్రిలో గత మార్చి 28 న ప్రారంభించి,పింక్ మొబిలిటీ అనే కార్యక్రమం ద్వారా 25 మంది మహిళలకు సబ్సిడీతో ఎలక్ట్రిక్ వాహనాలను అందించామని ఆయన గుర్తు చేశారు. ఇదే సంవత్సరం ఏప్రిల్ లో గుంటూరులో వీధి కుక్కల దాడిలో మరణించిన ఘటన మనందరికీ తెలుసని, అప్పుడే ఈ సమస్యను తాము గుర్తించి మన రాజమండ్రిలో అలాంటి పరిస్థితి రావద్దని మంచి ఆలోచనతో కెనాల్సు సంఖ్య ,కుక్కలకు ఆపరేషన్ థియేటర్స్ పెంచామని, వీధి కుక్కలను అబ్జర్వేషన్లో పెట్టి వ్యాక్సిన్లు వేయించడం జరిగిందని ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు పేర్కొన్నారు.ఇటీవల గుంటూరు తరహా ఘటనే ఢిల్లీలో చోటుచేసుకుందని, ఈ విషయం అందరికీ తెలిసిందే దాంతో సుప్రీంకోర్టు వీది కుక్కల విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అబ్జర్వేషన్లో ఉంచాలని వ్యాక్సిన్లు వేయించాలని అక్కడి రాష్ట్ర ప్రభుత్వాన్ని సుప్రీంకోర్టు ఆదేశించిందని ఆయన చెప్పారు.ఇలా ఈ విధంగా రాజమండ్రిలో ఏది చేసినా కూడా ఎంతో మందికి అది ఒక రోల్ మోడల్ గా నిలుస్తుందని ఈ విషయంలో మనమంతా కూడా గర్వంగా భావించాలని ఆయన అన్నారు. ఇక్కడ పుట్టిన వాడిగా ఒక ప్రజా ప్రతినిధిగా ఈ ప్రాంతానికి ఏదైతే అవసరం ఉందో ఏం చేస్తే ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుందో అన్న ఒక్క ఆలోచనతో తాను ఈ కార్యక్రమాలను చేపడుతున్నట్లు ఆయన చెప్పారు. మున్ముందు కూడా ఇంకా ఎన్నో మంచి కార్యక్రమాలు చేపడుతామని క్రీడల్లో రాజమండికి పూర్వ వైభవం దిశగా అడుగులు వేస్తామని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ చెప్పారు. జిల్లా బ్యాండ్మింటన్ అసోసియేషన్ కొత్తపల్లి బాలు మాట్లాడుతూ రాజమండ్రిలో ఆల్ ఇండియా సీనియర్ ర్యాంకింగ్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ నిర్వహించడం వల్ల 1500 మంది అగ్రశ్రేణి క్రీడాకారులు హాజరవు తారని, వారంతా నగరంలోని వివిధ హెూటళ్ళలో బస చేయడం వల్ల వారం రోజుల పాటు హెూటళ్ళు రద్దీగా ఉండి వాటి యాజమాన్యాలకు ఆదాయం లభిస్తుందని అన్నారు.నేషనల్ టోర్నమెంట్ నిర్వహించడా నికి ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ ప్రోత్సాహం కారణమని ఆయన కృతజ్ఞతలు తెలిపారు. విలేకరుల సమావేశంలో అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ మద్దూరి శంకర్, కోశాధికారి బెజవాడ వెంకట్,ఏపీబీఏ ఉపాధ్యక్షులు చిట్టూరి రాంబాబు,ఈసి సభ్యులు ఇన్నమూరి దీపు,ఆకుల రాంబాబు,కర్రి నాగేశ్వర రావు, బొప్పన స్పోర్ట్స్ కాంప్లెక్స్ ప్రతినిధి బొప్పన కృష్ణ చైతన్య,సిబిసి ఎం డబ్ల్యు ఏ అధ్యక్షుడు సిహెచ్ గంగరాజు, నాయకులు కాశీ నవీన్ కుమార్,బుడ్డిగ రవి తదితరులు పాల్గొన్నారు.

## న్యాయవాదుల రాష్ట్ర మహాసభల పోస్టర్ ఆవిష్కరణ

**రాజ్యాంగ పరిరక్షణ అందరి బాధ్యత**

**రాజమండ్రి బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు అల్లంపల్లి రామకృష్ణ**




**రాజమహేంద్రవరం,విశ్వంవాయిస్ న్యూస్:** సమాజంలో జరుగుతున్న ప్రస్తుత పరిణామాల దృష్ట్యా రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవలసిన బాధ్యత అందరిమీద ఉందని రాజమండ్రి బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు అల్లంపల్లి రామకృష్ణ అన్నారు. ఇండియన్ లాయర్ల అసోసియేషన్ (ఐఎల్ఎ) ఆధ్వర్యంలో ఈనెల 30,31 తేదీల్లో గుంటూరు లో జరుగుతున్న ఇండియన్ లాయర్ల అసోసియేషన్ మహాసభల పోస్టరును ఆయన రాజమండ్రి బార్ అసోసియేషన్ ప్రాంగణంలో ఆవిష్కరించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ గుంటూరులో జరిగే రాష్ట్ర మహాసభలకు న్యాయవాదులంతా తరలిరావాలని కోరారు.ఐఎల్ఎ ఉమ్మడి తూర్పుగోదావరిజిల్లాల అధ్యక్షుడు టి.పృధ్విరాజు మాట్లాడుతూ న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపాలని, న్యాయవాదులపై జరుగుతున్న దాడులను అరికట్టేందుకు ప్రత్యేక చట్టం తేవాలని కోరారు.రాజమండ్రి బార్ అసోసియేషన్ ఐఎల్ఎ అధ్యక్షుడు కొత్తూరి ఆనంద్ కుమార్ మాట్లాడుతూ న్యాయవాదుల సమస్యలపై రాష్ట్ర మహాసభలో చర్చిస్తామని తెలిపారు.కార్యక్రమంలో న్యాయవాదులు పట్నాల శ్రీనివాస్,జి.మహాలక్ష్మి,అంబటి మురళీకృష్ణ,వై.ఎస్.స్వామి, ఆదిలక్ష్మి, వెంకటలక్ష్మి, అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు పంపిణి



**విశ్వం వాయిస్ న్యూస్, కొవ్వూరు** ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి మంజూరైన 2,30,000 విలువ గల చెక్కులని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు లబ్ధి దారులకి అందజేశారు. శుక్రవారం కొవ్వూరు లోని టిడిపి కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను లబ్ధిదారులకు ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల వైద్య ఖర్చులకు ప్రభుత్వం తమ వంతు ఆసరాగా నిలవాలనే ద్యేయంతో ఈ సహాయ నిధి ప్రారంభించాం అన్నారు. ఈ కార్యక్రమంలో ద్వి సభ్య కమిటీ సభ్యులు కంఠమని రామకృష్ణ, జొన్నలగడ్డ సుబ్బరాయ చౌదరి, టీడీపీ సీనియర్ నాయకులు సూర్యదేవర రంజిత్ కుమార్, బేతిన నారాయణ, కొప్పాక జవహర్ , పసలపూడి హరి బాబు, నీలిమ, పెనుమాక జయరాజు, బీజేపీ నాయకులు ముత్యాలరావు, పిల్లలమట్టి మురళి తదితర ఎన్డీయే కూటమి నాయకులు పాల్గొన్నారు

## స్వామిత్వ రీ సర్వే పనుల్లో ఖచ్చితత్వం పాటించాలి.



కోరుకొండ విశ్వం వాయిస్ న్యూస్: రాష్ట్రప్రభుత్వం ఆదేశాల మేరకు జిల్లా యంత్రాంగం అంతా స్వామిత్వ రీసర్వే పనులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి తెలిపారు.శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో స్వమిత్ర, రీసర్వే పనులపై కలెక్టర్ మండలస్థాయి అధికారులతో సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ రీసర్వే పనులలో ఖచ్చితత్వం చేపడుతున్న సమస్యలు ఉత్పన్నమవుతున్నాయన్నారు. వ్యవస్థను స్థిరీకరించడానికి ఇంచార్జ్ ఎంపీడీ నోడల్ అధికారిగానే కాకుండా అధికారులు అందరు తమవిధులను సక్రమంగా నిర్వహించేటట్లు చూడాల న్నారు. పర్యవేక్షణాధికారులు తమ బాధ్యతలను ఖచ్చితంగా నిర్వర్తించాలని, కేవలం ఆదేశాలు ఇచ్చానని చెప్పడం సరికాదన్నారు.ప్రజలకు పౌరసేవలు అందించే క్రమంలో నిర్లిప్తత వహిస్తే సహించేది లేదని అన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలకు అనుగుణంగా బాధ్యతల నిర్వహణలో ఖచ్చితత్వం పాటించాలని స్పష్టం చేశారు. క్షేత్రస్థాయిలో డాక్యుమెంట్లు సమకూర్చే బాధ్యత ఎంపీడీవోదేనని, సాంకేతిక సహకారం అందించే బాధ్యత తహశీల్దార్లదేనని తెలిపారు.డేటా ప్రక్రియలో ఎటువంటి తప్పిదాలకు ఆస్కారం ఉండకూడదని చూడాలన్నారు. కోరుకొండ మండల పరిధిలో పేజ్ వారీగా తొలి దశలో రీసర్వే పూర్తి చేశామని, రెండు గ్రామాల్లో గ్రౌండ్ ట్రూథింగ్ పనులు 100% పూర్తి చేశామని నివేదిక ఇచ్చినప్పటికీ, అన్ని గ్రామాలు పూర్తయ్యాయని చూపడం పట్ల కలెక్టర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డివిజనల్ అభివృద్ధి అధికారి పి వీణాదేవి, ఇంచార్జ్ ఎంపీడీవో బి మహేష్ ప్రతాప్, సెక్రటరీలు తదితరులు పాల్గొన్నారు.

## వైసిపి నేతలను జైల్లో పెట్టడం ఆనవాయితీగా మారింది

**పచ్చి అబద్ధాలతో ప్రభుత్వం పన్నిన కుట్ర ఇది**

**మాజీమంత్రి ధర్మాన కృష్ణ దాస్,భూమన కరుణాకర్ రెడ్డి**

**జైలులో మిథున్ రెడ్డిని కలిసిన ధర్మాన కృష్ణదాస్, భూమన కరుణాకర్ రెడ్డి, డా. గూడూరి శ్రీనివాస్**



**రాజమహేంద్రవరం, విశ్వంవాయిస్ న్యూస్:** మద్యం కుంభకోణంలో రాజమండ్రి సెంట్రల్ జైల్లో ఉన్న ఎంపీ మిథున్ రెడ్డిని టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి, మాజీ మంత్రి ధర్మాన కృష్ణ దాస్,డాక్టర్ గూడూరు శ్రీనివాసరావు పరామర్శించేందుకు చేరుకున్నారు. జైలులో మిథున్ రెడ్డినీ కలసిన అనంతరం బయట పాత్రికేయుల సమావేశాన్ని మాజీ మంత్రి ధర్మాన కృష్ణ దాస్ ,టిటిడి మాజీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి నిర్వహించారు.కరుణాకర్ రెడ్డిమాట్లాడుతూ దొంగ నోట్ల దొంగ ఓట్ల రాజ్యం ఒక రాజ్యమే కాదు..వైసిపి నేతలను కార్యకర్తలను చంబల్ లోయ దొంగలుగా వెంటాడుతున్నారు. వైసిపి నేతలను జైల్లో పెట్టడం ఆనవాయితీగా మారింది. జగన్మోహన్ రెడ్డి దగ్గర పని చేసిన నిజాయితీ అధికారుల ను కూటమి ప్రభుత్వం అక్రమ అరెస్టులు చేస్తుంది.ఇటువంటి అరెస్టులకు మేము భయపడము. మా నైతికతను ప్రజలలో పలచన చేయాలని చూస్తున్నారు. ప్రజలను చైతన్యవంతులు చేస్తూ మళ్ళీ ఆయన నాయకత్వంలో పోరాటాలు చేసుకునే ఉంటాం.జైల్లో మిథున్ రెడ్డి చాలా ధైర్యంగా ఉన్నారు.పచ్చి అబద్ధాలతో ప్రభుత్వం పన్నిన కుట్ర ఇది.. ఐఏఎస్ అధికారి శ్రీలక్ష్మి మీద నేను ఎటువంటి విమర్శలు చేయలేదు. మాజీ మంత్రి కృష్ణదాస్ మాట్లాడుతూ మిథున్ రెడ్డిని అక్రమంగా ఈ ప్రభుత్వం అరెస్టు చేసింది. వైసిపి నేతలను టార్గెట్ చేసి అరెస్టు చేస్తున్నారు అని అన్నారు.పాత్రికేయుల సమావేశంలో మాజీ ఎంపీ మార్గాని భరత్ రామ్,మాజీ మంత్రి చెల్లుబోయిన వేణు గోపాలకృష్ణ, న్యాయవాది హాసన్, బిల్డర్ చిన్న, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

## మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం విజయవంతం

**తెలుగు మహిళల ఆధ్వర్యంలో చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం**



**రాజమహేంద్రవరం,విశ్వం వాయిస్ న్యూస్:** కూటమి అధికారంలోకి రావడంతోనే మహిళలకు అన్ని విధాల వెలుగులు తెచ్చిందని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ (వాసు) అన్నారు. స్త్రీ శక్తి పథకంలో భాగమైన మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం విజయవంతమైన నేపథ్యంలో రాజమండ్రి పార్లమెంట్ మహిళ కమిటీ అధ్యక్షురాలు మాలే విజయలక్ష్మి ఆధ్వర్యంలో నగర మహిళ కమిటీ అధ్యక్షురాలు కోసూరి చండీప్రియ పర్యవేక్షణలో రాజమండ్రి ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడి చిత్రపటానికి సుమారు వెయ్యి మంది మహిళలతో పాలాభిషేకం జరిగింది.ఈ కార్యక్రమానికి నగర శాసనసభ్యులు ఆదిరెడ్డి శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పాలాభిషేకం అనంతరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో మహిళల అభివృద్ధికి మంచి అవకాశాలు వస్తున్నాయన్నారు.ఉచిత బస్సు ప్రయాణం మహిళలకు బాగా ఉపయోగపడుతోందన్నారు.మహిళల అభివృద్ధి ముఖ్యమని చంద్రబాబు నాయుడు నమ్మారు కాబట్టే గతంలో డ్వాక్రా గ్రూపులను ఏర్పాటు చేశారని, కట్టెల పొయ్యి వద్ద ఇబ్బంది పడకూడదనే దీపం పథకాన్ని ప్రారంభించారని గుర్తు చేశారు.ఆనాడు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాటిన డ్వాక్రా విత్తనం ఇప్పుడు మహా వృక్షమైందన్నారు. అన్ని రంగాల్లో మహిళలకు పురుషులతో సమానంగా ఉండాలన్నదే చంద్రబాబు ధ్యేయమని, కొన్ని రంగాల్లో అది కూడా జరుగుతోందన్నారు. తాము అధికారంలోకి వచ్చిన తరువాత మహిళల కోసం నిర్వహించిన మీ భద్రత %-% మా బాధ్యత కార్యక్రమానికి విశేష స్పందన వచ్చిందన్నారు.మహిళలు ధైర్యంగా ముందుకు వచ్చి వారి సమస్యలను చెప్పారని, ఆయా స్టేషన్ల పరిధిలో వారి సమస్యలను పరిష్కరించడం జరిగిందన్నారు. ముఖ్యంగా నగరంలో అల్లరి మూకలపై చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు.బ్లేడ్ బ్యాచ్, గంజాయి బ్యాచ్‌లకు చాలా వరకూ కళ్లెం వేయడం జరిగిందన్నారు. మహిళల రక్షణే తమకు ముఖ్యమన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన అన్ని హామీలను దాదాపుగా అమలు చేయడం జరుగుతోందన్నారు. త్వరలోనే అర్హులైన పేద మహిళలకు రెండు సెంట్ల భూమిని ఇవ్వడం జరుగుతుందన్నారు. చంద్రబాబు చిత్ర పటానికి పాలాభిషేకం నిర్వహిస్తున్న సమయంలో మహిళలు, నాయకులు అంతా కలిసి "సూపర్ సిక్స్ %-%సూపర్ హిట్" అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ అప్పారావు, ఏపీ శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ కుడుపూడి సత్తిబాబు, నాయకులు కాశీ నవీన్ కుమార్, మజ్జి రాంబాబు, దొండపాటి సత్యంబాబు, ఉప్పులూరి జానకీ రామయ్య,కిలపర్తి శ్రీను, కొల్లు బుజ్జి,కంటిపూడి రాజేంద్రప్రసాద్,కొయ్యల రమణ,కప్పల వెలుగు కుమారి,బోను ఈశ్వరి, మీసాల నాగమణి, కేలం శ్రీను,సలాది ఆనంద్,అధిక సంఖ్యలో మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## కోరుకొండ సమస్యల పరిష్కారానికి కలెక్టర్ సహకరించా : బి సర్పంచ్ కర్రి.

**కోరుకొండ విశ్వం వాయిస్ న్యూస్:** కోరుకొండలో ప్రజలు అనునిత్యం అనేక సమస్యలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వాటి పరిష్కారానికి కలెక్టర్ సహకరించాలని కోరుకొండ సర్పంచ్ కర్రి లక్ష్మీసరోజ గణేష్ పలు సమస్యలను ఆమె దృష్టికి తీసుకువెళ్లారు. శుక్రవారం కలెక్టర్ ప్రశాంతి రీసర్వే, స్వమిత్ర సమీక్ష సమావేశానికి కోరుకొండ ఎంపీడీవో కార్యాలయానికి విచ్చేశారు. కోరుకొండ ఎంపీడీవో కార్యాలయంలో సర్పంచ్ కర్రి లక్ష్మి సరోజ గణేష్ కలెక్టర్ ను మర్యాదపూర్వకంగా కలిసి అనునిత్యం ప్రజలు ట్రాఫిక్ సమస్యలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఆర్టీసీ కాంప్లెక్స్ ప్రాంగణంలో ఆక్రమణలు ఎక్కువగా ఉన్నాయని, కోరుకొండ మండలంలో రుడా అనుమతులు లేకుండా అక్రమ భవనాలు జోరుగా నిర్మిస్తున్నారని, దీంతో ప్రభుత్వానికి రావలసిన ఆదాయం గండిపడుతుందని వీటిపై దృష్టి సారించి, పంచాయతీ అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఈ సమస్యల పరిష్కారానికి కృషిచేసి, పంచాయతీ అభివృద్ధికి సహకరిస్తానని కలెక్టర్ హామీ ఇచ్చినట్లు కర్రి దంపతులు తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజినల్ అభివృద్ధి అధికారిణి పి వీణదేవి, ఇన్చార్జ్ ఎంపీడీవో ప్రతాప్, సెక్రటరీలు తదితరులు పాల్గొన్నారు.



# ఎడిటర్ వాయిస్

## చిన్న పరిశ్రమలతోనే ఆర్థికాభివృద్ధి

ఆగస్టు 30వ తేదీని భారత దేశంలో చిన్న పరిశ్రమల దినోత్సవంగా జరుపుకుంటారు. దేశ ఆర్థిక వ్యవస్థలో చిన్న, సూక్ష్మ, మధ్య తరహా పరిశ్రమల ప్రాధాన్యాన్ని గుర్తించి వాటి అభివృద్ధి, సవాళ్లు, అవకాశాలపై చర్చించుకునే సందర్భమిది. చిన్న పరిశ్రమలు కేవలం ఉత్పత్తి యూనిట్లుగానే కాకుండా లక్షలాది మందికి ఉపాధి అవకాశాలను కల్పిస్తూ గ్రామీణాభివృద్ధికి దోహదం చేస్తాయి. స్వదేశీ ఉత్పత్తుల ఆధారంగా దేశ ఆర్థిక వ్యవస్థకు బలం చేకూర్చే ప్రధాన ఆధారంగా నిలుస్తాయి. స్వాతంత్ర్యం అనంతరం భారతదేశం ఆత్మనిర్భర దిశగా పయనించే క్రమంలో చిన్న పరిశ్రమల ప్రాముఖ్యత మరింత పెరిగింది. పెద్ద పరిశ్రమలకు విస్తారమైన మూలధనం, ఆధునిక యంత్రాంగం అవసరమవుతుంటే చిన్న పరిశ్రమలు తక్కువ పెట్టుబడితో పరిమిత వనరులను వినియోగించి స్థానిక అవసరాల కనుగుణంగా అభివృద్ధి చెందగల సామర్థ్యాన్ని కలిగి ఉంటాయి. అందువల్లే గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో చిన్న స్థాయి యూనిట్లు విస్తృతంగా పెరిగి ఉపాధి, ఉత్పత్తి రంగాల్లో ప్రభావాన్ని చూపుతున్నాయి.చిన్న పరిశ్రమల దినోత్సవం చరిత్రను పరిశీలిస్తే 2000వ సంవత్సరంలో కేంద్ర ప్రభుత్వం ఈ రంగం కోసం సమగ్ర విధాన ప్యాకేజీని ప్రకటించింది. రుణ సౌకర్యాలు, మౌలిక సదుపాయాలు, సాంకేతిక సహాయం వంటి అంశాలు ఆ ప్యాకేజీలో భాగమయ్యాయి. ఆ సందర్భంలో ఆగస్టు 30న ఢిల్లీలో జాతీయ సదస్సు జరిగింది. దేశ వ్యాప్తంగా ఉన్న చిన్న పరిశ్రమల ప్రతినిధులు పాల్గొన్న ఆ సదస్సు ఈ రంగానికి చారిత్రక మలుపు తీసుకొచ్చింది. దానికి గుర్తుగా ప్రతి సంవత్సరం ఆగస్టు 30ని చిన్న పరిశ్రమల దినోత్సవంగా జరుపు కోవాలని నిర్ణయించారు. చిన్న పరిశ్రమలు భారతదేశ ఆర్థికాభివృద్ధిలో గణనీయమైన పాత్ర పోషిస్తున్నాయి. వ్యవసాయ రంగం తరువాత అత్యధిక ఉపాధి కల్పిస్తున్న రంగం ఇదే. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో లక్షలాది కుటుంబాలకు జీవనోపాధి అందిస్తున్నాయి. దేశ స్థూల దేశీయోత్పత్తిలో సుమారు 30 శాతం వాటా ఈ రంగానిదే. తయారీ, సేవల రంగాల్లో ఇవి కీలక పాత్ర పోషిస్తున్నాయి. భారత దేశం నుంచి జరిగే ఎగుమతుల్లో దాదాపు 40 శాతం వాటా చిన్న పరిశ్రమల ఉత్పత్తులదే. తోలు వస్తువులు, చేనేత వస్త్రాలు, హస్త కళలు, యంత్ర భాగాలు వంటి ఉత్పత్తులు విదేశీ మారక ద్రవ్యం సంపాదించడంలో ముఖ్య భూమిక వహిస్తున్నాయి. అదే విధంగా చిన్న పరిశ్రమలు దేశంలోని అన్ని ప్రాంతాల్లో విస్తరించి ఉండడం వల్ల ప్రాంతీయ అసమానతలను తగ్గించడంలో కూడా ప్రధాన పాత్ర పోషిస్తున్నాయి. వెనుక బడిన ప్రాంతాల ప్రజలకు ఉపాధి అవకాశాలు కల్పించి గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేస్తున్నాయి. ప్రభుత్వం చిన్న పరిశ్రమల అభివృద్ధి కోసం అనేక పథకాలు చేపట్టింది. ముద్ర యోజన ద్వారా తక్కువ వడ్డీకే రుణాలను అందజేస్తూ కొత్తగా వ్యాపారాలు ప్రారంభించే ఔత్సాహికులను ప్రోత్సహిస్తోంది. 'ఉద్యమ్ రిజిస్ట్రేషన్' పోర్టల్ ద్వారా పరిశ్రమల నమోదు ప్రక్రియను సులభతరం చేసింది. 'మేక్ ఇన్ ఇండియా', 'స్టార్ట్-అప్ ఇండియా', 'వొకల్ ఫర్ లోకల్' వంటి కార్యక్రమాల ద్వారా స్వదేశీ ఉత్పత్తులను ప్రోత్సహిస్తూ కొత్త అవకాశాలను కల్పిస్తోంది. యువతకు నైపుణ్య శిక్షణ ఇచ్చే 'స్కిల్ ఇండియా మిషన్' కూడా చిన్న పరిశ్రమల్లో ఉపాధి పొందేందుకు దోహదం చేస్తోంది. ఈ దినోత్సవం సందర్భంగా దేశ వ్యాప్తంగా సదస్సులు, వర్క్‌షాప్‌లు, అవార్డుల ప్రదానోత్సవాలు జరుగుతాయి. చిన్న పారిశ్రామిక వేత్తలు, నిపుణులు తమ అనుభవాలను పంచుకుంటారు. అయితే చిన్న పరిశ్రమలు ఎదుర్కొంటున్న సవాళ్లు కూడా అనేకం. నాణ్యమైన ముడిసరుకు కొరత, రుణ సౌకర్యాల లోపం, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులో లేకపోవడం, గ్లోబల్ మార్కెట్ పోటీ, దిగుమతుల ఒత్తిడి వంటి సమస్యలు వాటి ఎదుగుదలకు అడ్డంకులుగా మారుతున్నాయి. ముఖ్యంగా కోవిడ్%-%19 సమయంలో అనేక చిన్న పరిశ్రమలు మూత పడటంతో ఉపాధి కోల్పోయిన కుటుంబాలు ఎన్నో. దీని ద్వారా ఈ రంగాన్ని కేవలం ప్రోత్సాహక పథకాలతో కాకుండా దీర్ఘకాల వ్యూహాలతో, మౌలిక సదుపాయాల బలోపేతంతో ముందుకు నడిపించాల్సిన అవసరం స్పష్టమవుతుంది.



ఎడిటర్ : కె. సునీల్‌కుమార్

# బలవంతపు అదృశ్యాలు మానవ హక్కులపై చెరగని మచ్చలు


ప్రపంచ వ్యాప్తంగా ప్రతి సంవత్సరం ఆగస్టు 30న అంతర్జాతీయ తప్పిపోయిన వారి దినోత్సవం జరుపుకుంటారు. ఈ దినోత్సవం వెనుక ఉన్న నేపథ్యం మానవ హక్కుల చరిత్రలో ఒక గాఢమైన అధ్యాయం. 1981లో లాటిన్ అమెరికాలో సైనిక నియంతృత్వ పాలనల సమయంలో బలవంతంగా అదృశ్యమైన వారి కుటుంబాలు ఈ దినోత్సవానికి శ్రీకారం చుట్టాయి. ఆ సమయంలో ప్రభుత్వాలకు వ్యతిరేకంగా స్వరం వినిపించినవారు, రాజకీయ కార్యకర్తలు, సామాజిక ఉద్యమ కారులు అనేకమంది అదృశ్యమయ్యారు. వారి కుటుంబాలు ఆవేదనతో ప్రభుత్వాలను ప్రశ్నిస్తూ, కనీసం వారి ప్రాణస్థితి గురించి అయినా తెలియజేయమని డిమాండ్ చేశాయి. కోస్టారికాలో జరిగిన మొదటి లాటిన్ అమెరికన్ ఫెడరేషన్ ఆఫ్ అసోసియేషన్స్ ఆఫ్ రిలేటివ్స్ ఆఫ్ డిటెయినీస్-డిసప్పియర్డ్ సమావేశంలో ఆగస్టు 30ను అంతర్జాతీయ తప్పిపోయిన వారి దినోత్సవంగా ప్రకటించారు. అనంతరం 2011లో ఐక్యరాజ్యసమితి ఈ రోజును అధికారికంగా గుర్తించింది. దానికి ముందే 1980లోనే ఐక్యరాజ్యసమితి "ఎన్‌ఫోర్స్‌డ్ లేదా ఇన్వాలంటరీ డిసపియరెన్సెస్‌పై వర్కింగ్ గ్రూప్"ను ఏర్పాటు చేసి, ఈ మానవ హక్కుల ఉల్లంఘనపై పరిశీలన మొదలుపెట్టింది. 2006లో "తప్పిపోయిన వారిని రక్షించడానికి అంతర్జాతీయ కన్వెన్షన్" ఆమోదించబడింది. ఈ నేపథ్యంలో ఆగస్టు 30 అంతర్జాతీయంగా ఒక ముఖ్యమైన మానవ హక్కుల దినోత్సవంగా నిలిచింది. ఎన్‌ఫోర్స్‌డ్ డిసపియరెన్స్ అంటే ప్రభుత్వ యంత్రాంగం, భద్రతా బలగాలు లేదా ఆయుధధారులచే ఎవరినైనా బలవంతంగా అదుపులోకి తీసుకోవడం, కానీ వారి స్థితి గురించి సమాచారం ఇవ్వకపోవడం. ఇది కేవలం వ్యక్తిగత స్వేచ్ఛను హరించడమే కాకుండా, వారి కుటుంబాలను మానసికంగా, సామాజికంగా, ఆర్థికంగా పీడించే ఘోరమైన మానవ హక్కుల ఉల్లంఘన. అదృశ్యమైన వారిని వెతికే ప్రయత్నంలో కుటుంబాలు అంతులేని బాధను అనుభవిస్తాయి. వారు బ్రతికే ఉన్నారా? లేక మరణించారా? అన్న ప్రశ్నకు సమాధానం లేక, అంతులేని ఆవేదనతో రోజులు గడుపుతారు. ప్రపంచ వ్యాప్తంగా ఈ సమస్య తీవ్రంగా ఉంది. లాటిన్ అమెరికాలో 1970-80 దశాబ్దాల్లో సైనిక నియంతృత్వ పాలనల సమయంలో వేలమంది రాజకీయ నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు, సామాన్యులు అదృశ్యమయ్యారు. అర్జెంటీనా, చిలీ, గ్వాటెమాలా, ఎల్ సాల్వడార్ వంటి దేశాల్లో ఇప్పటికీ వేల కుటుంబాలు తమ సన్నిహితుల కోసం న్యాయం కోరుతూ పోరాడుతున్నాయి. ఆసియాలో శ్రీలంకలో గృహయుద్ధం



సమయంలో, నేపాల్‌లో రాజకీయ అస్థిరత కాలంలో, బంగ్లాదేశ్ మరియు పాకిస్తాన్‌లలో కూడా ఈ సమస్య విస్తరించింది. మధ్యప్రాచ్యంలో సిరియా, ఇరాక్, లెబనాన్ వంటి దేశాలలో అంతర్గత యుద్ధాలు, ఉగ్రవాదం కారణంగా లక్షలాది మంది అదృశ్యమయ్యారు. ఐక్యరాజ్య సమితి అంచనా ప్రకారం ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా లక్షల సంఖ్యలో ఇలాంటి కేసులు నమోదయ్యాయి. భారతదేశంలో కూడా ఈ సమస్యను పూర్తిగా విస్మరించలేము. కాశ్మీర్ లోయ, ఈశాన్య రాష్ట్రాల్లో తిరుగుబాట్లు, ఉగ్రవాదం, భద్రతా చర్యల కారణంగా అనేక కుటుంబాలు తమ సన్నిహితులను కోల్పోయిన ఉదంతాలు వెలుగులోకి వచ్చాయి. మానవ హక్కుల సంఘాలు, పౌర సమాజం, బాధిత కుటుంబాలు నిరంతరం ప్రభుత్వాలను ఒత్తిడి చేస్తూ నిజం వెలికితీయాలని, బాధితులకు న్యాయం జరగాలని డిమాండ్ చేస్తున్నాయి. ఈ దినోత్సవం మనకు గుర్తుచేసేది మూడు కీలక విషయాలను. మొదట, బలవంతపు అదృశ్యాలు మానవతా వ్యతిరేక నేరమని ప్రపంచ దేశాలు ఖచ్చితంగా గుర్తించాలి. రెండవది, అదృశ్యమైన వారి కుటుంబాలకు సత్యాన్ని తెలియజేయడం, న్యాయం జరగడం, పరిహారం అందించడం ప్రభుత్వాల బాధ్యత. మూడవది, భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చట్టపరమైన, రాజకీయపరమైన సంస్కరణలు చేపట్టాలి. అంతర్జాతీయ తప్పిపోయిన వారి దినోత్సవం కేవలం ఒక జ్ఞాపక దినం కాదు, అది మానవ హక్కుల కోసం జరుగుతున్న నిరంతర పోరాటానికి ప్రతీక. ఈ రోజు మౌనంగా ఉన్నా గుండెలను తాకే ప్రశ్న అడుగుతుంది – ఒక మనిషి అదృశ్యమవడం అంటే కేవలం అతని ఉనికినే కాదు, ఒక కుటుంబ ఆశలనూ, సమాజ నైతికతనూ దొంగిలించడమే కాదా? బాధిత కుటుంబాలకు సత్యం వెలుగులోకి రావడం, వారికి న్యాయం జరగడం, మానవ హక్కులు గౌరవించబడే సమాజం ఏర్పడే వరకు ఈ పోరాటం కొనసాగుతూనే ఉంటుంది. తప్పిపోయిన వారి దినోత్సవం మనకు ఒక గాఢమైన పాఠాన్ని నేర్పుతుంది – ఎలాంటి రాజకీయ పరిస్థితులు, యుద్ధాలు, ఉగ్రవాదం, లేదా శక్తి ప్రదర్శన అయినా ఒక మనిషి ప్రాణం, స్వేచ్ఛ, గౌరవం కంటే గొప్పది కాదు. కనుక ప్రతి దేశం తమ చట్టపర, నైతిక బాధ్యతను నెరవేర్చుతూ, మానవ హక్కులను కాపాడడం అత్యంత అవసరం.

# అణు భౌతిక శాస్త్ర పితామహుడు

ఎర్నెస్ట్ రూథర్‌ఫోర్డ్ (ఆగస్టు 30 1871 - అక్టోబరు 19 1937) న్యూజీలాండ్ కు చెందిన ఒక రసాయనిజ్ఞుడు, ఇతనికి అణు భౌతిక శాస్త్ర పితామహుడు అనే బిరుదు గలదు. రసాయన శాస్త్రంలో నోబెల్ బహుమతి (1908) పొందాడు. అణువులలో శక్తితో కూడిన కేంద్రకం వుంటుందని కనిపెట్టాడు. పరమాణువులో ఎలక్ట్రాన్, ప్రోటాన్, న్యూట్రాన్ అనే మూడు ముఖ్యమైన మూలకణాలున్నాయి. ఈ కణాలు పరమాణువులో ఏ విధంగా అమరి ఉన్నాయో తెలియజెప్పేదే పరమాణు నిర్మాణం. దీనికి సంబంధించి శాస్త్రవేత్తలు ఎన్నో నమూనాలను ప్రవేశపెట్టారు. అందులో రూథర్ ఫర్డ్ నమూనా ఒకటి. తను చేసిన ఖ- కణ పరిక్షేపణ ప్రయోగ పరిశీలనల ఆధారంగా ఈ నమూనాని ప్రతిపాదించాడు. అణువు యొక్క రూథర్‌ఫోర్డ్ నమూనా (లేదాగ్రహ మండల నమూనా, ఇదే సిద్దాంతం ఆ తరువాత బోర్ నమూనా లేదా కక్ష్యా నమూనాగా ఏర్పడడానికి దోహదపడింది) ను ప్రతిపాదించాడు. ఇతడు రూథర్‌ఫోర్డ్ ఖ-కణ పరిక్షేపణ ప్రయోగాన్ని బంగారు రేకు గుండా ఖ-కణ పరిక్షేపణ ప్రయోగంచేసి కెంద్రకం యొక్క ఉనికిని కనిపెట్టాడు. ఇతడికి 1908లో రసాయనిక శాస్త్రంలో నోబెల్ బహుమతి లభించింది. న్యూజిలాండ్ లోని నెల్సన్ లో 1871 ఆగస్టు 30న జన్మించిన రూథర్‌ఫర్డ్ కు చిన్నతనంలోనే సైన్స్ పట్ల అభిరుచి కలిగింది. పదేళ్లకే ఎలిమెంటరీ ఫిజిక్స్ పుస్తకాన్ని క్షుణ్ణంగా చదివేశాడు. న్యూజిలాండ్ విశ్వ విద్యాలయంలో స్కాలర్‌షిప్‌తో చేరిన అతడు బీఏ, ఎమ్ఏ, బీఎస్సీ డిగ్రీలు సాధించాడు. ఇంగ్లండ్ లోని కేంబ్రిడ్జి విశ్వ విద్యాలయంలో పోస్ట్‌గ్రాడ్యుయేషన్ చేస్తూనే అత్యంత వేగంగా ప్రయాణించే విద్యుదయస్కాంత తరంగాలను కనిపెట్టి ప్రపంచ రికార్డు సాధించాడు. ఇరవై ఏడేళ్ల వయసులోనే కెనడాలోని మెగిల్ విశ్వ విద్యాలయంలో ప్రొఫెసర్‌గా చేరి పరిశోధనల్లో నిమగ్న మయ్యాడు. అక్కడే యురేనియం, థోరియంలాంటి రేడియోధార్మిక పదార్థాలు వెలువరించే ఆల్ఫా, బీటా వికిరణాలను ఆవిష్కరించాడు. రేడియో ధార్మిక విఘటనం నియమాలను ప్రతిపాదించాడు. ఒక రేడియో ధార్మిక పదార్థంలో ఉండే సగం పరమాణువులు విఘటనం చెందడానికి పట్టే 'అర్థ జీవిత కాలం' ను నిర్వచించాడు. ఈ



సూత్రం ప్రకారం రేడియో డేటింగ్ పద్ధతి ద్వారక్వ భూమి వయస్సును కూడా కనుగొనవచ్చని చెప్పాడు. అలాగే కృత్రిమ మూలకాల పరివర్తన ద్వారా నైట్రోజన్‌ను, ఆక్సిజన్‌గా మార్చవచ్చని తెలిపాడు. ఈ పరిశోధనలకు 1908లో నోబెల్ బహుమతి అందుకున్నాడు. కెనడా నుంచి ఇంగ్లండ్ తిరిగి వచ్చిన తర్వాత పలుచటి బంగారు రేకుపై ధనావేశమున్న ఆల్ఫాకిరణాలను ప్రసరింప చేసినప్పుడు 20000 కణాలలో ఒకటి వెనక్కి తిరిగి రావడాన్ని గమనించాడు. అందుకు కారణం పరమాణువులో ధనావేశమున్న కేంద్రకం ఉండటం కారణంగా కేంద్రకంలో ఉండే ప్రోటాన్లు వాటిని వికర్షించడమేనని కనుగొన్నాడు. సూర్యుడి చుట్టూ గ్రహాలు తిరుగుతున్నట్టే, పరమాణువుల్లోని కేంద్రకం చుట్టూ ఎలక్ట్రాన్లు తిరుగుతూ ఉంటాయని ప్రతిపాదించాడు. ఇదే రూథర్‌ఫర్డ్ పరమాణు నమూనాగా పేరొందింది. దీనినే గ్రహమండల నమూనా అంటారు. ఆ తర్వాత కేంద్రకంలో ప్రోటాన్లతో పాటు న్యూట్రాన్లు ఉంటాయని ఊహించాడు. రసాయన చర్యలతో ఒక మూలకాన్ని వేరొక మూలకంగా మార్చలేం. కానీ కేంద్రక చర్యలతో ఒక మూలకాన్ని మరొక మూలకంగా మార్చవచ్చు. స్థిరమైన మూలక కేంద్రకాలను ఖ - కణం లేదా ప్రోటాన్‌తో తాడించడం వల్ల వాటిని వేరొక మూలకాలుగా మార్చొచ్చు. ఈ ప్రక్రియను కృత్రిమ పరివర్తనం అంటారు. రూథర్‌ఫర్డ్ మొదటిసారిగా నత్రజనిని ఆక్సిజన్‌గా మార్చాడు. ఆ విధంగా ఏర్పడిన మూలకాలు కొన్ని రేడియో ధార్మికతను ప్రదర్శిస్తాయి. వాటిని రేడియో ఐసోటోపులు అంటారు. వాటిని మనం వైద్యరంగంలో, వ్యవసాయ రంగంలో, పరిశ్రమల్లో ఉపయోగిస్తున్నాం .ఆయన శిష్యుల్లో చాలా మంది నోబెల్ బహుమతులు సాధించడం విశేషం. అనేక అవార్డులు సాధించిన ఆయన గౌరవార్థం 104 అణుసంఖ్య ఉన్న మూలకానికి రూథర్ ఫోర్డియం అని పేరు పెట్టారు.

# సెట్లో శ్రమ ... బడ్జెట్‌లో భారం

తెలుగు సినిమా పరిశ్రమలో ఇటీవలి కాలంలో సినీ కార్మికుల వేతనాల పెంపుదల అంశం మళ్లీ ప్రధాన చర్చా విషయమైంది. దాదాపు 24 విభాగాలకు పైగా చెందిన టెక్నీషియన్లు, కూలీలు, సహాయక సిబ్బంది ప్రస్తుత ద్రవ్యోల్బణ పరిస్థితుల్లో జీవన వ్యయాలకు సరిపడేలా వేతనాలు పెంచాలని గళం ఎత్తుతున్నారు. ప్రస్తుతం సెట్ కార్పెంటర్‌లు రోజుకు సగటు రూ. 1,200 నుండి రూ. 1,500 వరకు, లైటింగ్ అసిస్టెంట్లు రూ. 1,000 నుండి రూ. 1,400 వరకు, మేకప్ ఆర్టిస్టులు రూ. 1,500 వరకు, డ్రైవర్లు రూ. 1,200 వరకు, జూనియర్ ఆర్టిస్టులు రోజు రూ. 800 నుండి రూ. 1,000 వరకు వేతనం పొందుతున్నారు. అయితే పెరుగుతున్న కిరాయిలు, ఆహార ధరలు, వైద్య ఖర్చులు, పిల్లల విద్య వ్యయాలను దృష్టిలో ఉంచుకుని, ఈ వేతనాలను కనీసం 30 నుండి 50 శాతం వరకు పెంచాలని కార్మికులు కోరుతున్నారు. అంటే, సెట్ కార్పెంటర్‌ల వేతనం రూ. 1,800 నుండి రూ. 2,200కు, లైటింగ్ అసిస్టెంట్లది రూ. 1,500 నుండి రూ. 2,000కు, జూనియర్ ఆర్టిస్టులది రూ. 1,200 వరకు పెంచాలని డిమాండ్ ఉంది. ఈ సమస్యను పరిష్కరించాలన్న ఉద్దేశంతో సినీ కార్మిక సంఘాలు ఇటీవల పలు సమావేశాలు నిర్వహించి, వేతనాల పెంపు అంశాన్ని నిర్మాతల మండలికి అధికారికంగా వినిపించాయి. సమ్మెకు దిగే పరిస్థితులు రాకూడదని కోరుకుంటూ ఒక గడువు విధించి, ఆ లోగా పెంపు అమలు చేయకపోతే షూటింగ్‌లు నిలిపి వేస్తామని హెచ్చరించారు. నిర్మాతల మండలి ఈ డిమాండ్‌ను ప్రారంభంలో జాగ్రత్తగా స్వీకరించింది. ప్రస్తుత పరిస్థితుల్లో సినిమా నిర్మాణ ఖర్చులు భారీగా పెరిగాయని, డిజిటల్ ప్రమోషన్ వ్యయాలు, మల్టీప్లెక్స్ పంపిణీ శాతం, ఒటిటి పోటీ, విదేశీ చిత్రాల ప్రభావం వల్ల ఆదాయంపై ఒత్తిడి ఉందని నిర్మాతలు వాదించారు.



## విద్యార్థుల అవస్థలు

రహదారులపై నిలుస్తున్న వర్షపు నీరు

బురదమయం అవుతున్న యూనిఫాం

వచ్చి,పోయే వాహనాలతో ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు



**భూర్గంపాడు మండలం విశ్వం వాయిస్ న్యూస్** :-అసలే వర్షాకాలం...ఆపై రహదారులపై ఏర్పడిన గుంతలలో వర్షపు నీరు నిలిచి వచ్చి,పోయే వాహనాలు ప్రమాదాలకు గురవుతున్నాయి.మరోపక్క రహదారులపై నిలిచిన నీరు, రహదారులపై ఏర్పడిన గుంతలలో నిలిచిన నీటితో విద్యార్థులకు కష్టాలు తప్పడం లేదు.భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భూర్గంపాడు మండలం ఇరవెండి గ్రామంలో ఉదయాన్నే లేచి పాఠశాలకు వెళ్ళేందుకు సిద్ధమై బస్టాప్కు వెళ్ళి స్కూల్ బస్ కోసం ఎదురు చూస్తున్న విద్యార్థులు ఆయా మార్గాల్లో వచ్చి,పోయే వాహనాల వలన స్కూల్ డ్రెస్ మొత్తం బురదమయంగా మారుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.వాహనదారుల అతి వేగంతో పాటు ఆయా రహదారులపై ఏర్పడిన గుంతలలో నిలిచిన బురద నీటి వలన విద్యార్థుల యూనిఫాం వాహనాలు వచ్చి,పోయే సమయంలో బురదమయంగా మారుతూ,విద్యార్థులను ఇబ్బందులకు గురి చేస్తుంది.ఓ పక్క పాఠశాలకు సమయానికి చేరుకోవాలని ఉన్నా, వాహనాల వలన యూనిఫాం బురదమయంగా మారుతుండటంతో విద్యార్థులు సమయానికి పాఠశాలలకు వెళ్ళలేని పరిస్థితి నెలకొంది. ఇకనైనా సంబంధిత అధికారులు విద్యార్థులకు ఇబ్బందులకు ఇబ్బందులు కలుగకుండా తగు చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

## తెలుగు భాష నూ పాలక, పాఠక రంగాల్లో అమలుచేయాలి...

సి ఈ ఓ డాక్టర్ కత్తిమండ ప్రతాప్.



**అల్లవరం విశ్వం వాయిస్ న్యూస్:** అంబేద్కర్ కోనసీమ జిల్లా అల్లవరం మండలం శ్రీ రవితేజ జూనియర్ కళాశాలలో తెలుగు భాషా దినోత్సవం వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా తెలుగు భాష పితామహుడు గిడుగు రామమూర్తి పంతులు చిత్ర పటం వద్ద జ్యోతి ప్రజ్వలన చేశారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన శ్రీ శ్రీ కళావేదిక సీఈవో డాక్టర్ కత్తిమండ ప్రతాప్ మాట్లాడుతూ కోర్టు తీర్పులు పాలన ,బోధన, పాఠక రంగాల్లో తెలుగును అమలు చేయాలని, విద్యార్థి దశ నుంచే విద్యార్థులు సాహిత్యం పై శ్రద్ధ చూపాలని శ్రీ శ్రీ కళావేదిక జాతీయ సీఈవో డాక్టర్ కత్తిమండ ప్రతాప్ అన్నారు. శ్రీశ్రీ కళావేదిక ప్రముఖులు మాకే బాలార్జున, బి వి వి సత్యనారాయణ , అరిగెల బలరామమూర్తి, నేలపూడి నాగభూషణం, నల్లి నరసింహమూర్తి ,తదితరులు ప్రసంగించారు. విద్యార్థులు కవులు , కవితల్లో తెలుగు భాష ఔన్నత్యాన్ని చాటారు. ఈ సందర్భంగా కవులు విద్యార్థులును సత్కరించారు. గిడుగు రామమూర్తి పంతులు గురజాడ మొల్ల వేషధారణలతో కడలి రామకృష్ణారావు, కడలి సత్యనారాయణ, దొడ్డి సత్యవేణి, లు ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో బి సుబ్రశ్రీ పేరు లక్ష్మీనరసింహం పుల్లేటి సుశీల సిహెచ్ స్వామి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## భాష్యం పాఠశాలలో తెలుగు భాషా దినోత్సవ సంబరాలు



**అమలాపురం టౌన్ విశ్వం వాయిస్ న్యూస్** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురం భాష్యం పాఠశాలలో తెలుగు భాషా దినోత్సవం, జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాష్యం పాఠశాలల జోనల్ ఇంచార్జ్ జవ్వాది వెంకట శ్రీనివాస్ గిడుగు వెంకట రామమూర్తి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి. విద్యార్థులకు తెలుగు భాష ప్రాముఖ్యతను వివరించారు. విద్యార్థిని విద్యార్థులు తెలుగుతనం ఉట్టిపడే వేషధారణలతో చూపరులను ఆకట్టుకు న్నారు, పురాతన నాణాలు, చెక్క బొమ్మలు, తాళపత్ర గ్రంధాలు మరియు పిండి వంటలను ప్రదర్శించారు వ్యాసరచనలు, తెలుగు పద్యాల పోటీలలో పాల్గొని బహుమతుల్ని అందుకున్నారు.ఈ కార్యక్రమంలో భాష్యం స్కూల్ ప్రిన్సిపల్ సిహెచ్ రవి, చాంప్స్ ఇంచార్జీ కె నాగశ్రీ, జె రాజేశ్వరి, ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# సహజ ఎరువుల వాడకంతో భూసారం మెరుగవుతుంది

పేడ,ఇంగువల ద్రావణం రసాయన ఎరువులకు ప్రత్యామ్నాయం

చెల్లూరు లో పొలంబడి కార్యక్రమం ద్వారా రైతులకు అవగాహన



**రాయవరం,విశ్వంవాయిస్ న్యూస్:** డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా, రాయవరం మండలం, చెల్లూరు గ్రామంలో మండల వ్యవసాయ అధికారి కెవిఎన్ రమేష్ కుమార్ ఆధ్వర్యంలో రైతులకు పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. స్థానిక రైతు పెదబాబు కు చెందిన పొలంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమం ద్వారా పొలం పరిసరాలలో కనిపించే పురుగులలో రైతులకు మేలు చేసే పురుగులు, హాని కలిగించే పురుగులను గూర్చి రైతులకు వ్యవసాయ అధికారి వివరించారు. వరి పొలాల్లో నష్టం కలిగించే కాండంతొలచు పురుగు, ఆకుముడత పురుగు, పచ్చదోమ వంటి శత్రు పురుగుల ఉధృతిని గుర్తించడానికి పసుపు రంగు జిగురుతో కూడిన అట్టలను పొలంలో ఎకరానికి పది అట్టలు చొప్పున అమర్చారు. సాలీడు,తూనీగ వంటి మిత్ర పురుగులు రైతులకు నేస్తాలు అని సూచించారు. హాని కలిగించే పురుగులు ఉన్నప్పుడు మాత్రమే పురుగుమందులు పిచికారి అవసరం మేరకు చేయాలని, ఆకు ముడత కాండం తొలిచే పురుగుల నివారణ కోసం సాధారణంగా వాడే రసాయన పురుగుమందులతో వేప నూనె కలిపి వాడితే గ్రుడ్డు దశలో ఉన్న పురుగులను సమర్ధవంతంగా ఎదుర్కొనగలమని అన్నారు. రసాయన పురుగు మందులకు ప్రత్యామ్నాయంగా పేడ-ఇంగువ ద్రావణాన్ని ఎకరానికి 5 లీటర్ల ద్రావణాన్ని 200లీటర్ల నీటిలో కలిపి వాడాలని అన్నారు. ఈ ద్రావణం వాడటం వలన మొక్కలలో వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని,మట్టి సహజ సారాన్ని పెంపొందించుకుని రైతులకు మేలు చేస్తుందని, పేడ,మూత్రం,ఇంగువ కలిపి తయారు చేసిన ద్రావణాన్ని 1-2 రోజులు మాత్రమే నిల్వ ఉంచుకోవాలని,రసాయన మందులతో కలిపి ఉపయోగించ కూడదని ప్రకృతి వ్యవసాయ మాస్టర్,ట్రైనర్ కె.బాబురావు తెలిపారు. ఈ కార్యక్రమంలో పొలంబడి రైతులు, గ్రామ వ్యవసాయ సహాయకులు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

## విశ్వం వాయిస్ దినపత్రిక వార్త కథనానికి

# స్పందించిన నాయుడు మాస్టర్



**రామచంద్రపురం విశ్వం వాయిస్ న్యూస్ :** రామచంద్రపురం కృతివెంటి పెర్రాజు పంతులు కళాశాల గోడలపై చినిమా వాల్ పోస్టర్లు అతికిస్తున్నారు అనే కథనం విశ్వం వాయిస్ న్యూస్ దిన పత్రికలో వెలివడిన విషయం తెలిసిందే.అయితే ఈ విషయం నాకు నా మిత్రులు ద్వారా తెలియటంతో నూతనంగా కృతివెంటి పెర్రాజు పంతులు ఏడ్యూకేషనల్ ట్రస్ట్ చైర్మన్ గా బాధ్యతలు తీసుకున్న నాయుడు మాస్టర్ అను నేను తక్షణమే స్పందించి,కార్మిక మంత్రి వాసంశెట్టి సుభాష్ సహాయ సాకారాలుతో ఈ విషయంపై అతి త్వరలోనే పరిష్కారం చేస్తానని హామీ ఇస్తున్నాను.అలానే ట్రస్ట్ సభ్యులుతో మాటలాడి అందరం ఒక నిర్ణయం తీసుకొని కళాశాలకు సంబందించిన విషయాలులో ఎటువంటి వివాదాలుకు తావు లేకుండా కలిసి కట్టుగా పనిచేస్తాం అని తెలియజేస్తున్నాను అని,సమాజ శ్రేయస్సు కోసం పనిచేస్తున్న పత్రిక జర్నలిస్ట్ మిత్రులకు ధన్యవాదములు తెలిపారు.

# పింఛన్ల పంపిణీకి పటిష్టమైన చర్యలు గైకొనాలి

## ప్రత్యేక అధికారులు తాసిల్దారులకు ఆదేశాలు



**అమలాపురం, జిల్లా ప్రతినిధి, విశ్వం వాయిస్ న్యూస్ ఆగస్టు 29:** ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పింఛన్ల పంపిణీకి పటిష్టమైన చర్యలు గైకొనా లని జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్ ఎంపీడీవోలను నియోజకవర్గం ప్రత్యేక అధికారులను తాసిల్దార్లను ఆదేశించారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్ నుండి 22 మండలాల ఎంపీడీవోలు తాసిల్దార్లు మండల నియోజకవర్గ ప్రత్యేక అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి సామాజిక భద్రత పింఛన్లు పంపిణీ భారీ వర్షాలు వరదలను ఎదుర్కొనేం దుకు సన్నద్ధత చర్యలపై దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 30వ తేదీ శనివారం బ్యాంకుల నుండి ఎన్టీఆర్ భరోసా పింఛన్ల సొమ్మును విత్డ్రా చేస్తూ శనివారం రాత్రి నుం డి సోమవారం ఉదయం వరకు ఫీల్డ్ ఫంక్షనరీస్ మీద నమ్మకంతో నిధులు భద్రప రుస్తూ సోమవారం ఉద యాన్నే యధావిధిగా గత మాసంలో ఏ విధంగా అందరికీ సామా జిక భద్రత పింఛన్లు పంపిణీ చేశారో వారందరికీ పూర్తి స్థాయిలో పంపిణీ చేయా లని ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగుల పింఛన్ల పునః విచారణ చేయాలని సూచించిందని అయితే ఆ ప్రకారం జిల్లాలో సుమారు 32 వేల మంది దివ్యాంగులు 13 శాతం ఉన్నారని వీరికి ప్రస్తుతం మాసంలో ఎటువంటి ఇబ్బంది లేకుండా పింఛన్లు అందు తాయని ఆయన స్పష్టం చేశారు. జిల్లావ్యా ప్తంగా సుమారు 27 క్యాటగి రీలలో రూ 101 కోట్లు సం బంధిత ప్రజాప్రతినిధుల అందుబాటుకు అనుగుణంగా వారి సమక్షంలో పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. దివ్యాం గులకు పింఛన్ల పంపిణీలో కోత విధించారనే ఫిర్యా దులు రాకుండా చూడాలని అధి కారులు సూచించారు. గోదావరి నదికి మరలా వరదలు ఉధృతమయ్యే అవకాశం ఉందని రేపటికి ధవలేశ్వరం వద్ద మొదటి హెచ్చరిక వెలువడే అవకాశం ఉన్నదని ఈ నెల 31 సాయం త్రానికి రెండో హెచ్చ రిక వేలువడే అవకాశాలు ఉన్నాయన్నారు. గత పది రోజులలో వరదలు భారీ వర్షాల పట్ల ఏ విధమైన చర్యలు తీసుకున్నారో అదే స్థాయిలో మరల సన్నద్ధత చర్యలను చేపడుతూ అప్రమత్తంగా వ్యవహరిం చాలని ఆదేశించారు. వరద హెచ్చరికలకు అనుగుణం గా లోతట్టు ముంపు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేస్తూ ఆస్తి ప్రాణ నష్టాలకు ఆస్కారం లేకుండా సహాయక చర్యలు చేపట్టాలన్నారు. ము%శీ%పు లోతట్టు ప్రాంతా లలో రోడ్లు క్రాసింగ్ వద్ద బోట్లు ఏర్పాటు చేయాల న్నారు. సెప్టెంబరు మూడు నాలుగు తేదీలలో వినా యక నిమజ్జనం కార్యక్ర మాలు నిర్వహిస్తారని ఉత్సవ కమిటీలు ముం దుగా సూచించిన నిమజ్జన ప్రాంతాలలో ఉత్సవ విగ్రహాలను బట్టి క్రేన్లు , ట్రాక్టర్లు ఏర్పాటు చేసి ఎటువంటి ఫిర్యాదులకు ఆస్కారం లేకుండా వ్యవ హరించాలని సూచించారు వినాయక నిమజ్జన కార్యక్ర మాలు వరదలు ప్రవాహం ఎక్కువగా ఉన్న దృష్ట్యా మరింత జాగరూకతతో నిమజ్జన ఘట్టాల వద్ద వ్యవహరించి సజా వుగా నిమజ్జనాన్ని నిర్వహించాల న్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ కే మాధవి, జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ కేశవ వర్మ,డి ఆర్ డి ఎ ,పి డి గాంధీ, డి ఎం అండ్ హెచ్ ఓ ఎం దుర్గారావు ద్వారా ఆర్డబ్ల్యూఎస్ డీఈ పద్మ నాభం తదితరులు పాల్గొన్నారు.

# వర్షపు నీటి నిలవలపై ప్రభుత్వం ప్రత్యేక ఫోకస్

**అమలాపురం జిల్లా ప్రతినిధి విశ్వం వాయిస్ న్యూస్ ఆగస్టు 29:** మానవ మనుగడలో నీటి సంరక్షణ ఎంతో ప్రాధాన్యత సంతరించుకుందని వర్షపు నీటిని నిల్వ చేసి, వ్యవసా యానికి, తాగునీటి అవస రాలకు సమృద్ధిగా నియోగిం చుకోవాలని ప్రభుత్వం ప్రత్యేక ఫోకస్ పెట్టిందని జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ వెల్లడిం చారు. శు క్రవారం స్థానిక కలెక్టరేట్ నందు జలవనరులు, భూగర్భ జల శాఖ, గ్రామీణ నీటి సరఫరా పారిశుద్ధ్య విభాగాల అధికారులతో సమావేశం నిర్వహించి జల సంరక్షణ, మైనర్ ఇరిగేషన్ చెరువులు మరమ్మతులు పూడికతీతలు, పునరుద్ధరణ. చెరువుల పునరుద్ధరణ ద్వారా ప్రస్తుతం పొందుతున్న లబ్ధికి అదనపు లబ్ది చేకూరే దిశగా కార్యాచరణ రూపకల్పన అంశాలపై సమీక్షిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ మార్గ దర్శకాలకు అనుగుణంగా మైనర్ ఇరిగేషన్ ట్యాంకులు నవీణీకరణ కొరకు వారం రోజుల్లో 29 పనులకుగాను ప్రతిపాదనలు రూపొం దించాలని ఆదేశించారు అదేవిధంగా గ్రామీణ నీటి సరఫరా పారిశుద్ధ్య విభాగం ఆధీనంలో ఉన్న 17 త్రాగు నీటి నిల్వ చెరువుల అభివృద్ధి ద్వారా అదనంగా లబ్ధి చేకూరే విధంగా ప్రతిపాదనలు రూపక ల్పన చేయాలన్నారు. జిల్లాలో భూగర్భ జలాలు అడుగంటి నట్లు గుర్తించిన 4 గ్రామాలలో భూగర్భ జలాల పెంపు ( రీఛార్జ్) కు ప్రతిపాదనల రూపొందిం చాలన్నారు. ప్రభుత్వ ప్రాధా న్యత అంశాలలో వర్షపు నీటి సంరక్షణ అంశం ఒకటని తెలుపుతూ సరైన నిర్వ హణ లేకపోతే, ట్యాంకులు పూడికతో నిండిపోయి, వాటి నీటి నిలువ సామర్థ్యం తగ్గిపో తుందన్నారు మైనర్ ఇరిగేషన్ చెరువుల నిర్వ హణలో అధికారులు కీలక భూ మిక పోషించి నీటి వినియోగా న్ని గరిష్టతరం చేయాలని ఆదేశించారు చెరువు అడుగున పేరుకు పోయిన మట్టి, ఇసుక, ఇతర వ్యర్థాలను తొలగిస్తూ నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచుతూ అదనపు లబ్ధిని చేకూర్చాల న్నారు.పూడిక మట్టిని వ్యవసాయ భూములకు ఎరువుగా లేదా గట్టు బలోపే తానికి ఉపయోగించా లన్నారు ఈ యొక్క మట్టి భూసారాన్ని పెంచు తుందన్నారు.చుట్టూ ఉన్న గట్టు బలహీనపడటం లేదా పగుళ్లు ఏర్పడటం సర్వ సాధారణమన్నారు నీటి లీకేజీని నివారించడానికి, బండ్ను పటిష్టం చేయాలన్నారు నీటిని పంటలకు విడుదల చేయడానికి ఉపయోగించే తూములు,




ఎప్పటికప్పుడు తనిఖీ చేసి, అవసరమైన మరమ్మత్తులు చేయాలన్నారు.వీటి ద్వారా నీటి ప్రవాహాన్ని నియంత్రించవచ్చున న్నారు చెరువులోకి నీటిని తీసు కొచ్చే కాలువలు పూడికతో మూసుకుపోవడం లేదా చెత్త పేరుకుపోవడం వాటిని శుభ్రం చేయడం వల్ల చెరువులోకి నీరు సజావుగా చేరడానికి సహా యప డుతుందన్నారు. చెరువుల పరిధిలో ఉన్న ఆక్రమ ణలను తొలగించి నరేగా అనుసంధా నంతో కూడా ట్యాంకుల పూడిక తీత, మరమ్మత్తు పనులు చేపట్టడానికి అవకాశం ఉంద న్నారు. అమృత్ సరోవర్ పథకం చెరువుల అభివృద్ధికి చర్యలు చేపట్టా లన్నారు ట్యాంకుల నిర్వహ ణలో స్థానిక ప్రజల, ము ఖ్యంగా రైతుల భాగస్వా మ్యం చాలా ముఖ్యమని. నీటి వినియోగదారుల సంఘాలకు నిర్వహణ బాధ్యతలు అప్పగించి సమర్ధవంతంగా నిర్వహించాలన్నారు. మైనర్ ఇరిగేషన్ చెరువుల నిర్వహణ అనేది ప్రభు త్వాలు, స్థానిక సంస్థలు, ప్రజల ఉమ్మడి కృషి మీద ఆధారపడి ఉంటుందన్నా రు. ఈ కార్యక్రమంలో జలవరుల శాఖ ఎస్. ఇ గోపీనాథ్, డి యి వెంకటే శ్వరరావు, సిపిఓ మురళీ కృష్ణ, జిల్లా నీటి యాజ మాన్య సంస్థ పదక సంచా లకులు ఎస్ మధుసూదన్, పంచాయతీరాజ్ ఎస్, ఇ., పిరామకృష్ణారెడ్డి, భూగర్భ జల శాఖ డిడి ఉమాదేవి ఆర్ద బ్ల్యూఎస్ డివిజనల్ ఇంజనీర్ పద్మనాభం, తదితరులు పాల్గొ న్నారు

## చెడు స్నేహం,వ్యసనాలకు దూరంగా ఉండాలి




**రామచంద్రపురం విశ్వం వాయిస్ న్యూస్ :-** చెడు స్నేహాలు, వ్యసనాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని జనకల్యాణ్ టి ఐ ప్రాజెక్టు మేనేజర్ జి.శ్రీను అన్నారు. ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాల మేరకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ,జిల్లా ఎయిడ్స్ నివారణ,నియంత్రణ సంస్థ,జన కళ్యాణ్ వెల్ఫేర్ సొసైటీ ప్రివెన్షన్ యూనిట్ అమలాపురం మరియు రామచద్రపురం ఏరియా హాస్పిటల్ ఐసిటిసి సెంటర్ సంయుక్త ఆదర్యంలో రామచంద్రపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థిని విద్యార్థులకు స్థానిక జడ్పీ హైస్కూల్ ప్లస్ లో కళాశాల ప్రిన్సిపాల్ ప్రభాకర్ మరియు డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపాల్ వీరబాబు పర్యవేక్షణలో ఎయిడ్స్, డ్రగ్స్ వినియోగం వాటి దస్పరిణామాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.హెచ్ఐవి,ఎయిడ్స్ వ్యాపించదు, ఎయిడ్స్ రాకుండా తీసుకోవలసిన జాగ్రత్తలు, ఎయిడ్స్ వ్యాధిగ్రస్తుల పట్ల చిన్నచూపు లేకుండా సమాజంలో ఎలా కలిసి జీవించాలి,క్షయ,సుఖ వ్యాధులకు చికిత్స, కండోమ్ యొక్క ఉపయోగాలు గురించి విద్యార్థులకు రామచంద్రపురం ఏరియా హాస్పిటల్ ఐసీటీసీ కౌన్సిలర్ అంజలీ దేవి వివరించారు. హెచ్ఐవి,ఎయిడ్స్ 2017 ఏఆర్టి మందులు,ఏపి శాక్స్ యాప్,టోల్ ఫ్రీ నెంబర్ 1097 గురించి వివరించారు.ఈ కార్యక్రమంలో జనకల్యాన్ ఔట్రీచ్ వర్కర్ ఏఎస్. దొరబాబు పీర్ ఎడ్యుకేటర్ గెడ్డం లక్ష్మి కళాశాల టీచర్స్ మొదలగు వారు పాల్గొన్నారు.

## మున్సిపల్ కౌన్సిల్ ఏకగ్రీవంగా తీర్మానానికి అఖిల పక్ష జేపసీ కృతజ్ఞతలు




**విశ్వం వాయిస్ న్యూస్ :** రామచంద్రపురం నియోజకవర్గాన్ని కాకినాడ జిల్లాలో విలీనం చేయాలన్న ప్రజల డిమాండ్కు మద్దతుగా రామచంద్రపురం మున్సిపల్ కౌన్సిల్ ఏకగ్రీవంగా తీర్మానం ఆమోదించినందుకు అఖిల పక్ష జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) హృదయపూర్వక కృతజ్ఞతలు తెలుపుతుంది. రామచంద్రపురం మున్సిపల్ కౌన్సిల్ చైర్ పర్సన్ గాధంశెట్టి శ్రీదేవి, రామచంద్రపురం మున్సిపల్ కమిషనర్, కౌన్సిల్ సభ్యులకు రామచంద్రపురం అఖిల పక్ష జెఏసి ఘనంగా సన్మానం నిర్వహించారు. రామచంద్రపురం నియోజకవర్గ అఖిల పక్ష జేఏసీ కన్వీనర్ మాగాపు అమ్మిరాజు,కో-కన్వీనర్ బి. సిద్ధూ,గౌరవ అధ్యక్షులు గాధం శెట్టి శ్రీధర్,గొల్లపల్లి కృష్ణ,అంకం శ్రీను, పి.మధు మాజీ బార్ అసోసియేషన్ అధ్యక్షులు హరినాథ్ రెడ్డి,ఈ తీర్మానం ప్రజల సంకల్పానికి ప్రతీకగా నిలిచిందని, రామచంద్రపురం భవిష్యత్తు అభివృద్ధికి ఇది మైలురాయిగా భావిస్తున్నామని జేఏసీ నాయకులు పేర్కొన్నారు. పట్టణ ప్రజల ఆత్మీయ కోరికను గౌరవించి నిర్ణయం తీసుకున్న కౌన్సిల్ సభ్యులు,చైర్మన్, మున్సిపల్ అధికారులు అందరికీ ధన్యవాదాలు తెలిపారు.రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ప్రజా సంకల్పాన్ని గౌరవించి,రామచంద్రపురం నియోజకవర్గాన్ని కాకినాడ జిల్లాలో విలీనం చేసే ప్రక్రియను ప్రారంభించాలని జేఏసీ బలంగా డిమాండ్ చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో రామచం ద్రపురం సీనియర్ న్యాయవాది దొమ్మలపాటి సత్యనారాయణ, సీపీఐ నాయకులు ఎం.రాము, పీ.వై.ఎల్ నాయకులు అంబటి కృష్ణ,వానపల్లి నాగరాజు,పీ.డీ.ఎస్.యూ కె.నవీన్,జనసేన నాయకులు నున్న చిట్టి బాబు,నాయుడు మాష్టర్, పాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షులు విక్టర్ నంద, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

## వెల్ల జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలుగు భాషాదినోత్సవం,



**రామచంద్రపురం మండలం విశ్వం వాయిస్ న్యూస్ :**వెల్ల గ్రామం ప్రభుత్వ పాఠశాలలో జాతీయ క్రీడాదినోత్సవం ఘనంగా నిర్వహించడమైనది.ఈ కార్యక్రమం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బి.వీరభద్రరాజుగారి అధ్యక్షత జరిగింది.ఈ సందర్భంగా తెలుగు భాష గొప్పతనం గురించి,జాతీయ క్రీడా దినోత్సవ ప్రాముఖ్యత గురించి సవివరంగా వక్తలు ప్రసంగించడమైనది.ఈ సందర్భంగా నిర్వహించిన క్రీడాపోటీలక విజేతవైన విద్యార్థులకు బహుమతి ప్రదానం చేయడమైనది.ఈ సందర్భంగా దాత అయిన శ్రీరూడల నాగభషణం పాఠశాల నిర్వహణా కమిటీ, ఉపాదయబృందం వారిని ఘనంగా సన్మానిం చడమైనది. విద్యార్థులకు వివిధ క వ్యాయాను చడమైనది.ఈ కార్యక్రమలో చైర్మెన్ సుంకం అదినారాయణగారు, వైస్చైర్మన్,పందిరి నాంతకుమారి,సభ్యులు సుంకర శ్రీనివాసరావు,కుక్కలు పద్మజారాణి,గ్రామ పెద్దలు, ఉప్యాయులు పాల్గొన్నారు .



## జడ్పీలో పదోన్నతులు....



**కాకినాడసిటీ :విశ్వం వాయిస్ న్యూస్** జిల్లా ప్రజా పరిషత్ ఛైర్ పర్సన్ విప్పర్తి వేణుగోపాలరావు జిల్లా ప్రజా పరిషత్ యాజమాన్య పరిధిలో పనిచేయుచున్న ఇద్దరు (02) సీనియర్ అసిస్టెంట్ లకు పరిపాలనాధికారులుగా, పద్దెనిమిది(18) ఆఫీసు సబార్డినేట్ లకు రికార్డ్ అసిస్టెంట్లుగా పదోన్నతి కల్పించిఉన్నారు.సదరు జిల్లా కార్యక్రమంలో ప్రజా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి వి.వి.వి. ఎస్. లక్ష్మణరావు, ఉప ముఖ్య కార్యనిర్వహణాధికారి జి. ఎస్. రామ్ గోపాల్ మరియు ఎ.పి.పి.ఆర్. మినిస్టీరియల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్.వి.వి. రమేష్ పాల్గొన్నారు.

## తెలుగు భాష పరిరక్షణకై పాటుపడదాం.....

**మాతృ భాషా దినోత్సవం సందర్భంగా ప్రజా సంఘాల ఆధ్వర్యంలో గిడుగు రామమూర్తి 162 వ జయంతి నివాళి.....**



**కాకినాడసిటీ విశ్వం వాయిస్ న్యూస్** తెలుగు భాష పరిరక్షణకై పాటుపడదాం అంటూ ప్రజా సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. మాతృ భాషా దినోత్సవం సందర్భంగా శుక్రవారం సాయంత్రం కాకినాడ వివేకానంద పార్క్ మెయిన్ గేటు వద్ద ప్రజా సంఘాల ఆధ్వర్యంలో జన విజ్ఞాన వేదిక నాయకుడు సిహెచ్. సతీష్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముందుగా యుటిఎఫ్ పూర్వ రాష్ట్ర కార్యదర్శి జి. ప్రభాకర వర్మ, పెన్షనర్ల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. సత్తిరాజు లు గిడుగు రామమూర్తి చిత్రపటానికి పూలమాల వేసి జోహార్లు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వ్యావహారిక భాష కొరకు ఎనలేని కృషి చేసిన గిడుగు రామమూర్తి చిరస్మరణీయుడని కొనియాడారు. ఆయన ఉపాధ్యాయుడు ఏజెన్సీ ప్రాంతంలో పనిచేసిన కాలంలో సవర భాష కొరకు లిపిని తయారు చేసి విశేషమైన కృషి చేసారన్నారు. ఒక జాతి మనుగడకు భాష చాలా కీలకమన్నారు. ఇంగ్లీష్ మాధ్యమానికి సమాంతరంగా తెలుగు మాధ్యమం కూడా ఉండాలన్నారు. ప్రభుత్వ ఉత్తర్వులు తెలుగు భాషలో వస్తేనే సామాన్యులకు అవగాహన కలుగుతుందన్నారు. గుర్తింపు కలిగిన జాతీయ భాషలు అన్నింటికీ తగిన ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. హిందీని గాని మరొక భాషను గాని బలవంతంగా రుద్దే ప్రయత్నాలు మానుకోవాలన్నారు. 1966 నుండి గిడుగు రామమూర్తి జయంతి ని తెలుగు భాషా దినోత్సవం గా నిర్వహించుకోవడం జరుగుతుందన్నారు. ఆవాజ్ కన్వీనర్ ఇబ్రహీం, జన విజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి జి ఎస్ వర్మ లు మాట్లాడుతూ ప్రపంచంలో అభివృద్ధి చెందిన దేశాల్లో ప్రాథమిక విద్యా బోధన మాతృభాష లోనే సాగుతోందన్నారు. పరభాషా జ్ఞానాన్ని సంపాదించు కోవచ్చుని అదే సందర్భంలో మాతృ భాష ను నిర్లక్ష్యం చేయరాదన్నారు. భాష కనుమరుగైతే సంబంధిత జాతి ఉనికిని కోల్పోతుందన్నారు. భాష మన సంస్కృతి లో భాగమన్నారు. గురజాడ అప్పారావు, కందుకూరి వీరేశలింగం సరసన గిడుగు రామమూర్తి తెలుగు భాషా వైభవానికి ఎనలేని కీర్తి తెచ్చారని కొనియాడారు.
ఈ కార్యక్రమంలో ఐద్వా నగర కార్యదర్శి కె. నాగజ్యోతి, ఎస్ఎఫ్ఐ నాయకులు జైరాం, సత్యం, యుటిఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ సిహెచ్. వెంకట రమణ, సిఐటియు నాయకులు మలక వెంకటరమణ, మేడిశెట్టి వెంకటరమణ, పలివెల వీరబాబు, రాణి, రిటైర్డ్ ఎటిఓ బి. సత్యప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. పార్క్ కి వచ్చే ప్రజలు ఆగి గిడుగు రామమూర్తి చిత్రపటం వద్ద నివాళులు అర్పించారు. ప్రజా సంఘాల నాయకులను అభినందించారు.


## పెన్షనరు భవన్ లో జాతీయ క్రీడాదినోత్సవ వేడుకలు.....





**కాకినాడ సిటీ: విశ్వం వాయిస్ న్యూస్** పెన్షనర్స్ భవన్ కాకినాడ జిల్లా కార్యాలయంలో జాతీయ క్రీడా దినోత్సవ,తెలుగు భాషా దినోత్సవ వేడుకలు రాష్ట్ర అధ్యక్షుడు పిఎస్సెస్. ఎంపీ. శాస్త్రి అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు.ముఖ్య అతిధులుగా బీజేపీ మేధావి విభాగ అధ్యక్షుడు డా.నవీన్. ముత్తా,మాజీ కబాడీ కోచ్ పిఎస్వీ. ప్రసాద్ హాజరయ్యారు.నవీన్ మాట్లాడుతూ క్రీడలకు రోజుకు ఒక గంట అయినా కేటాయించాలని సూచించారు. క్రీడాకారులకు స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగం లభిస్తుందన్నారు.ప్రసాద్ మాట్లాడుతూ ధ్యాన్చంద్ స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ క్రీడల్లో రాణించాలని సూచించారు. జిల్లా అధ్యక్షులు కె.పద్మనాభం మాట్లాడుతూ క్రీడలతో మానసిక పునరుత్తేజానికి దోహదపడుతుందన్నారు.అనంతరం విలువిద్యలో రాణించిన క్రీడాకారులను ఘనంగా సన్మానించారు.

# జగ్గంపేట భాష్యం స్కూల్లో ఘనంగా తెలుగు భాష మరియు జాతీయ క్రీడా దినోత్సవం వేడుకలు





**జగ్గంపేట :విశ్వం వాయిస్ న్యూస్** జగ్గంపేట రావులమ్మ నగర్ లోని గల భాష్యం పాఠశాలలో తెలుగు భాష దినోత్సవం మరియు జాతీయ క్రీడ దినోత్సవం వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మొదటగా గిడుగు రామ్మూర్తి పంతులు మరియు మేజర్ ధ్యాన్ చంద్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ కుసిరెడ్డి సత్యనారాయణ మాట్లాడుతూ తెలుగు భాషా దినోత్సవం మరియు జాతీయ క్రీడా దినోత్సవం యొక్క ప్రాముఖ్యతను విద్యార్థులకు తెలియజేశారు. దేశంలో 22 అధికారిక గుర్తింపు కలిగిన భాషల్లో తెలుగు ఒకటన్నారు. హిందీ, బెంగాలీ భాషల తర్వాత దేశంలో ఎక్కువగా మాట్లాడుకునే భాష తెలుగు అని తెలియజేశారు. తెలుగు కవి గిడుగు వెంకట రామమూర్తి జయంతిని పురస్కరించుకుని ఆగస్టు 29వ తేదీన తెలుగు భాష దినోత్సవాన్ని జరుపుకుంటున్నామన్నారు. భారత హాకీ క్రీడాకారుడైన ధ్యాన్ చంద్ గౌరవ సూచికంగా ఆయన పుట్టినరోజు అయిన ఆగస్టు 29వ తేదీన జాతీయ క్రీడా దినోత్సవం గా జరుపుకుంటున్నామన్నారు. ఒలింపిక్స్ క్రీడల్లో మన దేశానికి మూడు బంగారు పథకాలు అందించిన గొప్ప క్రీడాకారుడు అన్నారు. మనదేశంలో హాకీ క్రీడకు ఆద్యుడుగా ధ్యాన్ చంద్ ను అభివర్ణిస్తుంటారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు భాష్యం విద్యాసంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ, జోనల్ ఇన్చార్జ్ గోవిందరాజు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రైమరీ ప్రిన్సిపాల్ వాణి, తెలుగు ఉపాధ్యాయులు బాలాజీ రావు,రేవతి, వ్యాయామ ఉపాధ్యాయులు రవినాగ్ పాల్గొన్నారు.

# దివ్యాంగుల సంక్షేమమే మా ధ్యేయం

**జిల్లా టిడిపి దివ్యాంగుల అధ్యక్షులు మండపాక అప్పన్న దొర**

**అర్హులైన దివ్యాంగుల కోసం 30న ట్రైసైకిళ్ల పంపిణీ**

**జ్యోతుల నెహ్రూ ఫౌండేషన్ ముందడుగు**



**జగ్గంపేట :విశ్వం వాయిస్ న్యూస్** కాకినాడ జిల్లా జగ్గంపేట స్థానిక రావులమ్మ నగర్ లోని టిడిపి కార్యాలయంలో జిల్లా టిడిపి విభిన్న ప్రతిభవంతుల అధ్యక్షులు మండపాక అప్పన్న దొర మీడియాతో మాట్లాడుతూ అర్హులైన దివ్యాంగులు ప్రతి ఒక్కరికీ న్యాయం చేస్తామని పింఛను అందిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు, ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ స్పష్టంచేశారు అని అన్నారు. వైసీపీ హయాంలో చాలా మంది అనర్హులకు పింఛన్లు ఇచ్చారని దీనివల్ల అర్హులకు నష్టం కలుగుతోందని అన్నారు. ఏ ఒక్క అర్హుడికీ నష్టం జరుగకూడదంటే అనర్హులను తప్పించాల్సి ఉందని చెప్పారు. అనర్హులను గుర్తించే ప్రక్రియలో ఎక్కడైనా లోపాలున్నా అధికార యంత్రాంగం పొరపాట్లు చేసినా దానిని గుర్తించి సరిదిద్దే బాధ్యతను టీడీపీ యంత్రాంగం తీసుకుంటుందని పిలుపిచ్చారు. తాత్కాలిక సర్టిఫికెట్లు ఉన్న వారికి నోటీసులతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరికీ పింఛను ఇవ్వాలని అధికారులను ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించినట్లు తెలిపారు. దివ్యాంగుల పింఛన్లపై వైసీపీ ప్రచారంపై తీవ్రంగా స్పందించారు. దీనిపై ఆ పార్టీ తప్పుడు ప్రచారం చేస్తోందని మండిపడ్డారు. అబద్ధాల పునాదుల మీద రాజకీయం చేస్తోందన్నారు. వైసీపీ తప్పులు చేస్తూ వాటిని ఎదుటివారిపైకి నెడుతోంది. దీన్ని మనం సమర్థంగా తిప్పికొట్టాలి. దేశంలో మరే ఇతర రాష్ట్రంలోనైనా గతంలో ఏ ప్రభుత్వాలైనా ఈ స్థాయిలో పింఛన్లు ఇచ్చాయా అని వైసిపి ప్రభుత్వం లో 2019 నుండి 2024 వరకు తెలుగుదేశం ప్రభుత్వం ఇచ్చిన 3000 ఇచ్చిందని ఒక్క రూపాయి కూడా దివ్యాంగులకు పెంచలేదని ఆయన తీవ్రంగా వైసిపి పై మండి పడ్డారు. ఈనెల 30వ తేదీ శనివారం ఉదయం జగ్గంపేట రావులమ్మ నగర్ లోని టిడిపి కార్యాలయంలో జ్యోతుల నెహ్రూ ఫౌండేషన్ ద్వారా దివ్యాంగులకు మూడు చక్రాలు ట్రై సైకిల్ పంపిణీ చేయడం జరుగుతుందని అర్హులైన దివ్యాంగులు ఎవరైనా ఉంటే ఆధార్ కార్డు, రేషన్ కార్డు, సదరం సర్టిఫికెట్ పాస్పోర్ట్ సైజ్ ఫోటో తీసుకురావాలని అప్పన్న దొర అన్నారు.

# మండలంలో దొంగ పెన్షన్ల హవా

**ప్రజా ధనాన్ని బకాసురుల్లా మింగుతున్న నకిలీ లబ్ధిదారులు**

**నిర్లక్ష్యంగా చూస్తున్న అధికార యంత్రాంగం**




**జగ్గంపేట :విశ్వం వాయిస్ న్యూస్** కాకినాడ జిల్లా జగ్గంపేట నియోజకవర్గంలోని మండలాల్లో పలు గ్రామాల్లో పెన్షన్ వ్యవస్థలో పెద్దఎత్తున అవకతవకలు వెలుగులోకి వస్తున్నాయి. అర్హతలు లేని వ్యక్తులు, ముఖ్యంగా దివ్యాంగులు కాక పోయిన ఉన్నట్టు వైద్యుల సర్టిఫికెట్లు డబ్బుతో మేనేజ్ చేసుకొని పెన్షన్లు పొందుతున్న దాఖలాలు బయటపడుతున్నాయి.ప్రజా ధనం దోపిడీగా మారిన పెన్షన్ పథకం ప్రజలకు సహాయం చేయడానికి ఉద్దేశించిన పెన్షన్ పథకాలు, కొంతమందికి అక్రమ ఆదాయ వనరుగా మారాయి. వైసీపీ ప్రభుత్వ కాలంలో ఈ దందా మరింత విస్తరించిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. క్రమంగా అర్హులు కాకపోయినా వందలాది మంది పెన్షన్లు పొందుతూ ప్రభుత్వ ఖజానా నుంచి లక్షల రూపాయలు అక్రమంగా దోచుకున్నట్లు సమాచారం.

**అధికారులు చూసి చూడనట్టు?**

ఈ అవకతవకలపై అధికారులకు సమాచారం లేకపోలేదు. అయితే పట్టించుకోకుండా చూసి చూడనట్టు వదిలేస్తున్నారన్న అభిప్రాయం ప్రజల్లో నెలకొంది. దీని ఫలితంగా గ్రామ స్థాయిలో పెన్షన్ వ్యవస్థ పట్ల విశ్వాసం దెబ్బతింటోంది.

రికాల్ ,రికవరీ డిమాండ్

ఈ పరిస్థితిని దృష్టిలో ఉంచుకొని ప్రజలు కొత్త కూటమి ప్రభుత్వాన్ని కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పెన్షన్ పొందుతున్న వారందరినీ రికాల్ చేసి తిరిగి మెడికల్ టెస్టులు చేయాలని

నకిలీ సర్టిఫికెట్లతో దొంగగా పెన్షన్ పొందుతున్నవారిని గుర్తించి వెంటనే వారి పెన్షన్ రద్దు చేయాలని

ఇప్పటి వరకు వారు అక్రమంగా పొందిన మొత్తాన్ని రికవరీ చేసి ప్రభుత్వ ఖజానాకు జమ చేయాలని అలాంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రజల డిమాండ్ చేస్తున్నారు

కఠిన చర్యలపై ప్రజల ఆశ

అర్హులకు న్యాయం జరగాలి, అక్రమార్జకులకు శిక్ష పడాలి" అన్న డిమాండ్ జగ్గంపేట నియోజక వర్గం వ్యాప్తంగా వినిపిస్తోంది. ఇప్పటికైనా ప్రభుత్వం జోక్యం చేసుకొని అవకతవకలకు అడ్డుకట్ట వేయాలని ప్రజలు గట్టిగా కోరుతున్నారు.

## నారాయణ స్కూల్ లో తెలుగు మాతృభాషా దినోత్సవం



**కాకినాడ, విశ్వంవాయిస్:** తెలుగు మాతృభాషా దినోత్సవం సందర్భంగా కాకినాడ నారాయణ స్కూల్ నందు వేడుకలు జరిగాయి. తెలుగు అధ్యాపకురాలు ముత్తాబత్తుల చంద్రకళ అధ్యక్షతన కరస్పాండెంట్ టి.ఎస్.వి నారాయణ ఆధ్వర్యంలో గురువారం తెలుగు మాతృభాషా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగు అధ్యాపకురాలు మాట్లాడుతూ ఈ ఆధునిక జీవనయానంలో ఇంగ్లీష్ అవసరం చాలా ఉంది... కానీ అంతకంటే మాతృభాష అనేది ముఖ్యమని చెప్పారు. తెలుగు దినోత్సవం గొప్పతనం గురించి తెలుగు భాషా దినోత్సవ పితామహుడు గిడుగు రామ్మూర్తి గారు గురించి విద్యార్థులకు వివరించారు. తెలుగు మాతృభాష ఆవశ్యకత, గొప్పతనాన్ని విద్యార్థులకు తెలియజేశారు.ఇంకా కరస్పాండెంట్ నారాయణ మాట్లాడుతూ తెలుగు మాతృభాషా దినోత్సవ ఆవశ్యకతను దాని విశిష్టతను విద్యార్థులకు తెలియజేశారు. అనంతరం విద్యార్థులు నృత్య ప్రదర్శన, పద్యాల పోటీలు, తెలుగు భాషా వివరణ మొదలగు కార్యక్రమాలు జరిగాయి. ఇందులో స్కూల్ కరెస్పాండెంట్ టి. ఎస్. వి. నారాయణ, ప్రిన్సిపల్ టి లక్ష్మి, తెలుగు అధ్యాపకురాలు ముత్తాబత్తుల చంద్రకళ . సుబ్రమణ్యం శ్రీనివాసరావు టి లక్ష్మి మేడమ్ బి అనూష విద్యా హాజరా అరుణ ఎం ఫణి రాజ్ కుమారి పి శ్రీదేవి శ్రీ లక్ష్మి మొదలగు ఉపాధ్యాయులు మొత్తం సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు

## ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రజా దర్బార్....



**కాకినాడసిటీ : విశ్వం వాయిస్ న్యూస్**ప్రజల సమస్యల పరిష్కారం దిశగా కొప్పవరంలోని రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబు గారి కార్యాలయంలో శుక్రవారం 19వ ప్రజాదర్బార్ నిర్వహించారు. రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబు కార్యాలయం ఇంచార్జ్ మేకా లక్ష్మణమూర్తి పర్యవేక్షణలో 19వ ప్రచార ధర్బార్ కార్యక్రమం జరిగింది.ఈ ప్రజా దర్బార్ లో పింఛన్లు, విద్య, ఇళ్ల స్థలాలు, ఉపాధి, వైద్యం తదితర అంశాలకు సంబంధించి మొత్తం 30 అర్జీలు స్వీకరించగా, వాటిలో 5 అర్జీలను వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరించారు . ప్రజా దర్బార్ కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ డాక్టర్ చప్పడి వెంకటేశ్వరావు, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు నులుకుర్తి వెంకటేశ్వరరావులు మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబు కార్యాలయంలో ప్రతి శుక్రవారం ఉదయం 10:00 నుండి మధ్యాహ్నం 2 గంట వరకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని, ఈ కార్యక్రమానికి కాకినాడ జిల్లా వ్యాప్తంగా ప్రజలు తరలివచ్చి తమ అర్జీలను అందించడం జరుగుతుందన్నారు. ఎంపి కార్యాలయానికి వస్తే సమస్య పరిష్కారం అవుతుంది అనే ధీమాతో ప్రజల్లో నమ్మకం కలిగే విధంగా రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబు ఏర్పాటు చేసిన టీం సభ్యులు పనిచేస్తున్నారన్నారు. ప్రజల్లో నమ్మకం కలిగే విధంగా నిర్వహిస్తున్నారని వారు చెప్పారు

ఈ కార్యక్రమంలో ఆనంద్ న్యూటన్, చింతపల్లి అర్జున్, జున్నూరు బాబ్జి, జెడ్ ఆర్ యు సి సి సభ్యులు అనిల్,, నరహరిశెట్టి సూరిబాబు, కాకరపల్లి చలపతిరావు, కరప మాజీ ఎంపీపీ సీతామాలక్ష్మి ,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

# "స్త్రీ శక్తి పథకం ఉచిత బస్సు ప్రయాణం సూపర్ హిట్"

**విజయోత్సవ సభలో ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ**

**184 సంఘాల్లోని 1,885 మందికి రూ. 23,59,00,000 పంపిణీ**

**శంఖవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని మహిళలు అందరూ ఆర్థిక సాధికారత, స్వావలంబన సాధించే దిశగా వారిని సంపూర్ణంగా అభివృద్ధి చేయడం ఎన్డీఏ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ పేర్కొన్నారు. ఈ లక్ష్య సాధనలో ఒక అంశంగా ఈ ఆగష్టు 15 నుంచి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న "స్త్రీ శక్తి ఉచిత బస్సు ప్రయాణం" రాష్ట్ర వ్యాప్తంగా సూపర్ హిట్ అయింది. మహిళల ముఖాలపై కనిపిస్తున్న ఆనందమే దానికి నిదర్శనం అన్నారు. కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం శంఖవరం మండలంలోని అన్నవరం రిసార్ట్స్‌లో ఎన్డీఏ కూటమి మహిళల ఆధ్వర్యంలో "సూపర్ సిక్స్ %-% సూపర్ హిట్" విజయోత్సవ సభను శుక్రవారం సాయంత్రం అట్టహాసంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా తొలుత ఎమ్మెల్యే సత్యప్రభ స్వయంగా ప్రత్తిపాడు నుండి ఆర్టీసీ బస్సులో మహిళలతో కలిసి అన్నవరం శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామి వారి ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం సభలోని మహిళలను ఉద్దేశించి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే సత్యప్రభ ప్రసంగించారు. ఎన్.డి.ఏ. పార్టీల కూటమి 2024 రాష్ట్ర శాసనసభ ఎన్నికల సందర్భంగానూ, ఆ తర్వాత ప్రజల ఆశీస్సులతో అధికారంలోకి వచ్చిన ఈ ఏడాది కాలంలో ప్రభుత్వం ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకుంది అన్నారు. ప్రతీ మహిళనూ అన్ని రంగాల్లోనూ అభివృద్ధిలో ముందుకు తీసుకుని వెళ్ళేందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది అన్నారు. సూపర్ సిక్స్ పథకాల్లో భాగంగా వృద్ధులకు నెలకు రూ. 4,000 పింఛను, ప్రతి సంవత్సరం మహిళలకు మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు, విద్యార్థుల చదువుకు దన్నుగా తల్లికి వందనం పథకం, రైతులకు అండగా అన్నదాత సుఖీభవ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం (స్త్రీ శక్తి) పథకాలు విజయవంతంగా అమలు కావడంతో అవి రాష్ట్ర వ్యాప్తంగా సూపర్ హిట్ అయ్యాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ముఖ్యంగా మహిళల కోసం ఉచిత బస్సు ప్రయాణం పథకం రాష్ట్ర వ్యాప్తంగా అక్కచెల్లెమ్మలందరికీ ఎంతో ఉపయోగ పడుతోందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఎక్కడి నుంచి ఎక్కడికైనా స్వేచ్ఛగా ప్రయాణించే వీలు కల్పించడం గొప్ప నిర్ణయమని అభివర్ణించారు. ఇప్పటి వరకు సూపర్ సిక్స్ పథకాల్లో ఐదు పథకాలను విజయవంతంగా అమలు చేశారు. అందుకే ఈ రోజు సూపర్ సిక్స్ టథకాల సూపర్ హిట్ సభను ఘనంగా జరుపుకుంటున్నాం" అన్నారు. ప్రత్తిపాడు నియోజ కవర్గంలోని ప్రజల ప్రతీ సమస్యనూ ఒక్కొక్కటిగా పరిష్కరిస్తూ, ఎన్నికల సందర్భంగా మీ ముందుకు వచ్చి ఏయే హామీలను ఇచ్చామో వాటిని క్రమంగా అమలు చేసుకుంటూ ముందుకు సాగుతున్నామని ఎమ్మెల్యే సత్యప్రభ పేర్కొన్నారు. రాష్ట్ర మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం హామీని నిలబెట్టు కున్నందుకు ఎన్డీఏ ప్రభుత్వానికి రాష్ట్ర మహిళలు అందరి తరఫున ధన్యవాదాలు తెలిపారు. కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతూ ముఖ్యమంత్రి చంద్రబాబుకు మహిళలు అందరూ పోస్ట్ కార్డులు వ్రాశారు. మెప్మా- మండల "వెలుగు" సంస్థ తరఫున ఏలేశ్వరం మండలంలోని 42 మండల సమాఖ్య సంఘాల్లోని 441 మంది స్వయం సహాయక సంఘాల సభ్యులకు రూ. 5,41,00,000 ల విలువ గల రుణాలు, ప్రత్తిపాడు మండలంలోని 46 సంఘాల్లోని 469 మంది మహిళలకు రూ. 5,62,00,000, శంఖవరం మండలంలోని




39 సంఘాల్లోని 393 మంది మహిళలకు రూ. 5,95,00,000, రౌతులపూడి మండలంలోని 57 సంఘాల్లోని 582 మంది సభ్యులకు రూ. 6,61,00,000 లు చొప్పున నియోజకవర్గం మొత్తం మీద 184 సంఘాల్లోని 1,885 మందికి రూ. 23,59,00,000 విలువైన రుణ మంజూరు నమూనా చెక్కులను ఎమ్మెల్యే, నేతల బృందం మహిళలకు పంపిణీ చేసింది. ఈ నిధులు మహిళా సంఘాల ఆర్థిక స్థిరత్వాన్ని పెంచి, స్వయం ఉపాధి అవకాశాలను విస్తరించేందుకు దోహదం చేస్తాయని ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ తెలిపారు. చివరిగా ప్రతిజ్ఞ చేసి సభను విజంతంగా ముగించారు. ఈ కార్యక్రమానికి అతిథులుగా జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు జ్యోతుల నవీన్ కుమార్, కాకినాడ మాజీ మేయర్ సుంకర పావని, నియోజకవర్గ పరిశీలకులు మెట్ల రమణబాబు, పూర్వపు ఉభయ గోదావరి జిల్లాల తెలుగుదేశం పార్టీ పూర్వ ప్రచార కార్యదర్శి పర్వత సురేష్, మండల తెలుగు దేశం పార్టీ అధ్యక్షుడు బద్ది రామారావు, కార్యదర్శి ఉల్లి వీరభద్రరావు, మండల జనసేన పార్టీ అధ్యక్షుడు గాబు సుభాష్, నెల్లిపూడి జనసేన పార్టీ అధ్యక్షుడు తలపంటి అప్పారావు (బుజ్జి), హాజరు అయ్యారు. పెద్ద సంఖ్యలో ఎన్డీఏ కూటమి నాయకులు, శ్రేణులు, మహిళలు పాల్గొన్నారు.



# ఘనంగా ఆదిత్యలో తెలుగు భాషా దినోత్సవం




**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్** స్థానిక ఆదిత్య డిగ్రీ కళాశాలల,కళా గౌతమీ సంయుక్త ఆధ్వర్యంలో గిడుగు వెంకట రామమూర్తి జయంతినీ తెలుగు భాషా దినోత్సవంగా చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అధితులుగా కళా గౌతమి వ్యవస్థాపకులు డాక్టర్ బి వి ఎస్ మూర్తి,డాక్టర్ టి జయప్రద,ఆదిత్య డిగ్రీ కళాశాల సహాయ ఉపన్యాసకులు డాక్టర్ బి హెచ్.వి.రమాదేవి,కవి రచయిత వి.వి. సుబ్రహ్మణ్యం, ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాల ఉపన్యాసకులు,తాతాజీ, ఎల్ వెంకటేశ్వరరావు, తెలుగు ఉపాధ్యాయిని బి.విమల జ్యోతి ప్రజ్వలన నిర్వహించారు.అనంతరం డాక్టర్ బివిఎస్ మూర్తి, వివి సుబ్రహ్మణ్యం,గిడుగు వెంకట రామమూర్తి చిత్రపటానికి పూలమాల అలంకరణ చేశారు. ప్రత్యేక ఆకర్షణగా వేదంలా ఘోషించే గోదావరి అనే పాటను మహిళా కళాశాలకు చెందిన లక్ష్మి అనే విద్యార్థిని పాడారు. ఆదిత్య డిగ్రీ కళాశాలకు చెందిన పి.వి.వి.వంశీకృష్ణ తన స్వీయ గేయంతో అందరినీ అలరించారు. తదుపరి మహిళా డిగ్రీ కళాశాలకు చెందిన ఏ వాసవి,వి సంకీర్తన, ప్రియ, అంజలి బృందం బృంద గానంతో ప్రేక్షకులను అలరించారు.ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థిని తెలుగు భాష పుట్టుక దానిలో గొప్పతనం గురించి అద్భుతమైన తన ఉపన్యాసంతో ప్రేక్షకుల చప్పట్లను తన సొంతం చేసుకుంది. వక్తలు మాట్లాడుతూ మహా భారతం యొక్క గొప్పదనం కవిత్రయం యొక్క శ్రీనాథుడు, పోతన ల యొక్క గొప్పతనాలను వివరించారు. మన భాష మంగళకరభాష అంటూ ముఖ్య అతిథి టి. జయప్రద తన ఉపన్యాసాన్ని ప్రారంభిస్తూ విద్యార్థులు అన్ని రంగాల్లో ముందు ఉండాలని, మనం ఎన్ని భాషలు అయినా నేర్చుకోవచ్చు. కానీ మనకు అవసరమైన అమ్మ భాషను మానకూడదని, యువతీ యువకులే నేడు అన్నిట్లో ముందు ఉండాలని, తమిళ కవి సుబ్రహ్మణ్య భారతి సుందర తెలుంగు అని మెచ్చుకున్నాడని, ఈ భాషలో ఉన్న కొన్ని కవితా పంక్తులు వివరించారు. అన్య భాషలు నేర్చే ఆంధ్రము రాదనుచు సకిలించు ఆంధ్రుడా చావవెందుకురా!? "అన్న కాలేజీ మాటని సందర్భంగా గుర్తు చేసుకున్నారు. కొన్ని పాఠశాలల్లో తెలుగు మాట్లాడితే శిక్షలు వేస్తున్నారని అదే విధంగా తాను సైక్రియాట్రిగా పనిచేస్తున్నప్పుడు ఒక బాలుడు మాటలు మాట్లాడటం మానేశాడని, మమ్మీ,డాడీ అనేవి తిట్లు అని మనకు మనమే తిట్టుకోకూడదని తెలియజేశారు. విద్యార్థులకు అవసరమైన అనేక అమూల్యమైన విషయాలతో ఆమె సమయపాలన పాటించి బోధించారు. సత్కార సమయంలో డాక్టర్ టి జయప్రద మీద తెలుగు ఉపన్యాసకురాలు పంచరత్న పద్యాలు చదివి అక్షరాంజలి ఘటించారు. రాజమండ్రి ఆదిత్య విద్య సంస్థ డైరెక్టర్ ఎస్పీ గంగిరెడ్డి మాట్లాడుతూ తనకు భాషన్న సాహిత్యం అన్న చాలా అభిమానం అని ఆరోగ్యం సహకరించక పోయినా భాషాభిమానంతో ఈ వేదికను గౌరవించడానికి తాను వచ్చానని తెలియజేశారు.మన భాష అంతతీయని భాష మరొకటి లేదని,దేశదేశాలు ఖండాంతరాల్లో ఈ భాషను గౌరవించి పూజించి పట్టం కడుతున్నారని,అందుకే ఆదిత్య అధినేత డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి తెలుగును ప్రధాన భాషగా ఎక్కువ మంది చదువు కోవాలని ప్రోత్సహించారని తెలిపారు. ఈ కార్యక్రమానికి ఆదిత్య ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డా.జి.వి.ఎస్ నాగేశ్వరరావు,పోలుకొండ సాయి శిరీష,ఎన్.ఎ స్.ఎస్ వాలంటీర్లు సూర్య,మనోజ్, యశస్విని,సందీప్ హర్షిణి తదితర వాలంటీర్లు సహకరించారు.ఈ కార్యక్రమంలో విద్యార్థులు పద్య పఠనం, పొడుపు కథలు, జాతీయాలు, సామెతలు, భాగవతం పై క్విజ్లో విజేతలకు ధ్రువ పత్రాలను, జ్ఞాపికలనుబహూకరించారు.

# శ్రీచైతన్య విద్యాసంస్థ గుర్తింపు రద్దు చేయాలి

- విద్యాసంస్థల్లో విలువలుతో కూడిన వ్యక్తిత్వాన్ని బోదించాలి
- శ్రీ చైతన్య విద్యాసంస్థ గుర్తింపు రద్దు చేయాలి



**రాజమహేంద్రవరం, విశ్వంవాయిస్ న్యూస్:** స్థానిక రాజమహేంద్రవరం మోరంపూడిలో ఉన్న శ్రీ చైతన్య విద్యా సంస్థను అంబేద్కర్ స్టూడెంట్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో సందర్శించడం జరిగింది అని ఈ సందర్భంగా అంబేద్కర్ స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు తాడేపల్లి విజయ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు ఆయన మాట్లాడుతూ శ్రీచైతన్య విద్యా సంస్థ గుర్తింపు రద్దు చేయాలి అని శుక్రవారం ఉదయం తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం మోరంపూడిలో గల శ్రీచైతన్య విద్యాసంస్థలో 10వ తరగతి చదువుతున్న గుర్రం విన్సెంట్ ప్రసాద్ ను సహచర విద్యార్థులు విద్యాసంస్థకు సంబంధించిన సీసీ కెమెరా ను ధ్వంసం చేసి ఆనేరాన్ని ప్రసాద్ పై నెట్టేందుకు ప్రయత్నించారు అని సదరు విషయాన్ని విద్యార్థి ప్రిన్సిపాల్ కు చెప్పడంతో కక్ష పెంచుకున్న విద్యార్థులు పక్కా ప్రణాళికతో రూమ్ కు చేరుకుని డ్రిల్ మాస్టారు ఉపయోగించే లాఠీ లాంటి కర్రతో చితక బాది, ఎలక్ట్రికల్ ఐరన్ బాక్స్ పవర్ కనెక్ట్ చేసి బాగా హీట్ ఎక్కిన ఐరన్ బాక్స్ తో పొట్ట భాగం మీద, చేతుల మీద వాతలు పెట్టి వారం రోజులు చిత్రహింసలకు గురిచేసారు అని ఈ విషయం ఎక్కడన్నా చెబితే ప్రాణాలు తీస్తాము అని అన్నారు అని దాంతో భయ బ్రాంతులకు గురైన బాధిత విద్యార్థి ఎవరికీ చెప్పకుండా ఉండిపోవడంతో తీవ్ర అనారోగ్యానికి గురైన బాధిత విద్యార్థి తన తల్లికి ఫోన్ చేయడంతో ఫోన్లో మాట్లాడిన విద్యార్థి తల్లి లక్ష్మీకుమారి కుమారుడ్ని చూడడానికి వెళ్ళి ఆరా తీయడంతో సంఘటన వెలుగులోకి వొచ్చింది అని దాంతో లక్ష్మీకుమారి విన్సెంట్ ప్రసాద్ ను ఇంటికి తీసుకువెళ్తానని ప్రిన్సిపాల్ తో చెప్పి తీవ్ర గాయాలతో వున్న కుమారుడ్ని రాజోలు ప్రభుత్వ ఆసుపత్రి అత్యవసర విభాగంలో చేర్పించారు అని ప్రస్తుతం వైద్యులు చికిత్స అందిస్తున్నారు అని విద్యాసంస్థల్లో పిల్లలకు చదువుతో పాటు విలువలుతో కూడిన వ్యక్తిత్వాన్ని బోధించాలని అని అన్నారు.విన్సెంట్ ప్రసాద్ తీవ్రంగా గాయపడినా కాలేజీ సిబ్బంది నిర్లక్ష్యంగా వదిలేయడం దారుణ మన్నారు వారిపై కూడా హత్యాయత్నం కేసు నమోదు చేయాలని డిమాండ్ చేసారు. ప్రాథమిక విద్యలో ర్యాగింగ్ ఏంటని ప్రశ్నించారు, కార్పొరేట్ విద్యాసంస్థలు అధిక ఫీజులు వసూలు చేస్తూ విద్యార్థులకు విద్యతో పాటు విలువలు బోదించకుండా నేర ప్రవృత్తి ప్రోత్సహించేలా చేస్తున్నాయన్నారు. ఇటువంటి విద్యా సంస్థల గుర్తింపు ప్రభుత్వం రద్దు చేసి విద్యార్థుల భవిష్యత్ ను కాపాడాలన్నారు, సోమవారం జరిగే గ్రీవెన్స్ లో జిల్లా కలక్టర్ కలిసి ఫిర్యాదు చేస్తామన్నారు ఈ కార్యాక్రమంలో అంబేద్కర్ స్టూడెంట్ ఫెడరేషన్ విద్యార్థి నాయకులు దారా అశోక్,గండి హర్షకుమార్, బత్తుల విశాల్,పట్నాల సాయి,కాపరపుకిరణ్, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల జీవన శైలిలో మార్పులు రావాలి

- డా మిథున్ చక్రవర్తి
- 31న ఎండోక్రైన్ సొసైటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ కాన్ఫరెన్స్..
- దివాన్ చెరువులోని ఎస్విపిసి కన్వెన్షన్ లో ఏర్పాట్లు...
- అధునాతన వైద్యం, మందుల వాడకం అంశాలపై చర్చ...
-డా.శేఖర్ రెడ్డి,డా.రాజేష్, డా రాధాకృష్ణ బృందం వెల్లడి...



**రాజమహేంద్రవరం, విశ్వంవాయిస్ న్యూస్:** రాజానగరం మండలం దివాన్ చెరువులోని ఎస్విపిసి కన్వెన్షన్ లో ఈనెల 31వ తేదీ ఆదివారం ఎండోక్రైన్ సొసైటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్నట్లు ప్రముఖ వైద్యులు డాక్టర్ మిథున్ చక్రవర్తి,డాక్టర్ శేఖర్ రెడ్డి, డాక్టర్ రాజేష్,డాక్టర్ రాధాకృష్ణ చెప్పారు. ప్రతి ఏడాది వివిధ ప్రాంతాలలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించే ఈ కాన్ఫరెన్స్ ను ఇప్పుడు 9వ కాన్ఫరెన్స్ గా రాజమండ్రి కేంద్రంగా తొలిసారి నిర్వహిస్తున్నామ ని తెలిపారు. శుక్రవారం ఉదయం స్థానిక గణేష్ చౌక్ లోని ప్రెస్ క్లబ్ లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఈసందర్భంగా డా మిథున్ చక్రవర్తి మాట్లాడు తూ షుగర్, థైరాయిడ్, హార్మోన్స్ కి సంబంధించిన వైద్యులతో పాటు,ఎండి జనరల్ మెడిసిన్, పిజి స్టూడెంట్స్ కూడా ఈ సదస్సుకి హాజరవుతారని చెప్పారు. దాదాపు వెయ్యి మంది వరకు వస్తారన్న అంచనాతో ఏర్పాట్లు చేస్తున్నామన్నా రు.ఆదివారం ఉదయం 9 గంటలకు సదస్సు ప్రారంభమై, సాయంత్రం 5గంటల వరకు సదస్సు కొనసాగుతుందన్నారు. రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్,సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, ఇతర ప్రముఖులు తదితరులు ముఖ్య అతిధులుగా పాల్గొంటారని ఆయన చెప్పారు. అధునాతన వైద్యం, మందుల వాడకం తదితర అంశాలపై చర్చ లతో సాగే ఈ సదస్సుకి రాష్ట్ర నలుమూలల నుంచి వైద్యులు హాజరవుతారని డా మిథున్ చక్రవర్తి చెప్పారు.ఎందుకంటే ఇప్పుడు వాడే మందులు పదేళ్ళ పోయాక తగ్గిపోయి, కొత్తవి వస్తున్నాయని, ఇందుకు ప్రజల జీవన శైలిలో మార్పులే ప్రధాన కారణమని ఆయన చెప్పారు.చిన్న పిల్లలో సైతం ఊబకాయం,షుగర్ వంటి సమస్యలు చూస్తున్నామని ఆయన చెబుతూ తగినంత వ్యాయామం లేకపోవడమే ఇందుకు కారణం అని తెలిపారు.ఉదయం 7గంటలకు స్కూలుకి వెళ్లి సాయంత్రం 7గంటలకు వచ్చి అలిసిపోతు న్నారని,దీంతో ఇక శారీరక శ్రమ ఉండడం లేదని, ఆయన ఉదహరించారు. ఫలితంగా 15ఏళ్ల వయస్సులోనే షుగర్ సమస్యలు వెంటాడుతున్నాయని ఆయన అన్నారు. అలాగే సమయం ఉండడం లేదని అంటున్నారని ఆయన చెబుతూ మనం సంపాదించేది ఆరోగ్యాన్ని కాపాడుకోడానికే అనే విషయం గుర్తుంచుకుని నడుచుకోవాలన్నారు. వ్యాధి వచ్చాక నయం కావడానికి మందులు వాడడం కంటే రాకుండా ఉండడానికి ఏం చేయాలో ఆవిధంగా ప్రణాళికతో ఉండాలన్నారు. డా శేఖర్ రెడ్డి మాట్లాడుతూ ఇప్పుడు దేశంలో 10కోట్ల మందికి పైగా షుగర్ ఉన్నవాళ్లు ఉన్నారని, వచ్చే ఐదేళ్లలో మరింత పెరుగుతుందని అంచనా వేస్తున్నారని అన్నారు. ఈ యాంత్రిక జీవనానికి తోడు అదేపనిగా సెల్ ఫోన్ వాడకం కూడా పెద్ద సమస్యగా మారి వ్యాధులకు కారణం అవుతోందని, పిల్లలు రోజుకు గంటకు మించి సెల్ ఫోన్ చూడకుండా నియంత్రణ చేయాలన్నారు. 135మిలియన్ల మంది ఊబకాయంతో బాధపడుతున్నారని, షుగర్,గుండె జబ్బులు, మోకాళ్ళ నొప్పులు, పక్షవాతం తదితర వ్యాధులకు ఊబకాయం సమస్య దారితీస్తోందని ఆయన వివరించారు. డా రాజేష్ మాట్లాడుతూ శరీరంలో అనేక గ్రంథులు ఉంటాయని, ఎక్కడ తేడా వచ్చినా ఇబ్బందేనన్నారు. ప్రస్తుతం మొండి బీపీలు వంటివి కూడా ఎక్కువ అయ్యాయని అన్నారు. షుగర్, హార్మోన్స్,థైరాయిడ్ వంటి సమస్యలకు నిపుణులైన వైద్యులు రాజమండ్రిలో అందుబాటులోనే ఉన్నారని, గతంలో మాదిరిగా ఎక్కడికో వెళ్లాల్సిన అవసరం లేదని ఆయన చెప్పారు. డా రాధాకృష్ణ మాట్లాడుతూ ఈ కాన్ఫరెన్స్ ద్వారా ఎప్పటికప్పుడు వైద్య విధానంలో వస్తున్న మార్పులు, చికిత్స విధానాలు తెల్సుకునే అవకాశం ఉంటుందన్నారు. ప్రజల ఆహారపు అలవాట్లు, జీవనశైలి మార్చుకోవడం ద్వారా ఆరోగ్యంగా ఉండాలన్నారు.

## రాజమహేంద్రి కళాశాలలో ఘనంగా తెలుగు భాషా దినోత్సవం..



**రాజమహేంద్రవరం, విశ్వంవాయిస్ న్యూస్:** శుక్రవారం ఉదయం గోకవరం బస్టాండ్ వద్ద ఉన్న రాజమహేంద్రి మహిళ జూనియర్, డిగ్రీ మరియు పిజి కళాశాలలో తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా స్వర్గీయ గిడుగు వెంకట రామమూర్తి పంతులు చిత్రపటానికి రాజమహేంద్రి విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ టి.కే. విశ్వేశ్వర రెడ్డి,దేశిరెడ్డి బలరాం నాయుడు, ప్రిన్సిపల్ ఎం.కే.ఎస్ ప్రసాద్ లతో కలసి పూలమాలవేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా రాజమహేంద్రి విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ టి.కే. విశ్వేశ్వర రెడ్డి మాట్లాడుతూ స్వర్గీయ గిడుగు వెంకట రామమూర్తి జయంతిని తెలుగు భాషా దినోత్సవంగా జరుపుకుంటున్నామని తెలుగు భాష మనకు మాతృ భాషని మాతృభాష స్వీయ నేత్రాలు వంటివని అలాగే పరభాష కళ్ళజోళ్ళు వంటివని ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు సెలవిచ్చారని అన్నారు. మనం కళ్ళజోళ్ళు మార్చు కోవాలంటే ముందు కళ్ళు అవసరం కాబట్టి సహజ నైనాలైనా కళ్ళను కాపాడుకున్నట్టే మాతృభాష అధ్యేయనం ప్రధానంగానూ పరభాష అధ్యయనం అనుషాంగీకం గానూ ఉండాలని అంటూ ఆధునిక తెలుగు భాషా సాహిత్యలకు వైద్యాలుకులుగా రామ్మూర్తి ఉన్నారని,ఆయన ఉపాధ్యాయుడిగా,చరిత్ర పరిశోధకుడిగా, విద్యావేత్త గా,వక్తగా, రాతకోతల్లో వ్యవహారిక భాష వినియోగానికి వినియోగానికి గిడుగు రామ్మూర్తి చేపట్టిన ఉద్యమం అసమాన్యమై నది అని, అలాగే సవర భాషకు సంబంధించి ఆయన చేసిన కృషి కూడా అమ్మో అమోఘమైనదని, సవరణ భాష సంస్కృతుల పట్ల గిడుగు రామమూర్తికి 1880లోనే ఆసక్తి కలిగిందని మన్యం ప్రాంతంలో ఉపాధ్యాయుడిగా పని చేయడం వలన కష్టపడి సవర భాష నేర్చుకున్న ఆయన వారి కోసం వారి భాషలో బోధించే పాఠశాలలు పెట్టారని ఆ భాషకు చేసిన కృషికి ప్రభుత్వం వారు బహుమతి ఇస్తానంటే ఆ డబ్బుతో మరిన్ని పాఠశాలలు పెట్టమని చెప్పారని సవర భాషకు ఓ లిపిని రూపొందించడమే కాక వారి జీవన విధానాన్ని సంస్కృతి సంప్రదాయాన్ని అధ్యయనం చేశారని వాటిని చరిత్రగా రికార్డు చేశారని సవర భాషకు నిఘంటువు వ్యాకరణం రూపొందించాలని వాచకాలను తయారు చేశారని తన కృషితో సవరణ హృదయాలను గెలిచిన గిడుగు రామ్మూర్తి ఎంతో గొప్పవారిని అన్నారు. ప్రిన్సిపాల్ ఎం కె ఎస్ ప్రసాద్ మాట్లాడుతూ సంస్కృత ప్రభావం ఎక్కువగా ఉన్న గ్రాంథిక భాష కాకుండా నిత్య వ్యవహారంలో నలుగుతున్న వాడుక భాషను అందలమెక్కించిన ఘనత వ్యవహారిక భాషా పితామహులైన శ్రీ గిడుగు రామమూర్తి పంతులు గారిదని అన్నారు. ఈ సందర్భంగా కళాశాల తెలుగు ఉపాధ్యాయురాలు కంచుమర్తి లక్ష్మిని శాలువా కప్పి, పుష్పగుచ్ఛం జ్ఞాపికలు ఇచ్చి ఘనంగా సత్కరించినారు. ఈ కార్యక్రమంలో ఎన్.ఎస్.ఎస్.పిఓ దంటు వీర వెంకటరావు,కళాశాల అధ్యాపకులు అధ్యాపకేతర సిబ్బంది,విద్యార్థులు పాల్గొన్నారు.

## నన్నయలో ఎంఏ పొలిటికల్ సైన్స్ గ్రూపును యధావిధిగాకొనసాగించాలి

- ఎస్.ఎఫ్.ఐ, డి.వై.ఎఫ్.ఐ.డిమాండ్

**రాజమహేంద్రవరం, విశ్వంవాయిస్ న్యూస్:** ఆదికవి నన్నయ విశ్వ విద్యాలయం రాజమండ్రి లోని మెయిన్ క్యాంపస్ నందు ఎం.ఏ పొలిటికల్ సైన్స్ గ్రూపును యధావిధి గా కొనసాగించాలని ఎస్.ఎఫ్.ఐ,డి.వై.ఎఫ్.ఐ నాయకులు శుక్రవారం ఉమ్మడిగా విడుదల చేసిన ప్రకటనలో డిమాండ్ చేశారు.ఈ మేరకు ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వై.భాస్కర్, ఎన్.రాజా,డివైఎఫ్ఐ జిల్లా కన్వీనర్ వి.రాంబాబు కో-కన్వీనర్ డి.అశోక్ కుమారులు మాట్లాడుతూ ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం రాజమండ్రి మెయిన్ క్యాంపస్ నందు పొలిటికల్ సైన్స్ గ్రూపును యూనివర్సిటీ యాజమా న్యం నీరు కార్చే ప్రయత్నం చేస్తుందని తప్పు పట్టారు. పొలిటికల్ సైన్స్ గ్రూపులో వచ్చిన కొన్ని వివాదాలను సమస్యలను సాకుగా చూపిస్తూ ఈ విద్య సంవత్సరం నుండి రాజమండ్రి మెయిన్ క్యాంపస్ నందు పొలిటికల్ సైన్స్ గ్రూప్ లో అడ్మిషన్స్ నిలిపివేయాలని ఆలోచన చేయడం అంటే పూర్తిగా పొలిటికల్ సైన్స్ గ్రూపును లేకుండా చేయడమేనని ఆందోళన వ్యక్తం చేశారు.ఫలితంగా ఈ గ్రూపులో ప్రస్తుతం చదువుతున్న విద్యార్థుల తో పాటు భవిష్యత్తులో చదవాలనుకునేవారు మరి ముఖ్యంగా రాజమండ్రి పరిసర ప్రాంత విద్యార్థులు తీవ్ర ఇబ్బంది పడతారని ఆవేదన వ్యక్తం చేశారు. మెయిన్ క్యాంపస్ నందు విద్యార్థులకు అవసరమైన ఎంఏ చరిత్ర లాంటి కొత్త గ్రూపులను ఏర్పాటు చేసి విద్యాభివృద్ధికి, యూనివర్సిటీ అభివృద్ధికి కృషి చేయాల్సిన యాజమాన్యం, ఉన్న గ్రూపులు లేకుండా చేయటం ఎంతవరకు సరైనదని ప్రశ్నించారు. అంటే పేద విద్యార్థులను విద్యకు దూరం చేయడమే అని నన్నయ యూనివర్సిటీ యాజమాన్యాన్ని విమర్శించారు, తక్షణమే యూనివర్సిటీ యాజమాన్యం, ప్రభుత్వ అధికారులు స్పందించి రాజమండ్రి మెయిన్ క్యాంపస్ లో ఎంఏ పొలిటికల్ సైన్స్ విభాగంలో ఆచార్యుల మధ్య వచ్చిన వివాదాలు,ఆరోపణలు వివిధ రకాల సమస్యలు పరిష్కారం చేయడం, పరిష్కారం కాని పక్షంలో నూతన ఆచార్యులను ద్వారా ఆయన పాఠాలు చెప్పిస్తూ గ్రూపును యధావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో విద్యార్థి యువజన సంఘాలు కలుపుకొని పోరాట కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు.

## ర్యాగింగ్‌కు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలి

- హాస్టల్ వార్డెన్ ను అరెస్టు చెయ్యాలి.
- శ్రీచైతన్య స్కూల్ యాజమాన్యంపై కేసు నమోదు చెయ్యాలి
- గాయపడిన విద్యార్థికి మెరుగైన వైద్యం అందించాలి
- విద్యాశాఖ ఉన్నతాధికారులు పాఠశాల లో తనిఖీలు చేపట్టాలి



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్:** రాజమహేంద్రవరం రూరల్ స్థానిక మోరంపూడి శ్రీ చైతన్య స్కూల్ విద్యార్థి పై ర్యాగింగ్ చేసి ఇస్త్రీ పెట్టితో దాడి చాలా దారుణం..వారిపై తక్షణమే చర్యలు తీసుకోవాలి అని ఆంధ్ర మాల మహానాడు రాష్ట్ర యువజన విభాగ అధ్యక్షులు ఉల్లం రవి ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.ఉల్లం రవి మాట్లాడుతూ శ్రీ చైతన్య స్కూల్ లో హాస్టల్ విద్యార్థి పై ర్యాగింగ్ సంఘటన జరగడం చాలా బాధాకరమని,ర్యాగింగ్ కు పాల్పడిన విద్యార్థులపై చర్యలు తీసుకోవాలి, హాస్టల్ వార్డెన్ ను అరెస్టు చెయ్యాలి, ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా విద్యాశాఖ ఉన్నతాధికారులు ప్రతి ప్రైవేట్ కార్పొరేట్ స్కూల్స్, ప్రభుత్వ పాఠశాలను తనిఖీ చేయాలనీ,విద్యార్థికి మెరుగైన వైద్యం అందించాలి,విద్యార్థికి న్యాయం చెయ్యాలి అని ఆయన అన్నారు.

## ఆటో డ్రైవర్లకు నెలకు రూ.10వేలు ప్రభుత్వం ఇవ్వాలి

- 2న ఆటో డ్రైవర్లతో సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా..
- జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు టి.కె.విశ్వేశ్వరరెడ్డి డిమాండ్




**రాజమహేంద్రవరం, విశ్వంవాయిస్ న్యూస్:** రాష్ట్రంలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కోసం కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న స్త్రీ శక్తి పథకంతో ఆటో డ్రైవర్లు కిరాయి లేక తీవ్రంగా నష్టపోతున్నారని తూర్పుగోదావరిజిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు టి.కె.విశ్వేశ్వరెడ్డి ఆవేదన వ్యక్తంచేశారు. రాజమండ్రి ప్రెస్ క్లబ్ లో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ మహిళలు ఆటోలు ఎక్కడం లేదని దీంతో ఆటోలకు నెలనెలా ఫైనాన్స్ వాయిదాలు చెల్లించలేక, కుటుంబాన్ని పోషించడం కష్టంగా మారే ప్రమాదం ఉందని అన్నారు.గత 15 రోజులుగా ఆటోలకు సరైన గిరాకీ లేదని ఆటో డ్రైవర్లు వాపోతున్నారని టి.కె.తెలిపారు.వారికి న్యాయం చేసేందుకు కూటమి ప్రభుత్వం ఆటో డ్రైవర్లకు నెలకు రూ.10 వేలు పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు.వచ్చేనెల ఒకటో తేదీలోగా దీనిపై ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకోకపోతే సెప్టెంబర్ 2వ తేదీన సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట కాంగ్రెస్ అనుబంధ కార్మిక సంఘం ఐఎన్టీయూసి ఆధ్వర్యంలో ధర్నా చేస్తామని ఆయన హెచ్చరించారు.ఈధర్నాలో రాజమండ్రి సిటీ పరిసర ప్రాంతాల ఆటో డ్రైవర్లు పాల్గొనాలని టి.కె.విశ్వేశ్వరరెడ్డి కోరారు. విలేకరుల సమావేశంలో జిల్లా ఐఎన్టీయూసి అధ్యక్షుడు జె.టి. రామారావు,నగర కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి పట్నాల శ్రీనివాసరావు,బెజవాడ రంగారావు, డాక్టర్ రాజశేఖర్,దెయ్యాల రాజు,బర్రే సుబ్రహ్మణ్యం, సబ్బెళ్ళ విజయ దుర్గారెడ్డి, బత్తిన చంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ లక్ష్మి గణపతి నవరాత్రుల్లో లలితా పారాయణం



**రాజమహేంద్రవరం, విశ్వంవాయిస్ న్యూస్:** స్థానిక 23వ వార్డు నందివాడవారి వీధిలోని శ్రీవజ్ర గణపతి ఆలయ మందిరం శ్రీలక్ష్మి గణపతి నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం భక్తి శ్రద్ధలతో లలితా పారాయణం జరిగింది.ఆర్య కళానికేతన్ భజన మండలి శ్యామ సుందరి టీచర్ శిష్య బృందం ఉదయం 11 గంటల నుంచి 12 గంటలవరకు లలితాపారాయణం చేశారు. సాయంత్రం 6.30 గంటలకు లలితా పారాయణం జరుగింది.పేరకం వెంకట సీతారాం అనంతలక్ష్మి దంపతులు,పొత్తూరి వెంకట సత్యనారాయణ వెంకటలక్ష్మి దంపతులచే పూజా కార్యక్రమాలు జరిగాయి. నిత్యకార్యక్రమ పురోహితులు బొడెం నాగసత్య రవి కుమార్ శర్మ దంపతుల చేత పూజలు చేయించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆదిలక్ష్మి భజనమండలిచే భజన కార్యక్రమం జరిగింది.రాత్రి స్వామివారికి ఏకదశ హారతులు ఇచ్చారు. శ్రీ సాయి గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు చందా సత్రం మాజీ చైర్మన్, మాజీ కార్పొరేటర్ వాకచర్ల కృష్ణ,పేరూరి మహేంద్రనాథ్ సరిదే ధన వెంకటేశ్వరరావు కనమర్లపూడి చంద్రకాంత్ మారడుగుల సుబ్బయ్య వానపల్లి మురళీకృష్ణ నంబూరి కృష్ణ చైతన్య సోమిశెట్టి భీమేశ్వరరావు జ్యోతిరామ్ విఠల్ మోరే,వాకచర్ల భరత్ ఫ్రెండ్స్ సర్కిల్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## వికలాంగుల పెన్షన్ రావడానికి మందకృష్ణ మాదిగ కృషి

**నగరంలో వీహెచ్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్:** శుక్రవారం సాయంత్రం రాజమండ్రి స్థానిక బైపాస్ రోడ్ సిమెంట్రిపేట అంబేద్కర్, బాబు జగ్జీవన్ విగ్రహాల వద్ద పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ ఆదేశాల మేరకు ఆయన స్థాపించిన విహెచ్పిఎస్ (వికలాంగుల హక్కుల పోరాట సమితి) స్థాపించి నేటికి 18 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా వీహెచ్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా రాజమండ్రి జిల్లా ఇంచార్జ్ బయ్యవరపు రాజేశ్వరావు మాదిగ, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి డాన్ సూరి మాదిగ విచ్చేశారు. ఈసందర్భంగా ముఖ్య విద్యుల సమక్షంలో ఆవిర్భావ దినోత్సవ కేక్ కట్ చేసి అందరికీ పంచారు. ఎమ్మార్పీఎస్ నగర అధ్యక్షులు తోలేటి రాంప్రసాద్ మాదిగ, విహెచ్పిఎస్ నాయుకులు వీర రాఘవులు మాట్లాడుతూ ఈనాడు వికలాంగుల 6వేల పెంక్షన్ వస్తుందంటే అదీ పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ పుణ్యము అని అన్నారు. రాష్ట్ర కార్యదర్శి డాన్ సూరి మాదిగ మాట్లాడుతూ వికలాంగుల కోసం పద్మశ్రీ మందా కృష్ణ మాదిగ ఎనలేని పోరాటం చేసారు అని గుర్తుచేశారు. కార్యక్రమానికి పి హెచ్ పి ఎస్ నాయకులు నారాయణ, విహెచ్పిఎస్ మహిళ అధ్యక్షురాలు కళావత, రాంబాబు, సత్యనారాయణ, ఎంఎస్పి అండ్ ఎంఆర్పిఎస్ టౌన్ నాయుకులు వైరాల రమేష్,రాచర్ల సుధాకర్, సత్యనారాయణ,చిన్నారావు, మౌలి సురేష్, కూరాకుల రాజు, మోరస బాలు, దాసరి నాని, యర్రప్రతాప్, యజ్జల శ్రీను, పెద్దఅబ్బులు, వి హెచ్ పి ఎస్ నాయకులు శ్రీను మాదిగ తదితరులు పాల్గొన్నారు.

## ప్రైవేట్ స్కూళ్లను విద్యశాఖ అధికారులు పర్యవేక్షణ చెయ్యాలి



**రాజమహేంద్రవరం,విశ్వం వాయిస్ న్యూస్:** రాజమండ్రి స్థానిక మోరంపూడిలో శ్రీచైతన్య స్కూల్స్ నందు తోటి 10వ తరగతి విద్యార్థుల దాడిలో గాయపడ్డ రాజోలు విద్యార్థి న్యాయం కోసం యాజ మాన్యంపై తీసుకున్న చర్యలపై డి వై ఈఓ దిలీప్ కుమార్ అరా తీస్తున్న ప్రముఖ న్యాయవాది బీఎస్పీ అర్బన్ నాయకులు ఇసుకపట్ల రాంబాబు, బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు పట్నాల విజయకుమార్, జిల్లా గౌరవ అధ్యక్షుడు నక్కా వేంకటరత్నం రాజు. అధికారులు మాట్లాడుతూ మొత్తం సంఘటనకు సదరు స్కూల్ పిడి నిర్లక్ష్యమే కారణమని వివరించారు.పిడి ఇస్త్రీ పెట్టే అనుమతి లేకుండా రూమ్ లో ఉంచటం తో జూవేనెల్స్ ఇస్త్రీ పెట్టేతో దాడి చేశారని, ఇది పూర్తిగా యాజమాన్యం నిర్లక్ష్యం అని, దీనితో సదరు బాధ్యులపై కేసు కూడా నమోదు చేశారని వివరించారు. ఈ సందర్భంగా ఇసుకపట్ల రాంబాబు మాట్లాడుతూ విపరీతంగా పెరిగిపోతున్న ప్రయివేట్ స్కూల్ నందు విద్యార్థుల సేఫ్టీ కోసం స్కూల్స్ తీసుకుంటున్న చర్యలపై డీఈవో, డివైఈవో లు తరచు పర్యవేక్షణ జరపాలని చూసించగా సదరు అధికారులు సానుకూలంగా స్పందించారు.

## అమలాపురం లో పవర్ లిఫ్టింగ్ పోటీలు ప్రారంభం



**అమలాపురం టౌన్ విశ్వం వాయిస్ న్యూస్** నేషనల్ స్పోర్ట్స్ డే సందర్భంగా శుక్రవారం ఆఫీసర్స్ రిక్రియేషన్ క్లబ్ నందు జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 4వ యునైటెడ్ ఈస్ట్, వెస్ట్ గోదావరి జిల్లాల పవర్ లిఫ్టింగ్ పోటీలు ను రాష్ట్ర టిడిపి ఆర్గనైజింగ్ సెక్రెటరీ మెట్ల వెంకటరమణ బాబు ప్రారంభించారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఒలింపిక అసోసియేషన్ అధ్యక్షులు అల్లాడ శరత్ బాబు , ఆర్గనైజేషన్ సెక్రెటరీ, పప్పుల శ్రీరామ్ మూర్తి, డీఎస్డీవో పి.ఎస్. సురేష్ కుమార్, పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షులు వై. పద్మరాజు, బాడీ బిల్డింగ్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు గారపాటి చంద్రశేఖర్, అమలాపురం వైస్ ఎంపీపీ అడపా వెంకటసుబ్రహ్మణ్యం, కల్వకొలను బాబు, సి.వి రామన్ స్కూల్ డైరెక్టర్ రవణం వేణుగోపాల్, దివితేజ స్కూల్ కరెస్పాండెంట్ ఎం. ప్రతాప్, కంకిపాటి వెంకటేశ్వరరావు లు పాల్గొన్నారు.

# ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు భాషా దినోత్సవం



రామచంద్రపురం విశ్వం వాయిస్ న్యూస్ :-కృతివెంటి పెర్రాజు పంతులు డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిహెచ్ రామకృష్ణ ఆధ్వర్యంలో తెలుగు భాషా దినోత్సవం ఘనంగా నిర్వహించడం జరిగింది. ముందుగా ప్రిన్సిపాల్ రామకృష్ణ మరియు ఇతర అధ్యాపక బృందం కలిసి గిడుగు రామ్మూర్తి పంతులు చిత్రపటాని పూలమాలతో అలంకరించటం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రిన్సిపాల్ రామకృష్ణ మాట్లాడుతూ అమ్మ వంటి అమృత భాషను మరవద్దని, తెలుగు భాష నేర్చుకుంటూనే ఇతర భాషలు కూడా అభ్యసించాలని విద్యార్థులకు సూచించారు.ఈ సందర్భంగా వైస్ ప్రిన్సిపాల్ వై పద్మజా మాట్లాడుతూ మన బావ వ్యక్తీకరణకు ముఖ్యమైనది మన మాతృభాష అని,మనం మనసులోని భావాన్ని వ్యక్తం చేయడానికి మాతృభాష అత్యంత ఆవశ్యకమని తెలియజేశారు.అలానే ఐక్యూఏసి కోఆర్డినేటర్ డాక్టర్ ఎన్ శ్రీనివాసరావు మాట్లాడుతూ తెలుగు భాషతోపాటు ఇతర భాషను కూడా నేర్చుకోవలసిన అవసరం నేటి విద్యార్థికి ఎంతైనా ఉందని తెలియజేశారు. తెలుగు భాషను చక్కగా నేర్చుకున్నట్లయితే ఇతర భాషలను అభ్యసించడం విద్యార్థులకు చాలా సులభంగా నేర్చుకోగలరని చెప్పారు.తెలుగు హిందీ విభాగాధిపతి డాక్టర్ ఎన్ వి రమణ భాషల యొక్క గొప్పతనాన్ని తెలియజేశారు. విరుతో పాటు డాక్టర్ ఎన్ లక్ష్మీ మాట్లాడుతూ బావ వ్యక్తీకరణకు భాష ముఖ్యం,ఏ వ్యక్తి అయినా తన నైపుణ్యాన్ని విజ్ఞానాన్ని ప్రదర్శించా లంటే భాషను మాత్రమే ఉపయోగించాలి అని భాషకు గొప్పతనాన్ని తెలియజేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పి.ప్రభాకర్ హాజరైనారు.అయన మాట్లాడుతూ తేనె కన్నా తీయనిది,పాలమీగడ కన్నా స్వచ్ఛమైనది మన భాష అని,దేశ భాష లందు తెలుగు లెస్స అని, శ్రీకృష్ణదేవరాయలు ఊరికే అనలేదు అని తెలియజేసారు. క్రీస్తుపూర్వం 400 నుంచి తెలుగు భాష ఉనికిలో ఉందని, తెలుగులోనే మాట్లాడదాం భావితరాలకు తెలుగు భాషా తీయదనాన్ని అందిద్దాం అంటూ భాష యొక్క ఔన్నత్యాన్ని గొప్పతనాన్ని సాటిచెప్పారు.ఈ సందర్భంగా విద్యార్థినీ విద్యార్థులు తెలుగు భాష యొక్క గొప్పతనం గురించి వారి మాటల్లో చక్కగా తెలియజేశారు. ఈ కార్యక్రమాన్ని తెలుగు అధ్యాపకులు డాక్టర్ ఎం సుజాత,డాక్టర్ కే శ్రీదేవి నిర్వహించారు.ముఖ్య అధితి ప్రభాకర్ కు ఘన సన్మానం చేశారు.ఈ కార్యక్రమంలో అధ్యాపకులు,అధ్యాపకరేత సిబ్బంది విద్యార్థినీ విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## అమరావతి సమావేశంలో రాజకీయ ప్రతినిధులు పాల్గొనాలి



**అమలాపురం, జిల్లా ప్రతినిధి విశ్వం వాయిస్ న్యూస్ ఆగస్టు 29:** జిల్లావ్యాప్తంగా గుర్తింపు పొందని రాజకీయ పార్టీలు 2019 నుండి గత 6 సంవ త్సరాలుగా ఒక్క ఎన్నికలో కూడా పోటీ చేయనీ రాజకీయ పార్టీల ప్రతి నిధులు సెప్టెంబర్ 8వ తేదీ అమరావతిలో నిర్వహించే సమావేశంలో విచారణకు హాజరుకావాలని జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ శుక్రవారం ఒక ప్రక టనలో పేర్కొన్నారు .జై సమైక్య ఆంధ్ర పార్టీ జిల్లాలో ఒక్క ఎన్ని కలో కూడా ఈ 6 సంవత్సరాల కాలంలో పోటీ చేయలేదన్నారు ఈ పార్టీ విచారణ తేదీని 08.09.2025న ఉదయం 11:40 గంటలకు షెడ్యూల్ చేసినట్లు తెలిపారు. అటువంటి విచారణకు అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి,పార్టీ అధిపతి తప్పని సరిగా హాజరు కావాలనీ పైన పేర్కొన్న తేదీ నాటికి పార్టీ నుండి ఎటు వంటి సమాధానం రాక పోతే, ఈ విషయంలో పార్టీకి ఏమీ చెప్పడానికి లేదని భావిం చబడుతుందన్నారు పార్టీకి తదుపరి సమాచారం లేకుండా తగిన చర్య తీసుకోబడుతుం దన్నారు. కావున జిల్లాలోని గుర్తింపు పొందని మరియు ఆరు సంవత్సరాలుగా ఎటువంటి ఎన్నికల పోటీలో పాల్గొనని రాజకీయ పార్టీల ప్రతినిధులు ఈ విషయాన్ని గుర్తించాలని ఆయన ప్రకటనలో సూచిం చారు.

## ఢీకొట్టిన ఘటనలో బాధితుడికి న్యాయం చేయాలి

**వీసికే పార్టీ రాష్ట్ర కార్యదర్శి బొంతు రమణ డిమాండ్.**



**అల్లవరం విశ్వం వాయిస్ న్యూస్:** భార్య, కుమారిడితో మూడు చక్రాల వాహనంపై ఇంటికి వెళుతున్న అల్లవరం మండలం కొమరగిరిపట్నం గ్రామానికి చెందిన నెల్లి ఏడుకొండలును, అల్లవరం మండలం గోడితిప్ప వద్ద మద్యం మత్తులో వాహనం నడుపుతూ బలంగా ఢీకొట్టి పారిపోయిన గోడిలంక గ్రామానికి చెందిన వాసర్ల రామకృష్ణ పై చర్యలు తీసుకుని బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని వీసీకే పార్టీ రాష్ట్ర కార్యదర్శి బొంతు రమణ డిమాండ్ చేశారు. ఈ ఘటనలో బాధితుని రెండు కాళ్లకు నాలుగు చోట్ల విరిగిపోయిన నేపథ్యంలో శుక్రవారం అతను చికిత్స పొందుతున్న కిమ్స్ ఆసుపత్రికి వెళ్లి రమణ పరామర్శించారు. దీనిపై రమణ మాట్లాడుతూ దళితుడైన వికలాంగుడు ఏడుకొండలు, అతని భార్య రోజూ అమలాపురం వచ్చి ప్రయివేటుగా పనిచేసుకుంటేనే కానీ పూట గడవని నిరుపేదలని, అయితే మద్యం సేవించి ర్యాష్ డ్రైవింగ్‌తో ఢీకొట్టడమే కాకుండా కనీసం మానవత్వం అనేది లేకుండా అక్కడి నుంచి పారిపోయేందుకు ప్రయత్నించాడని, స్థానికంగా కొందరు ఆసుపత్రికి తీసుకెళ్లాలని ఒత్తిడి చేయడంతో కేవలం అల్లవరం సీహెచ్‌సీ వరకు వచ్చి అక్కడి నుంచి తప్పించుకుని పారిపోయాడని, ఆతరువాత కూడా ఇంతవరకు కనీసం తీవ్ర గాయాలపాలైన వికలాంగుడైన బాధితుడు ఏమయ్యాడో అనే ఆలోచన లేకుండా తప్పించుకు తిరుగుతున్నాడని ఆరోపించారు. పైగా తన భర్తకు ఏమయ్యిందో తెలియక తీవ్ర భయాందోళనలో ఉన్న అతని భార్య వెంకటరమణిని సదరు రామకృష్ణ బెదింరిపు ధోరణిలో మాట్లాడాడని ఆవేదన వ్యక్తం చేసిందన్నారు. అతనికి వత్తాసు పలుకుతూ గోడిలంక గ్రామానికి చెందిన సర్పంచ్ భర్త, టీడీపీ గ్రామకమిటీ నాయకుడు ఇద్దరు సిటింగ్ పేరుతో బాధితుడి కుటుంబికులను పిలిచి న్యాయం చేయకపోగా ఆపై ఇష్టమొచ్చినట్లు చేసుకోవాలని దురుసుగా మాట్లాడారని బాధితుల కుటుంబికులు వాపోయారని మండిపడ్డారు. దళితుడైన వికలాంగుడు ఏడుకొండలు ఈ పరిస్థితికి మద్యం సేవించి డ్రైవింగ్ చేయడమే కాకుండా యాక్సిడెంట్ చేసి ఆపై బాధితుడి భార్యను బెదిరింపు ధోరణిలో మాట్లాడి మానసికంగా వేధించిన వ్యక్తిపై హత్యాయత్నం కేసు నమోదు చేసి బాధితునికి న్యాయంచేయాలని రమణ డిమాండ్ చేశారు.

## సమస్యల పై హోరెత్తిన మున్సిపల్ కౌన్సిల్

**వాటర్ వర్క్ స్థలం వివాదం తేల్చాలి...**
**ఎస్సీ వార్డులపై చిన్న చూపు తగదు...**
**టిడ్కో సమస్యల పై అధికారులు నిర్లక్ష్యం విడండి...**
**చైర్ పర్సన్ రాణి అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం...**





**మండపేట టౌన్... విశ్వం వాయిస్ న్యూస్...** మండపేట మున్సిపల్ కౌన్సిల్ సమావేశం చైర్ పర్సన్ పతివాడ నూక దుర్గా రాణి అధ్యక్షతన శుక్రవారం కౌన్సిల్ సాధారణ, అత్యవసర సమావేశాలు జరిగాయి. ఎక్స్ అఫిషియో సభ్యులు ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు హాజరయ్యారు. పలు అంశాలని చర్చించి ఆమోదించారు.పలు అంశాలపై సుదీర్ఘ చర్చ జరిగింది. ఎస్సీ వార్డులంటే వివక్ష చూపిస్తున్నారని ఎనిమిదో వార్డ్ కౌన్సిలర్ మందపల్లి రవికుమార్ అన్నారు. గతంలో 39 లక్షల రూపాయలు కమ్యూనిటీ హాల్ కి ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు మంజూరు చేయించారని ఇప్పటివరకు ఆ పనులు జరగడం లేదని వాపోయారు ఇతర వార్డుల్లో ఆగమేఘాలపై చేస్తున్నారని ఇదెక్కడి న్యాయమని ప్రశ్నించారు. దీనిపై ఎమ్మెల్యే స్పందిస్తూ ఇక్కడ రాజకీయాలు చేయొద్దని హితవు పలికారు, అందరూ సమానమే అని భావంతో పనిచేస్తున్నానని పేర్కొన్నారు. మున్సిపల్ వాటర్ వర్క్ స్థల వివాదంపై ఎమ్మెల్యే వేగుళ్ల ఘాటుగా స్పందిస్తూ గత ఎనిమీది నెలలుగా కౌన్సిల్ సమావేశాలలో ఇదే అంశం చర్చకు రావడం ఏంటని ప్రశ్నించగా రెవిన్యూ అధికారులు స్పంధనలేదని కమిషనర్ చెప్పగా ఎమ్మెల్యే అక్కడ నుంచే ఫోన్ చేసి స్పీకర్ పెట్టి కమిషనర్ని మాట్లాడమని ఇచ్చారు, వీరి సంభాషణ పూర్తవగానే ఎమ్మెల్యే తీవ్ర స్థాయిలో స్పందిస్తూ వాటర్ వర్క్స్ స్థలం ఎట్టి పరిస్థితుల్లోనూ అన్యక్రాంతం కాకూడదని అవసరమైతే డ్రోన్ సర్వేతో సర్వే పూర్తి చేయాలని సూచించారు. ఆక్రమణ సర్వే అంశాన్ని మున్సిపల్ చైర్ పర్సన్ దుర్గారాణి సమక్షంలో రెడ్డి రాధాకృష్ణ, కమిషనర్ టీవీ రంగారావు, తాహసిల్దార్ తేజేశ్వరరావులు చర్చించి నిర్ణయం తీసుకోవాలని కోరారు.

**టిడ్కో సమస్యల పై అధికారులు నిర్లక్ష్యం వీడండి...**

టిడ్కో నివాశాలలో లో నివసిస్తున్న తాము అవస్థలు ఎదుర్కొంటున్నామని అక్కడి వాసులు మొరపెట్టుకున్నారు. కౌన్సిల్ నిర్వహిస్తున్న సమయం లో చైర్ పర్సన్ పతివాడ నూక దుర్గా రాణి అనుమతితో వారు సమావేశం హాల్ లో ప్రవేశించారు. వారు మాట్లాడుతూ గొల్లపుంత 59 నుండి 66 బ్లాక్ వరకు ఉన్న వాటర్ ట్యాంక్ లో వాడుకొనే నీరు పైకి ఎక్కడం లేదన్నారు. పైపులు పగిలి పోవడంతో నీరు పైకి ఎక్కడం లేదన్నారు. అక్కడ కార్యాలయం లో ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదన్నారు. నివాసం ఉంటున్న ప్రతి కుటుంబం పిల్లలతో పాటు చాలా ఇబ్బందిగా ఉంటుందని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు మాట్లాడుతూ తక్షణమే అక్కడ ఒక్కో బ్లాక్ కు ఇద్దరు సిబ్బంది నీ నియమించి అక్కడ ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కమీషనర్ టివి రంగారావు చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. ఇబ్బందులు తలెత్తకుండా శాశ్వత పరిష్కారం చేపట్టాలని చైర్ పర్సన్ రాణి అన్నారు. ఈ కార్యక్రమం లో అపార్ట్మెంట్ నివాసిస్తులు కే విజయ దుర్గా, జ్యోతి, రజియా బేగం, రేష్మ,వసంత, శ్రీదేవి, శ్రీనివాస్, కరీమున్నిసా, రబి యా , పద్మావతి,లక్ష్మి దుర్గా, లలిత, కుమారి, శ్రీ లత వర్షిణి, ప్రసాద్, భాను, శ్రీదేవి, గంగరాజు ,సత్తిబాబు దుర్గారావు, వరలక్ష్మి, సుబ్బలక్ష్మి రమేష్, దయమని, రమణ కుమారి, కళ్యాణి లు పాల్గొన్నారు.

## సామూహిక కుంకుమార్చన పూజలు

**-2000మందికి పైగా హాజరైన మహిళలు**
**-ఉత్సవ కమిటీని అభినందించిన ఎమ్మెల్యే ఆదిరెడ్డి**






**రాజమహేంద్రవరం, విశ్వంవాయిస్ న్యూస్:** వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా స్థానిక 22వ డివిజన్లోని నాళం భీమరాజు వీధిలో ఉన్న శ్రీ సిద్ధి వినాయక ఆలయం వద్ద శుక్రవారం సామూహిక కుంకుమార్చన పూజలు పూజలు జరిగాయి. ఊహించని దానికన్నా అధికంగా 2000 మంది మహిళలు ఈ పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. భక్తులకు తగినట్టుగా వార్డు ఇన్చార్జ్ శెట్టి జగదీష్, ఆలయ చైర్మన్ మద్ది నారాయణరావుతో పాటు పాలకమండలి డైరెక్టర్లు భారీ ఏర్పాట్లు చేశారు. ప్రశాంతమైన వాతావరణం లో ఆధ్యాత్మికత వెల్లి విరిసేలా ఈ పూజా కార్యక్రమాలు అత్యంత వైభవోపేతంగా జరిగాయి. మాటూరి సిద్ధార్థ, సౌమ్య మొటుమర్రి మురళి,లలిత దంపతులచే ఈ కుంకుమార్చన పూజలు జరిగాయి.రాజమండ్రి సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ పాల్గొని భక్తులందరికీ వినాయక చవితి శుభాకాంక్షలు తెలియజేశారు.నిన్నటి వరకు నిరాటంకంగా వర్షం కురిసినప్పటికీ వరుణుడి కరుణతో మంచి వాతావరణం మధ్యలో కుంకుమార్చన పూజలు ఘనంగా జరిగాయని, శెట్టి జగదీష్,ఆలయ పాలక మండలి సభ్యులు ఏ లోటు లేకుండా విజయవంతంగా ఈ కార్యక్రమం చేపట్టడం అభినందనీయమన్నారు. పూజా కార్యక్రమం అనంతరం భక్తులందరికీ అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఆలయ డైరెక్టర్లు కొమ్మ రమేష్ బాబు,గ్రంధి ధన్య దీపిక, తాడి మరియ,లక్కోజు వీరభద్రరావు, కూరెళ్ళ శిరీష,ఉప్పు సుబ్రహ్మణ్యం, తాతాపూడి యశోద, చౌకొండ మురళీకృష్ణ, కపిలవాయి వినయ్ తో పాటు స్థానికులు నల్లం ఆనంద్, బ్రింగుమళ్ళ నారాయణరావు,కొత్త రాజేష్,కొత్త రామానంద్, పప్పు మురళీ, కోట్ల కాశీ,రాధాగోపి,చెన్నా రాము,నాళం చైతన్య, ఓణి, కిరీటీ, అజూరాజ్,తమ్మన సుబ్బారావు,పైండా రవి, తదితరులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ని కలిసిన రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ కె.ఎస్ జవహర్



**విశ్వం వాయిస్ న్యూస్ కొవ్వూరు** ఏజెన్సీ ఏరియాలో ఉన్నటువంటి దళితులకి సంక్షేమ కార్యక్రమాలు అదేవిధంగా విద్య ఆరోగ్యం సంబంధించి అంశాలు రావడంలేదని దానికి ప్రత్యయం ఏర్పాటు చేయాలని రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ కె.ఎస్ జవహర్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ని కోరారు. గురువారం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ని కె ఎస్ జోహార్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఎస్సీ కమిషనర్ కు సంబంధించిన పలు అంశాలపై చంద్రబాబు నాయుడుతో చర్చించి, లెదర్ ఇండస్ట్రీస్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ద్వారా నిరుద్యోగ యువత కు ఉపాధి కల్పించాలని, చర్మ కారు వృత్తి మీద ఆధారపడిన వాళ్లకి సెంట్రల్ ఫుట్వేర్ ఇండస్ట్రీస్ నుండి ట్రైనింగ్ తీసుకొని స్కిల్ డెవలప్మెంట్ అభివృద్ధి చేసి వారిని స్కిల్ డెవలప్మెంట్ ద్వారా శిక్షణ తరగతులు ఇప్పించవలసిందిగా కోరడం జరిగిందన్నారు. రాష్ట్రంలో ఉన్నటువంటి దళితులు ఏదైనా ప్రధానంగా అట్రాసిటీ గాని అదే విధంగా ల్యాండ్ విషయంలో గాని ఉన్నటువంటి సమస్యలను చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లడం జరిగిందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమస్యలను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుని అధికారులను ఆదేశించడం జరిగిందని అన్నారు.

## తెలుగు భాషా దినోత్సవం సందర్బంగా 100 మంది తెలుగు కవుల చాయ చిత్రాల ప్రదర్శన





**అమలాపురం టౌన్ విశ్వం వాయిస్ న్యూస్** శుక్రవారం జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల వన్నెచింతలపూడిలో (గిడుగు రామ్మూర్తి జయంతి) తెలుగు భాషా దినోత్సవం,( హాకీ మాంత్రికుడు ధ్యాన్ చంద్ జయంతి( జాతీయ క్రీడా దినోత్సవం ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో 100 మంది తెలుగుకవుల చాయ చిత్రాలతో వారి జీవిత విశేషాలతో ప్రదర్శన ఏర్పాటు చేయడం జరిగింది అనంతరం తెలుగు భాష ఉపాధ్యాయులు బడుగు సత్యనారాయణ మరియు మామిడి శెట్టి శ్రీనివాసరావు, వ్యాయామ ఉపాధ్యాయులు విఘ్నేశ్వరుడుని ప్రధానోపాధ్యాయులు జి నాగ సత్యనారాయణ, పాఠశాల సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో పేరెంట్స్ కమిటీ చైర్మన్ ముత్యాల బాబు, గ్రామస్తులు తెలుగు భాష అభిమానులు పాల్గొన్నారు.


# ....ఎందరికో గోదావరి జిల్లాలకు ఎమ్మెల్యే టికెట్లు ఇప్పించిన "పులస" చేప...

....స్వతంత్రం వచ్చినప్పటి నుంచి లాబీయింగ్....

....ఈ చేపకు దాసోహమైన అగ్రనేతలు....

.....గోదావరి,గౌతమి,సర్కార్ రైళ్లు బోగీలలో పులస వాసనలు....

**కాకినాడ జిల్లా:విశ్వం వాయిస్ న్యూస్** ప్రధాన పార్టీల ఎమ్మెల్యే టికెట్లను కోట్లాది రూపాయలు హెచ్చించి తెచ్చుకుంటున్న ప్రస్తుత నేతలను మనం చూస్తూనే ఉన్నాం. కాని గోదావరి జిల్లాలలో అరుదుగా దొరికే పులస చేప ఈ ఎమ్మెల్యే టికెట్లు ఇప్పించిందంటే నమ్మడం ఈ తరం వారికి కష్టంగానే ఉంటుంది. కాని గతంలో జరిగింది ఇదే. గోదావరి నదిలో మాత్రమే అదీ వరదల సీజన్లోనే దొరికే పులుస అంటే ఇష్టపడని వారు ఎవరూ ఉండరు. అందుకునే రాజకీయ లాబీయింగ్ కు ఈ పులసను వాడుకునేవారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాజధాని హైదరాబాదు, దేశ రాజధాని ఢిల్లీలో ఈ పులస లాబింగ్ ఓ లెవెల్లో ఉండేది ఒకప్పుడు. స్వతంత్రం వచ్చినప్పుడు నుంచి ఈ పులస బంధం కొనసాగుతూ వచ్చింది. ఎందరికో రాజకీయ భవిష్యత్తును ఇచ్చింది. గోదావరి పులస తిన్న విశ్వాసంతో ఎన్నికల సమయంలో బీ.ఫారాలపై సంతకాలు పెట్టేవారనే వాదన ఎప్పటినుంచో ఉంది.





**...స్వతంత్రం వచ్చినప్పటి నుంచి...**

మనకు స్వతంత్రం వచ్చినప్పటి నుంచి పులస లాబింగ్ జరుగుతూ వస్తుంది. ఇది నేటి తరం వారికి ఆశ్చర్యం కలిగించే విషయమైనప్పటికీ అప్పట్లో అదే జరిగేది. ఎందరికో ఈ పులస రాజకీయ భవిష్యత్తును ఇచ్చిందని ఆనాటి రాజకీయ నాయకులు నేటికీ చెబుతూ ఉంటారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు సంబంధించి ఎన్నికల వ్యవస్థ ఏర్పడిన తొలినాలల్లో కపిలేశ్వరపురం జమీందారులైన ఎస్పీబీకె పట్టాభి రామారావు,సత్యనారాయణ రావు (చంటిదొర)సోదరులు ఒక వర్గంగా ఉండేవారు. మరో వర్గంలో రాయవరం మనసుబుగా ప్రసిద్ధి చెందిన ఉండవల్లి సత్యనారాయణ మూర్తి ఉండేవారు. వీరిలో జమీందారు సోదరులు ప్రత్యక్ష రాజకీయాల్లో ఉంటూ ఎన్నికల్లో పోటీ చేసి గెలుపు ఓటమలు చెందే వారు. కాని రాయవరం మునిసబు ఎన్నికలలో పోటీ చేసే వారు కాదు.కింగ్ మేకర్ గా ఉంటూ ఎంతోమందికి టిక్కెట్లు ఇప్పించి రాజకీయ భవిష్యత్తు ఇచ్చేవారు. కాకపోతే ఈ రెండు వర్గాలు రాష్ట్ర, దేశ రాజకీయాల్లో చక్రం తిప్పేవాళ్ళు. ఆర్థికంగా స్థితి మంతులైన వీరు ఈ పులస సీజన్లో హైదరాబాద్, ఢిల్లీలో ఉండే రాజకీయ ప్రముఖులకు, ఉన్నత అధికారులకు ఈ పులస రుచి చూపించేవారు. వీరిలో ముఖ్యంగా కపిలేశ్వరపురం జమిందారులను పేర్కొవచ్చు. వీరి కనుసైగల్లోనే మత్స్యకారులు ఉండేవారు. కపిలేశ్వరపురం కేంద్రంగా ఎంతోమంది చేపల వేట చేస్తూ జీవనోపాధి పొందేవారు. ఇప్పటికీ పొందుతున్నారు కూడా. దీంతో పులస సీజన్ వచ్చిందంటే రుచికరమైన చేపలను ఈ జమీందారుల బంగ్లాకు తీసుకొచ్చేవారు. వాటిని అద్భుతంగా వండించి హైదరాబాదు, ఢిల్లీకి పంపించేవారు. ఇదంతా వారి సంస్థలైన చెల్లూరు సుగర్ ఫ్యాక్టరీ,వేమగిరి సర్వారాయ బాటిలింగ్ యూనిట్ (గోల్డ్ స్పాట్ కంపెనీ) ప్రతినిధులు ద్వారా రాష్ట్ర, కేంద్ర మంత్రులకు చేరవేసేవారు. రాయవరం మునుసబు కూడా జమీందారులకు ఏమాత్రం తీసిపోకుండా పులసలను వండించి క్యారేజీల ద్వారా పంపించేవారు. కేవలం పులస తిన్న విశ్వాసంతోనే ఎన్నికల సమయంలో జిల్లాలో వీరికి అనుకూలమైన అభ్యర్థులకు టిక్కెట్లు కేటాయించడంలో ప్రాధాన్యత ఇచ్చేవారు. ఇదంతా అప్పట్లో పెద్ద చర్చనీయాంశంగా మారేది.

**....ఆ తర్వాత రోజుల్లోనూ పులస లాబింగ్ కొనసాగింది...**

తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం తర్వాత కూడా గోదావరి జిల్లాలో రాజకీయంగా ఈ పులస లాబింగ్ కొనసాగిందనే చెప్పవచ్చు. గోదావరి పరివాహక ప్రాంతంలో ఉండే రాజకీయ రాజకీయ నాయకులు తమ గాడ్ ఫాదర్ లకు ఈ పులసలను వండించి పంపించడం ద్వారా బలమైన ఆశీస్సులు అందుకునేవారు. వీరిలో రాజమండ్రి, కడియం, ఆలమూరు, కొత్తపేట రామచంద్రపురం, అమలాపురం, తాళ్ళరేవు వంటి నియోజకవర్గ నాయకులు పై ఈ పులస ప్రభావం స్పష్టంగా కనిపించేది. తెలుగుదేశం పార్టీ నాయకుల విషయానివస్తే... ధవలేశ్వరం కేంద్రంగా పులస పేరొందింది. ఆ ధవళేశ్వరం కడియం నియోజవర్గ పరిధిలో ఉండేది. అప్పటి ఎమ్మెల్యేగా ఉండే వడ్డీ వీరభద్రరావు ఈ పులస వండించి పంపించడంలో తెలుగు రాష్ట్రాల్లో పేరు పొందారు. అప్పట్లో పులస సీజన్ వచ్చిందంటే ప్రతిరోజు ఆ చేపల కూరను వడ్డి వీరభద్రరావు వండిస్తూ ఉండేవారట.అప్పటి ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు కు ఆయనే తీసుకెళ్లి దగ్గరుండి వడ్డించేవారని నేటికీ సీనియర్ టిడిపి నాయకులు చెబుతూ ఉంటారు. అలాగే గౌతమి, గోదావరి ఎక్స్ ప్రెస్ ల ద్వారా హైదరాబాదుకు పులస కూరలను వండించి తరలించేవారు. అలాగే రాజమండ్రి ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి, ఆలమూరు ఎమ్మెల్యేలుగా పనిచేసిన వల్లూరి నారాయణమూర్తి, వివిఎస్ఎస్ చౌదరి, రామచంద్రపురం ఎమ్మెల్యేగా పనిచేసిన తోట త్రిమూర్తులు, అమలాపురం ఎమ్మెల్యేగా ఉండే మెట్ల సత్యనారాయణ రావు, కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యనందరావు తదితర నేతలు ఈ పులస ఆతిథ్యం ఇవ్వడంలో ముందుండేవారిని చెప్పు వచ్చు.అలాగే కాంగ్రెస్ పార్టీలో కడియం ఎమ్మెల్యేగా ఉండే జక్కంపూడి రామ్మోహనరావు, కొత్తపేట ఎమ్మెల్యేలుగా ఉండే ఎమ్.వి.ఎస్ రాజు, చిర్ల సోమసుందరరెడ్డి,రామచంద్రాపురం ఎమ్మెల్యే గా ఉండే పిల్లి సుబోష్ చంద్ర బోస్,నాటి అమలాపురం ఎమ్మెల్యేలు కుడిపూడి ప్రభాకరరావు,కుడిపూడి చిట్టబ్బాయి వంటి పేర్లు ప్రముఖంగా వినిపించేవి.అన్నిటికంటే ఆశ్చర్యకరమైన విషయం ఏంటంటే ఆత్రేయపురం పూతరేకు హైదరాబాదులో కంటే ఆత్రేయపురంలో తింటానే ఆ అనుభూతి అద్భుతంగా ఉంటుందంటారు. అలాగే తెలంగాణకు చెందిన చాలా మంది రాజకీయ నాయకులు గోదావరి జిల్లాలకు వచ్చి ఈ పులస రుచి చూసేవారని అందుకనే అప్పట్లో జూలై,ఆగస్టు,సెప్టెంబర్ నెలలలో ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు ఎక్కువగా ఉండేవని ఓ రాజకీయ ప్రముఖులు తెలిపారు. ఎందుకంటే ఊరికినే భోజనం కోసం వస్తే బాగోదని ప్రారంభోత్సవాల పేరుతో ఈ గోదావరి జిల్లాలకు వచ్చి మంత్రులు ఇతర ప్రముఖులు ఈ పులస ఆతిథ్యాన్ని పొంది చక్కటి అనుభూతిని ఆస్వాదించే వారు.

**....గౌతమి,గోదావరి,సర్కార్ ఎక్స్‌ప్రెస్ లలో పులస వాసనలు...**

పులసల సీజన్ వచ్చిందంటే చాలు గౌతమి, గోదావరి, సర్కార్ ఎక్స్‌ప్రెస్ ల బోగీలు పులస వాసనలతో గుబాయించేవి. ప్రతిరోజు వీటిని హైదరాబాదులో అయిన వాళ్ళకి పంపించడం రివాజుగా ఉండేది. కేవలం మంత్రులు, రాజకీయ నాయకులు,రాష్ట్ర సచివాలయంలో ఉన్నతాధికారులకే గాక బంధు మిత్రులకు ఈ పులస కూర పంపించేవారు.సచివాలయంలో మంత్రి చెప్పినా కదలని ఫైల్ ను ఈ పులస చేప సంతకం పెట్టించేదంటే దాని ప్రత్యేకత ఎలాంటిదో చెప్పవచ్చు. అందుకనే అప్పుడు హైదరాబాద్ వెళ్ళడానికి ప్రధానంగా ఉండే ఆ రెండు రైళ్లు భోగిలలో పులసలను వండించి క్యారేజీలలో పంపించేవారు. ఇప్పట్లా ఆర్టీసీ, ప్రైవేట్ బస్సులు ఉండేవి కాదు. హైదరాబాద్ అంటే గౌతమి,గోదావరి ఎక్స్‌ప్రెస్ లే ఫేమస్. ఎంత పంపిస్తే మాత్రం రైలు బోగీలలో వాసనలు రావడం ఏంటి అనుకుంటున్నారు కదూ.. అప్పుడు ఆ కూరకుండే రుచి అలాంటిది మరి. అదీకాక ఇప్పట్లా అధునాతన ప్యాకింగ్ సౌకర్యం అప్పట్లో ఉండేది కాదు. క్యారేజీలలోనే వండించి పంపించడం వల్ల ఆ వాసనలు బయటకు వచ్చేవి. చేపల కూర వేడివేడిగా తింటే బాగుంటుంది కదా మరి అంత దూరం పంపిస్తే పాడైపోదా అనుకోవచ్చు. అంటే మిగిలిన చేపల కూరల మాదిరిగా వేడివేడిగా తింటే పులస బాగోదు.వండిన తర్వాత రోజు నుంచే తినాలి. రెండు మూడు రోజులు వరకు ఈ కూర ఏ మాత్రం పాడవకుండా ఉండడం దీని స్పెషాలిటీ. ఇన్ని బాధలెందుకు అసలు ఆ చేపనే పంపించేస్తే వాళ్లు వండుకు తింటారు కదా అనే కామెంట్ చేయాలను కుంటున్నారు కదాండి.అది కుదరదండి.ఈ పులస చేపను ఎవరుబడితే వాళ్లు వండేస్తే ఆ రుచి రాదండి. గోదావరి జిల్లాలలోనే నిపుణులైన మహిళలు కట్టెల పొయ్యిలపై వీటిని అద్భుతంగా వండగలుగుతారు. ఇది అందరికీ సాధ్యం కాదు. వండటాన్ని బట్టి దీని రుచి ఉంటుంది.అమ్మో... ఇన్ని ప్రత్యేకతలు ఉన్నాయా అనిపిస్తుంది కదాండి. పులుసు అంటేనే ప్రత్యేకతల కలబోత. అన్నట్లు ఆ మూడో రైలు గురించి చెప్పలేదేంటి అను కుంటున్నారా.. ఆ సర్కార్ ఎక్స్‌ప్రెస్ మద్రాస్ వెళ్లేది. మరి రాజకీయ నాయకులు,ఉన్నతాధికారులు కోసం హైదరాబాదు వెళితే పులస ప్రియులైన ఎంతోమంది సినీ ప్రముఖుల కోసం ఈ సర్కార్ ఎక్స్‌ప్రెస్ ద్వారా నాటి మద్రాసు నేటి చెన్నై పంపించేవారు. అప్పటికి సినిమా రంగం హైదరాబాద్ కు రాలేదు. గోదావరి జిల్లాలకు సినిమా రంగానికి ఉన్న అనుబంధం ఎలాంటిదో మీకు ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. అందుకనే కావలసిన వారికి ప్రత్యేకంగా పులసను వండించి ఈ సర్కార్ ఎక్స్‌ప్రెస్ లో పంపించేవారు.సినిమా వాళ్లు కూడా అప్పట్లో పులస ను వెండి తెరపైకి అనేక సందర్భాలలో తీసుకిచ్చేవారు. పులస గురించి తెలుయని కొంతమంది ఇప్పుడు తక్కువ చేసి మాట్లాడుతున్నారు గాని దాని చరిత్ర ఏ స్థాయిలో ఉందో చూసారు కదా అదేనండి..ఈ విశ్వం వాయిస్ ప్రత్యేక కథనం పాఠకులకోసం

## ఆయిల్ కొంటున్నారు... మానండి అమెరికా మళ్లీ వార్నింగ్

**న్యూయార్క్ :** రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్న భారత్, చైనా, బ్రెజిల్ వంటి దేశాలపై అమెరికా రిపబ్లికన్ పార్టీకి చెందిన సీనియర్ సెనేటర్ లిండ్సే గ్రాహం మరోసారి తీవ్రంగా విమర్శలు గుప్పించారు. ఈ దేశాల చర్యల వల్లే ఉక్రెయిన్‌లో రష్యా యుద్ధ యంత్రాంగం కొనసాగుతోందని ఆయన ఆరోపించారు. రష్యా అధ్యక్షుడు పుతిన్‌కు మద్దతు ఇస్తున్నందుకు భారత్ ఇప్పటికే మూల్యం చెల్లించుకుంటోందని, ఇతర దేశాలకు కూడా త్వరలోనే ఇదే గతి పడుతుందని ఆయన గట్టిగా హెచ్చరించారు. ఉక్రెయిన్‌లోని కీవ్ నగరంపై రష్యా జరిపిన భీకర దాడిలో 23 మంది పౌరులు ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటన జరిగిన వెంటనే లిండ్సే గ్రాహం సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా స్పందించారు. "రష్యా నుంచి చౌకగా చమురు కొనుగోలు చేస్తూ పుతిన్ యుద్ధానికి ఊతమిస్తున్న భారత్, చైనా, బ్రెజిల్ వంటి దేశాలకు ఇప్పుడెలా అనిపిస్తోంది? మీ కొనుగోళ్ల వల్లే పిల్లలతో సహా అమాయక పౌరులు ప్రాణాలు కోల్పోతున్నారు. పుతిన్‌కు మద్దతిచ్చినందుకు భారత్ ఇప్పటికే మూల్యం చెల్లిస్తోంది. మిగతా దేశాలకు కూడా త్వరలోనే ఇదే గతి పడుతుంది" అని ఆయన తన పోస్ట్‌లో పేర్కొన్నారు.గతంలో డొనాల్డ్ ట్రంప్ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు భారత దిగుమతులపై 50 శాతం టారిఫ్‌లు విధించిన విషయాన్ని ఆయన పరోక్షంగా ప్రస్తావించారు. పుతిన్‌కు మద్దతివ్వడం వల్లే భారత్ ఇలాంటి పరిణామాలను ఎదుర్కొంటోందని వ్యాఖ్యానించారు. రష్యాతో వాణిజ్యం కొనసాగిస్తున్న ఇతర దేశాలు కూడా ఇలాంటి పర్యవసానాలకు సిద్ధంగా ఉండాలని హెచ్చరించారు.లిండ్సే గ్రాహం చాలాకాలంగా రష్యా చమురు ఆదాయంపై విమర్శలు చేస్తున్నారు. "చమురు, గ్యాస్ ఆదాయం లేకపోతే రష్యా కుప్పకూలిపోతుంది. భారత్, చైనా, బ్రెజిల్ వంటి దాని వినియోగదారులను దెబ్బతీయడమే మా ప్రధాన లక్ష్యం" అని ఆయన గతంలో ఎన్‌బీసీకి ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో స్పష్టం చేశారు. ఇతర దేశాల నుంచి వస్తున్న ఆదాయంతోనే రష్యా యుద్ధాన్ని కొనసాగిస్తోందని ఆయన అభిప్రాయపడ్డారు.

## ఏపీకి లక్ష కోట్ల పెట్టుబడులే లక్ష్యం

**విశాఖపట్టణం :** ఆంధ్రప్రదేశ్‌ను ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో దేశంలోనే అగ్రగామిగా నిలబెట్టేందుకు పటిష్ఠమైన ప్రణాళికతో ముందుకెళ్తున్నామని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. రాబోయే ఐదేళ్లలో ఈ రంగంలో ఏకంగా లక్ష కోట్ల రూపాయల పెట్టుబడులను ఆకర్షించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ఆయన ప్రకటించారు. విశాఖలో జరిగిన ఇండియా ఫుడ్ మాన్యుఫాక్చరింగ్ సదస్సులో పాల్గొన్న ఆయన, రాష్ట్రంలో ఉన్న అపార అవకాశాలు, ప్రభుత్వ పాలసీల గురించి వివరించారు.ప్రస్తుతం దేశ ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో ఆంధ్రప్రదేశ్ 9 శాతం వాటాతో 50 బిలియన్ డాలర్ల విలువను కలిగి ఉందని చంద్రబాబు తెలిపారు.

## పారిశ్రామికవేత్తగా, వ్యాపారవేత్తగా రాష్ట్రంలో ప్రతి మహిళ ఎదగాలి

**కాకినాడ సిటీ:విశ్వం వాయిస్ న్యూస్** ప్రతి మహిళ వ్యాపారవేత్తగా, పారిశ్రామిక వేత్తగా ఎదిగేలా రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహం, రక్షణలను మహిళలందరూ సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర మహిళా కమీషన్ చైర్ పర్సన్ డా.రాయపాటి శైలజ కోరారు. శుక్రవారం కాకినాడ జిల్లాలో పర్యటించిన రాష్ట్ర మహిళా కమిషన్ చైర్ పర్సన్ రాయపాటి శైలజ ఉదయం స్థానిక స్మార్ట్ సిటీ సమావేశ హాలులో ఐసిడిఎస్ విభాగం మహిళల సంక్షేమం, భద్రత, హక్కులు అంశాలపై నిర్వహించిన జిల్లా స్థాయి అవగాహనా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైయ్యారు. అనంతరం మీడియా ప్రతినిధులతో సమావేశం నిర్వహించి, మహిళా కమీషన్ చేపడుతున్న వివిధ కార్యక్రమాలను వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళల భద్రత, రక్షణ కేవలం ప్రభుత్వం, పోలీసులు ఒక్కరిదే బాధ్యత కాదని సమాజంలో ప్రతి ఒక్కరూ ఈ బాధ్యత స్వీకరించేందుకు ముందుకు రావాలని కోరారు. ప్రభుత్వం ఎన్ని వనరులు కల్పించినా, పోలీస్ విభాగం ద్వారా శక్తి యాప్, శక్తి టీమ్స్, మహిళా పోలీస్ స్టేషన్ వంటి ఎన్ని వ్యవస్థలు ఏర్పాటు చేసినా, మహిళలపై అక్కడక్కడా లైంగిక వేధింపులు, దాడులు ఇంకా జరుగుతునే ఉన్నాయని, అవగాహన లోపం వల్లే ఇటువంటి సంఘటనలు జరుగుతున్నాయని, మహిళా శిశు సంక్షేమ శాఖ ద్వారా ప్రతి చోటా, వేసవి సెలవుల్లో కూడా కిశోర వికాశం వంటి కార్యక్రమాల ద్వారా గుడ్ టచ్, బాడ్ టచ్, పోక్సో, పోష్ తదితర చట్టాల గురించి బాలికలకు అవగాహన కల్పించడం జరుగుతోందన్నారు. మహిళా కమీషన్ ద్వారా ఈ అవగాహనా కార్యక్రమాలను రాష్ట్ర వ్యాప్తంగా మరింత విస్తృతంగా చేపడుతున్నాం. మహిళల రక్షణ దిశగా కమీషన్ చేపట్టిన కార్యక్రమాలు మంచి ఫలితాలనిస్తున్నాయని, ఇటీవల వెలువడిన జాతీయ స్థాయి స్వర్వేలో వైజాగ్ నగరం దేశంలో బాలికలకు అత్యంత భద్రమైన నగరాల్లో ఒకటి గాపేర్కొనడం మనందరం ఆనందించే అంశమన్నారు. కేవలం వైజాగ్ నగరమే కాకుండా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం లోని ప్రతి ఊరిని ఆడ పిల్లలకు భద్రమైనదిగా తీర్చి దిద్దడమే లక్ష్యాంగా మహిళా కమీషన్ పనిచేస్తోందని, ఇందుకు అందరి సహకారం అవసరమని తెలిపారు. ముఖ్యంగా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ఎన్జిఓ సంస్థలు మంచి విద్యా, మార్కుల సాధనతో పాటు, సమాజంలో భద్రంగా ఏలా ఉండాలనే అంశంపై ఆడపిల్లలు అవగాహన కల్పించాలని, అలాగే మగ పిల్లలు బాలికలు, మహిళల పట్ల మర్యాదగా వ్యవహరించేట్లు నైతిక శిక్షణ ఇవ్వాలని కోరారు. ఆడబిడ్డలు, మహిళల పై అకృత్యాలు జరిగినపుడు, వాటిపై ధైర్యంగా ఫిర్యాదు చేసేదంకు బాధితులు ముందుకు రావాలని, రిపోర్టింగ్ పెరిగి నేరస్తులకు శిక్షలు పడితే, నేర ప్రవృత్తి కలిగిన వారికి వణుకు పుట్టించే గట్టి హెచ్చరికలుగా నిలుస్థాయని, లింగ పరమైన నేరాలు తగ్గుతాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్త్రీ శక్తి పథకం ద్వారా మహిళలకు కల్పించిన ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం వల్ల ఎక్కువ మంది మహిళలు బయటికి వచ్చి ఆర్థికాభివృద్ధి కార్యక్రమాలలో పాల్గొంటారని, తద్వారా మహిళా సాధికారత మరింత పెరిగి, రాష్ట్ర అర్థిక వ్యవస్థలో మహిళలు కీలక భూమిక వహిస్తారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తున్న రక్షణ, ప్రోత్సాహాలను మహిళులు సద్వినియోగం చేసుకోవాలని చైర్ పర్సన్ డా.రాయపాటి శైలజ కోరారు.




## మహనీయ మహా ప్రవక్త 1500 వ జయంతి మహోత్సవం...

సెప్టెంబర్ 5 న జష్మే మిలాద్ ఉన్ నబీ వేడుకలు....



**మండపేట టౌన్... విశ్వం వాయిస్ న్యూస్...** మహనీయ మహమ్మద్ ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వ సల్లెం వారి 1500 వ జయంతి ఉత్సవాలు సెప్టెంబర్ 5న శుక్రవారం నిర్వహిస్తున్నట్లు మండపేట జామియా మస్జిద్ ఇమామ్ మహమ్మద్ గులాం మొహమ్మద్ ముర్షిద్ రజ్వీ అన్నారు. మండపేట లో శుక్రవారం ప్రార్థనల అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా మిలాద్ ఉన్ నబీ వేడుకలు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. మండపేట లో వచ్చే నెల 5 శుక్రవారం ఉదయం తొమ్మిది గంటలకు కలువపువ్వు సెంటర్ లోని హానఫీ అహలే సున్నత్ వల్ జమాత్ జామియా మస్జిద్ నుండి శాంతి ర్యాలీ నిర్వహిస్తామని చెప్పారు.సైదిల్ పేట గాంధీనగర్,బస్ స్టాండ్,మెయిన్ రోడ్ మీదుగా రావుల పేట డొక్కా సీతమ్మ కమ్యూనిటీ హాల్ వద్దకు చేరుతుందన్నారు. అక్కడ ఆధ్యాత్మిక ప్రసంగం కార్యక్రమం నిర్వహిస్తారని చెప్పారు. ఉత్తర ప్రదేశ్ జౌన్ పూర్ ఇస్లామీయ ప్రసంగికులు డాక్టర్ మహమ్మద్ అహమద్ మిజ్ బాహి ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వ సల్లెం వారి జీవిత చరిత్ర పై ఆధ్యాత్మిక ప్రసంగం చేస్తారని పేర్కొన్నారు. పాతెహా (ప్రార్థన ) అనంతరం జుమ్మా నమాజ్ నిర్వహిస్తారని చెప్పారు. తదుపరి అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తారు. మహిళలు, చిన్నార్లు, ముస్లిం లు అందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. హనఫీ అహలే సున్నత్ వల్ జమాత్ జామియా మస్జిద్ కమిటీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మహనీయ మహా ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వ సల్లెం వారి 1500 జయంతి ముస్లిం లకు అత్యంత ప్రత్యేకమని పేర్కొన్నారు.

## బండారులంక లో ఘనంగా నిర్వహించిన సామూహిక కుంకుమార్చన



**అమలాపురం టౌన్ విశ్వం వాయిస్ న్యూస్** అమలాపురం రూరల్ మండలం బండారులంక గ్రామం మట్టపర్తి వారి పాలెంలో వేంచేసి ఉన్న శ్రీ సిద్ధి బుద్ధి సమేత వరసిద్ధి వినాయక స్వామి వారి వినాయక చవితి నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా మూడో రోజు శుక్రవారం కాలెపు మోహన్ రావు అర్చకత్వాన మహిళలచే సామూహిక కుంకుమార్చన కార్యక్రమం కమిటీ ప్రతినిధుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలకు అమ్మవారి ప్రతిమ, గాజులు, రుద్రాక్ష , కాటన్ బ్యాగ్ కమిటీ వారు అందించారు. ఈ కార్యక్రమంలో కమిటీ ప్రతినిధులు కడలి రాజు, కడలి రామకృష్ణ, మట్టపర్తి అజయ్ ,మట్టపర్తి వరప్రసాద్, మామిడిశెట్టి విష్ణుప్రసాద్, మట్టపర్తి శేష గిరిరావు, గ్రామ పెద్దలు మట్టపర్తి శ్రీనివాస్, దొమ్మేటి నరసింహారావు, మట్టపర్తి నాగేశ్వరావు, మట్టపర్తి బూరయ్య, మట్టపర్తి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

## మండపేట మున్సిపాలిటీ కౌన్సిల్ మీటింగ్ లో ఎమ్మెల్యే వేగుళ్ల సీరియస్...

మున్సిపల్ రెవెన్యూ శాఖపై విజిలెన్స్ ఎంక్వయిరీ కి ఆదేశం...



**మండపేట టౌన్... విశ్వం వాయిస్ న్యూస్...** గవర్నమెంట్ జీతాలు తీసుకుంటూ తమ వర్కులు సక్రమంగా చేయట్లేదు అంటూ రెవెన్యూ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసిన ఎమ్మెల్యే వేగుళ్ళ మున్సిపల్ వర్కులను సక్రమంగా చేయకుండా సచివాలయం పై వంక పెట్టుకుని డ్యూటీలు చేయట్లేదని ఇది సరైన పద్ధతి కాదని అధికారులపై మండిపడ్డారు. పురపాలక సంఘ పరిధిలో చాలా షాపుల నుంచి తమ సొంత లాభాల కోసం మున్సిపాలిటీ రెవెన్యూ గండి కొట్టే విధంగా వసూలు చేస్తున్నట్లు వచ్చిన ఆరోపణలకు అధికారులు సమాధానమివ్వాలని నిలదీసారు. గత కొన్ని సంవత్సరాలుగా కోట్ల ఆదాయం ఎక్కడికి వెళ్తుందో తెలియాలని దీనిపై విజిలెన్స్ అధికారులచే విచారణ జరిపించాలని మున్సిపల్ కమిషనర్ కు ఆదేశాలు ఇవ్వడం జరిగింది. ఉన్నత స్థాయి అధికారులు రంగంలోకి దిగితే మున్సిపల్ అధికారుల బండారం బట్టబయలవుతుందని అంతవరకు ఇది తేలదని మండిపడ్డ ఎమ్మెల్యే వేగుళ్ళ

## రాజ్యసభ సభ్యులు"సానా"చొరవ తో మ్రోగిన సైరన్....

**కాకినాడసిటీ : విశ్వం వాయిస్ న్యూస్** కాకినాడ నగరంలో గత కొన్ని నెలలుగా నిలిచిపోయిన వాటర్ వర్క్స్ ఆవరణలో ప్రతిరోజు మూడుసార్లు మ్రోగే సైరన్, రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబు చొరవతో మళ్లీ ప్రారంభమైంది. నగర ప్రజలు ఈ సమస్యను రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబు దృష్టికి తీసుకువెళ్లగా, ఆయన వెంటనే నగరపాలక సంస్థ కమిషనర్ భావన ఐఏఎస్ కి సూచనలు చేశారు. ఫలితంగా శుక్రవారం మధ్యాహ్నం 12 గంటల నుంచి సైరన్ మ్రోగడం ప్రారంభమైంది. సానా సతీష్ బాబు ఫౌండేషన్ చైర్మన్ తలాటం హరీష్ పాల్గొనగా అధికారులు స్విచ్ ఆన్ చేశారు. ఈ సందర్భంగా తలాటం హరీష్ మాట్లాడుతూ %-% "సానా సతీష్ బాబు గారి చొరవతో నగర ప్రజలకు మళ్లీ ఈ సౌకర్యం అందుబాటులోకి వచ్చింది" అన్నారు. నగర ప్రజల తరఫున రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబు గారికి కృతజ్ఞతలు తెలిపారు.

# వాల్‌నట్స్‌ను నానబెట్టి తింటున్నారా?



వాల్‌నట్స్ ఆరోగ్యానికి మంచివని మనకు తెలుసు. కానీ, వాటిని నేరుగా తినడం కంటే నానబెట్టి తింటే ఎక్కువ ప్రయోజనాలు ఉంటాయని నిపుణులు చెబుతారు. వాల్‌నట్స్‌ను నానబెట్టడం వల్ల వాటిలో ఉండే పోషకాలు శరీరానికి సులభంగా అందుతాయి. ఇది మెదడు, జీర్ణ వ్యవస్థ పనితీరును మెరుగుపరుస్తుంది. మెదడు ఆరోగ్యం: వాల్‌నట్స్‌లో ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్స్ ఎక్కువగా ఉంటాయి. ఇవి మెదడు పనితీరును మెరుగుపరుస్తాయి. జ్ఞాపకశక్తిని పెంచుతాయి. జీర్ణక్రియ: నానబెట్టిన వాల్‌నట్స్‌లో ఎంజైమ్‌లు చురుగ్గా మారతాయి. ఇవి జీర్ణశక్తిని మెరుగుపరుస్తాయి. పోషకాలను శోషించుకోవడంలో సహాయపడతాయి. మలబద్ధకం సమస్య ఉన్నవారికి ఇది చాలా మంచిది. గుండె ఆరోగ్యం: ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్స్ చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గిస్తాయి. గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గిస్తాయి. బరువు తగ్గించడం: వాల్‌నట్స్‌లో ప్రొటీన్, ఫైబర్ అధికంగా ఉంటాయి. ఇవి ఎక్కువ సమయం ఆకలి వేయకుండా చేస్తాయి. దీనివల్ల బరువు తగ్గడానికి ఉపయోగపడుతుంది. మధుమేహ నియంత్రణ: వాల్‌నట్స్‌లో ఉండే ఫైబర్ రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రిస్తుంది. ఇది మధుమేహ వ్యాధిగ్రస్తులకు మంచిది. మంచి నిద్ర: వాల్‌నట్స్‌లో మెలటోనిన్ అనే హార్మోన్ ఉంటుంది. ఇది నిద్ర నాణ్యతను మెరుగుపరుస్తుంది.

## బ్రేక్‌ఫాస్ట్‌లో అన్నం తింటున్నారా?



ఉదయాన్నే అల్పహారం కాకుండా చాలా మంది డైరెక్ట్‌గా అన్నమే తింటూ ఉంటారు. అయితే ఇలా మార్నింగ్ బ్రేక్‌ఫాస్ట్‌లో బియ్యంతో చేసిన అన్నం తినటం వల్ల శరీరంలో జరిగే మార్పులేంటంటే.. ఉదయాన్నే బ్రేక్‌ఫాస్ట్‌లో అన్నం తినడం వల్ల కొందరికి మలబద్ధకం సమస్య వస్తుంది. కాబట్టి ఈ సమస్య ఉన్నవాళ్లు ఉదయాన్నే అన్నం తినకపోవడమే మంచిదని నిపుణులు చెబుతున్నారు. కానీ, ఇలా మార్నింగ్ బ్రెక్‌ఫాస్ట్‌లో అన్నం తినటం వల్ల లాభాలు అనేకం ఉన్నాయని చెబుతున్నారు. ఉదయాన్నే అన్నం తినటం వల్ల మంచి ఫలితం ఉంటుందని చెబుతున్నారు. బరువు తగ్గాలనుకుంటే ఉదయాన్నే లిమిట్ గా అన్నం తినడం మంచిది. అన్నం తీసుకోవడం వలన శరీరాన్ని శక్తివంతంగా ఉంచుకోవచ్చు. దాంతో పాటుగా ఇమ్యూనిటీని కూడా పెంచుకోవచ్చు అంటున్నారు. అన్నం తింటే అధిక రక్తపోటు సమస్య తగ్గుతుంది. గుండె జబ్బులు కూడా రాకుండా ఉంటాయని ఆరోగ్య నిపుణులు చెప్పారు. అలాగే కణాలని దెబ్బతీస్తే ఫ్రీ రాడికల్స్ నుంచి రక్షిస్తుంది. అన్నం కార్బోహైడ్రేట్లకు మంచి మూలం. ఇవి శరీరానికి కావాల్సిన శక్తిని అందించడానికి సహాయపడతాయి. అలాగే రోజంతా యాక్టివ్‌గా ఉంచుతుంది. రోజంతా పనిచేయడానికి శక్తి లభిస్తుంది. అన్నంలో యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి కణాల ఐచీూ ను దెబ్బతీసే ఫ్రీ రాడికల్స్ నుంచి శరీరాన్ని రక్షిస్తాయి. ఇది మీ ఆరోగ్యం దెబ్బతినే అవకాశాలను తగ్గిస్తుంది. మెదడుకు శక్తిని అందించే గ్లూకోజ్?కు అన్నం బెస్ట్ ఆప్షన్. బ్రేక్‌ఫాస్ట్‌లో అన్నం తినడం వల్ల మీరు మరింత ఏకాగ్రతతో, స్పష్టంగా ఆలోచించగలరని నిపుణులు అంటున్నారు. ఉదయం పూట అన్నం తినడం వల్ల గుండె ఆరోగ్యం మెరుగుపడుతుంది. అన్నంలో ఫైబర్, ఖనిజాలు, యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గిస్తాయి. మార్నింగ్ బ్రేక్‌ఫాస్ట్‌లో అన్నం తినేవాళ్లు మితంగా మాత్రమే తీసుకోవాలని నిపుణులు చెబుతున్నారు. అలాగే, మార్నింగ్ బ్రేక్‌ఫాస్ట్ తప్పనిసరిగా సమయానికి తినాలని నిపుణులు చెబుతున్నారు. అలాగే అల్పాహారాన్ని కాస్త హెవీగా తీసుకోవాలి. రాత్రి ఆలస్యంగా తినడం మానుకోవాలి. ఉదయాన్నే త్వరగా తినాలి.. ఇలా వీటిని ఫాలో అయితే హెల్తీగా ఉండొచ్చు.

## అరటిపండుపై మిరియాల పొడి వేసుకుని తింటే ఎన్ని లాభాలో?





అరటిపండులో ఫైబర్ పుష్కలంగా ఉంటుంది. ఇది జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. మిరియాలు ఎంజైమ్‌ల విడుదలను పెంచుతాయి. ఫలితంగా జీర్ణక్రియ మెరుగ్గా ఉంటుంది. మలబద్ధకం, అసిడిటీ వంటి సమస్యలకు ఇది మంచి మందు. రోగనిరోధక శక్తి: మిరియాల్లో యాంటీ ఆక్సిడెంట్లు, యాంటీ బ్యాక్టీరియల్ లక్షణాలు ఎక్కువగా ఉంటాయి. ఇవి శరీరాన్ని ఇన్‌ఫెక్షన్ల బారిన పడకుండా కాపాడతాయి. జలుబు, దగ్గు, ఫ్లూ నుండి రక్షణను అందిస్తుంది. బరువు నియంత్రణ: బరువు తగ్గాలనుకునే వారికి ఇది బెస్ట్ సొల్యూషన్. అరటిపండు శరీరానికి శక్తిని ఇస్తుంది. పెప్పర్ జీవక్రియను వేగవంతం చేస్తుంది. శరీరంలోని కొవ్వును వేగంగా కరిగిస్తుంది. ఈ రెండింటినీ కలిపి తినటం వల్ల ఎక్కువ కాలం ఆకలికి దూరంగా ఉంచుతుంది. ఇది బరువు నియంత్రణలో సహాయపడుతుంది. చర్మ సంరక్షణ: అరటిపండులోని విటమిన్లు, మిరియాలలోని యాంటీఆక్సిడెంట్లు చర్మానికి అంతర్గతంగా పోషకాలను అందిస్తాయి. ఈ పరిహారం శరీరం నుండి విషాన్ని తొలగిస్తుంది. ఫలితంగా చర్మం ఆరోగ్యంగా, కాంతివంతంగా ఉంటుంది. మానసిక ఆరోగ్యం: అరటిపండులో ట్రిప్టోఫాన్ అనే అమినో యాసిడ్ ఉంటుంది. ఇది సెరోటోనిన్ ఉత్పత్తికి దోహదం చేస్తుంది. మిరియాలు మానసిక అలసటను తగ్గిస్తుంది. ఒత్తిడిని దూరం చేస్తుంది.

## గర్భిణీలు లవంగం మొగ్గలు పొరబాటున కూడా ముట్టుకోకూడదు..



లవంగం దాదాపు ప్రతి ఇంటిలో కనిపించే ఒక సుగంధ ద్రవ్యం. లవంగాలు ఆహార రుచి, వాసనను రెట్టింపు చేయడమే కాకుండా, వీటిని తినడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు కూడా లభిస్తాయి. అయితే లవంగాలను ఎల్లప్పుడు సరైన పరిమాణంలో మాత్రమే తీసుకోవాలి. ఎందుకంటే వీటి అధిక వినియోగం ఆరోగ్యానికి హాని కలిగిస్తుంది. లవంగాలు తినడం వల్ల కలిగే ప్రయోజనాలు అన్నీఇన్నీకావు. ఇవి అనేక వ్యాధులకు దివ్యౌషధం. కానీ ఎక్కువగా లవంగాలు తీసుకుంటే మాత్రం సమస్యలను కలిగిస్తుంది. కాబట్టి లవంగం తినడానికి సరైన సమయం ఏమిటో? ఎలా తీసుకోవాలో? లవంగాలలో యూజెనాల్ అనే సమ్మేళనం ఉంటుంది. ఈ సమ్మేళనాలు సహజ నొప్పి నివారిణిగా పనిచేస్తాయి. ముఖ్యంగా పంటి నొప్పి, తలనొప్పి సమయంలో లవంగాల నూనెను పూయడం లేదా లవంగాలను నమలడం వల్ల ఉపశమనం లభిస్తుంది. అలాగే కడుపు సమస్యలలో లవంగాలు చాలా ఉపయోగకరంగా ఉంటాయని వైద్యులు అంటున్నారు. ఇవి గ్యాస్, అజీర్ణం, ఆమ్లత్వం నుంచి ఉపశమనం కలిగిస్తాయి. భోజనం తర్వాత ఒకటి లేదా రెండు లవంగాలను నమలడం వల్ల ఆహారం సులభంగా జీర్ణమవుతుంది. లవంగాలలో యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి శరీరానికి వ్యాధులతో పోరాడే శక్తిని ఇస్తాయి. ముఖ్యంగా జలుబు, దగ్గు, ఇన్ఫెక్షన్లను నివారించడంలో ఇది ప్రభావవంతంగా ఉంటుంది. లవంగాలలో ఉండే యాంటీ బాక్టీరియల్ లక్షణాలు నోటిలోని బ్యాక్టీరియాను చంపి, శ్వాసను తాజాగా ఉంచుతాయి. అందుకే లవంగాలను అనేక టూత్‌పేస్టులలో ఉపయోగిస్తారు. లవంగాలను అధికంగా తీసుకోవడం వల్ల కడుపులో చికాకు, ఆమ్లత్వం, అలెర్జీలు వస్తాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు. గర్భధారణ సమయంలో వైద్యుల సలహా మేరకు మాత్రమే లవంగాలు తినాలి. ఎందుకంటే అవి గర్భాశయానికి ముప్పు తలపెడతాయి. లవంగాల నూనెను చర్మానికి నేరుగా పూయడం వల్ల చికాకు కలుగుతుంది. దీన్ని ఎల్లప్పుడూ మరొక నూనెతో కలిపి వాడాలి. అలాగే, పూసే ముందు ప్యాచ్ టెస్ట్ చాలా అవసరం. లవంగాలు రక్తాన్ని పలుచన చేస్తాయి. కాబట్టి శస్త్రచికిత్స చేయించుకునేవారు, ఇప్పటికే తీవ్రమైన అనారోగ్యంతో బాధపడుతున్నవారు లవంగాలు తినడం మానేయాలి. వైద్యుల సలహాతో మాత్రమే వీటిని తీసుకోవాలి. లవంగాలను ఎల్లప్పుడూ పరిమిత పరిమాణంలో మాత్రమే ఆహారంలో తీసుకోవాలి. రోజుకు ఒకటి లేదా రెండు లవంగాలు సరిపోతాయి. వీటితో టీ తాగవచ్చు. భోజనం తర్వాత మౌత్ రిఫ్రెషనర్‌గా ఒకటి నోట్లో వేసుకుని నమలవచ్చు.

## బిజినెస్ వాయిస్

### లాభాల్లో మొదలైన మార్కెట్లు



వరుసగా రెండు రోజుల నష్టాల తర్వాత భారత స్టాక్ మార్కెట్లు శుక్రవారం (ఆగస్టు 29, 2025) లాభాలతో ప్రారంభమయ్యాయి. మార్కెట్లలో నెలకొన్న అనిశ్చితికి కొంత విరామం లభించినట్లు కనిపిస్తోంది.ట్రేడింగ్ ప్రారంభంలో సెన్సెక్స్ 130 పాయింట్లు లాభపడి 80,209 వద్ద, నిఫ్టీ 43 పాయింట్లు వృద్ధి చెంది 24,537 వద్ద ట్రేడ్ అవుతున్నాయి. ఈ సానుకూల ధోరణి ఇన్వెస్టర్లకు కొంత ఊరటనిచ్చింది. నేటి మార్కెట్లలో కొన్ని ప్రముఖ కంపెనీల షేర్లు లాభాలను నమోదు చేశాయి. ప్రస్తుతానికి లాభాల్లో ఉన్న షేర్లలో హిందుస్థాన్ యూనిలీవర్, ఏషియన్ పెయింట్స్, ×ుజ, ట్రెంట్, మరియు కోటక్ బ్యాంక్ ఉన్నాయి. ఈ షేర్లు మార్కెట్ పుంజుకోవడానికి సహాయపడ్డాయి. అయినప్పటికీ, అంతర్జాతీయంగా నెలకొన్న రాజకీయ, ఆర్థిక పరిస్థితులు మార్కెట్లపై ప్రభావం చూపే అవకాశం ఉంది. ముఖ్యంగా, అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తిరిగి అధికారంలోకి వస్తే విధించే 'టారిఫ్స్' (పన్నులు)పై ఉన్న భయాలు ప్రపంచ మార్కెట్లను ప్రభావితం చేయవచ్చు. ఈ భయాల నేపథ్యంలో, నేటి లాభాలు ఎంతకాలం కొనసాగుతాయో వేచి చూడాలి. ప్రస్తుత లాభాలు మార్కెట్లలో తాత్కాలిక పునరుద్ధరణ కావచ్చు లేదా ఒక సానుకూల ధోరణికి సంకేతం కావచ్చు. అయితే, డొనాల్డ్ ట్రంప్ టారిఫ్‌లకు సంబంధించిన ప్రకటనలు మార్కెట్లను మళ్లీ నష్టాల్లోకి నెట్టే అవకాశం ఉంది. ప్రపంచ వాణిజ్యంపై టారిఫ్‌లు తీవ్ర ప్రభావం చూపుతాయి కాబట్టి, ఇన్వెస్టర్లు భవిష్యత్తు పరిణామాలపై దృష్టి పెట్టి ఉన్నారు. నేటి లాభాలు కొనసాగుతాయా? లేదా మళ్లీ నష్టాల్లోకి జారుకుంటాయా? అనేది రాబోయే రోజుల్లో స్పష్టమవుతుంది. ఈ అనిశ్చిత పరిస్థితుల్లో ఇన్వెస్టర్లు జాగ్రత్తగా వ్యవహరించడం అవసరం.

### కార్లు, తనఖా రుణాలపై వడ్డీ రేట్లు తగ్గించిన బ్యాంక్ ఆఫ్ బరోడా




ప్రభుత్వ రంగ బ్యాంక్ ఆఫ్ బరోడా రుణాలపై వడ్డీ రేట్లను తగ్గిస్తున్నట్టు ప్రకటించింది. ఎంపిక చేసిన కార్లు, తనఖా రుణాలపై 0.25 శాతానికి పైగా రేట్ల కోత నిర్ణయాన్ని బ్యాంకు తీసుకుంది. ఇటీవల భారతీయ రిజర్వ్ బ్యాంక్(ఆర్‌బీఐ) ఆర్థిక విస్తరణకు సహాయపడే క్రెడిట్ వృద్ధిని పెంచాలని పిలుపునిస్తున్న సమయంలో బ్యాంక్ ఆఫ్ బరోడా(బీఓబీ) వడ్డీ తగ్గించింది. ఇదే సమయంలో దేశవ్యాప్తంగా పండుగ సీజన్ మొదలవడంతో అందుకనుగుణంగా కస్టమర్లకు తక్కువ వడ్డీకే రుణాలివ్వాలని నిర్ణయించామని బ్యాంకు గురువారం అధికారిక ప్రకటన విడుదల చేసింది. ఈ తగ్గింపుతో ఇతర బ్యాంకులతో పోలిస్తే తమ బ్యాంకు రుణాలు తక్కువ వడ్డీకే లభిస్తాయని బీఓబీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సంజయ్ ముదలియార్ అన్నారు. సవరణల తర్వాత బ్యాంకు నుంచి తీసుకున్న కార్ల రుణాలపై వడ్డీ రేట్లు ఇప్పుడు 8.15 శాతం నుంచి ప్రారంభమవుతాయి. ఇది వరకు కార్ల రుణాలపై 8.40 శాతం వడ్డీ ఉండేది. తనఖా రుణాలపైనా వడ్డీ రేట్లు గతంలో 9.85 శాతం ఉండగా, తగ్గించిన తర్వాత 9.15 శాతం నుంచి ప్రారంభమవుతాయని బ్యాంకు వెల్లడించింది.

# చైనా స్మార్ట్‌ఫోన్ సంస్థకు యాపిల్, శాంసంగ్ షాక్

ప్రముఖ చైనా స్మార్ట్‌ఫోన్ల తయారీ సంస్థ షియోమీకి టెక్ దిగ్గజాలైన యాపిల్, శాంసంగ్ గట్టి షాక్ ఇచ్చాయి. తమ ప్రీమియం ఫోన్లను లక్ష్యంగా చేసుకుని, వాటిని పోలుస్తూ షియోమీ చేసిన ప్రకటనలపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ ఈ రెండు కంపెనీలు వేర్వేరుగా లీగల్ నోటీసులు జారీ చేశాయి. ఈ ఏడాది మార్చి, ఏప్రిల్ నెలల్లో షియోమీ తన ఫ్లాగ్‌షిప్ మోడల్ 'షియోమీ 15 అల్ట్రా'ను ప్రమోట్ చేస్తూ కొన్ని ప్రకటనలు చేసింది. ముఖ్యంగా ఏప్రిల్ ఫూల్స్ డే రోజున వార్తాపత్రికల్లో పూర్తి పేజీ యాడ్స్ ఇచ్చి, యాపిల్ ఐఫోన్ 16 ప్రో మాక్స్ కెమెరా తమ ఫోన్ ముందు సరిపోదంటూ ఎగతాళి చేసింది. అంతకుముందు మార్చిలో జరిగిన ఇండియా లాంచ్‌లో కూడా ఐఫోన్ కెమెరాను 'క్యూట్' అంటూ వ్యాఖ్యానించింది. శాంసంగ్ ప్రీమియం ఫోన్లను ఉద్దేశించి కూడా ఇలాంటి ప్రచారమే చేసింది. ఈ తరహా ప్రకటనలు వ్యాపార పోటీ పరిధిని దాటి, తమ బ్రాండ్ ఇమేజ్‌ను దెబ్బతీసేలా ఉన్నాయని యాపిల్, శాంసంగ్ ఆరోపిస్తున్నాయి. పోటీదారుల పేర్లను నేరుగా ప్రస్తావిస్తూ, వారి ఉత్పత్తులను కించపరిచేలా ప్రచారం చేయడాన్ని 'యాంబుష్ మార్కెటింగ్' అంటారు. ఈ విధానంపైనే ఆ రెండు కంపెనీలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయి. 'సాధారణంగా స్పెసిఫికేషన్లను పోల్చుకోవచ్చు. కానీ, ప్రత్యర్థి కంపెనీ పేరును నేరుగా వాడకూడదు. దానికి బదులుగా 'పోటీదారుల ఫోన్లు' అని చెప్పాలి' అని ఈ వ్యవహారంతో సంబంధం ఉన్న ఒక వ్యక్తి తెలిపారు. భారత స్మార్ట్‌ఫోన్ మార్కెట్‌లో బడ్జెట్ బ్రాండ్‌గా పేరున్న షియోమీ, ఇటీవలి




కాలంలో ప్రీమియం సెగ్మెంట్‌లో పట్టు సాధించేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తోంది. ఇంటర్నేషనల్ డేటా కార్పొరేషన్ (ఐడీసీ) నివేదిక ప్రకారం, 2025 రెండో త్రైమాసికంలో భారత మార్కెట్లో శాంసంగ్ 14.5% వాటాతో అగ్రస్థానంలో ఉండగా, షియోమీ (9.6%), యాపిల్ (7.5%) తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. ఈ నేపథ్యంలో ప్రీమియం మార్కెట్లో తన వాటాను పెంచుకోవడానికే షియోమీ ఈ దూకుడు ప్రచార వ్యూహాన్ని ఎంచుకున్నట్లు తెలుస్తోంది. అయితే, ఈ లీగల్ నోటీసులపై షియోమీ ఇంకా స్పందించాల్సి ఉంది.

# పసిడి ప్రియులకు షాక్..



పసిడి ధరలు ఆల్ టైం రికార్డ్ స్థాయి సమీపంలోనే ట్రేడ్ అవుతున్నాయి. అదే బాట లో వెండి పయనిస్తోంది. ఇలా బంగారం, వెండి ధరలు పెరగడానికి ప్రధాన కారణం అంతర్జాతీయంగా నెలకొన్న పరిస్థితులే. డాలర్ విలువ తగ్గే కొద్దీ బంగారం ధర పెరుగుతుంది. అంతేకాదు మరోవైపు ప్రపంచ దేశాల్లో ట్రంప్ తెరలేపిన వాణిజ్యం యుద్ధం, రష్యా యుక్రెయిన్ యుద్ధం వంటి అనేక రకాలతో బంగారం, వెండి ధరలపై విపరీతమైన ప్రభావాన్ని చూపిస్తున్నాయి. మరోవైపు పెట్టుబడిదారులు బంగారం పై పెట్టుబడి పెట్టడానికి ఆసక్తిని చూపిస్తున్నారు. ఈ నేపథ్యంలో పసిడి ధరలకు రెక్కలు వచ్చేశాయి. నేను సైతం అంటోంది వెండి. ఈ నేపద్యంలో ఈ రోజు ఆగస్టు 29వ తేదీ శుక్రవారం తెలుగు రాష్ట్రాలతో పాటు, దేశంలో ప్రధాన నగరాల్లో బంగారం వెండి ధరలు ఎలా ఉన్నాయో తెలుసుకుందాం.. ఈరోజు తెలుగు రాష్ట్రాలలోని ప్రధాన నగరమైన హైదరాబాద్ లో 10 గ్రాముల (తులం) 22 క్యారెట్ల బంగారం ధర రూ. 10 పెరిగి రూ. 94,060 లుగా ఉంది. ఈరోజు 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ. 10 లు పెరిగి 10 రూ. 1,02,610లకు చేరుకుంది. ఇవే ధరలు విజయవాడ, విశాఖ పట్నం, పొద్దుటూరు, వరంగల్, నిజామాబాద్ వంటి ప్రధాన నగరాల్లో కూడా కొనసాగుతున్నాయి. దేశ రాజధాని ఢిల్లీలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 10,2760లుగా ఉంది. 22 క్యారెట్ల బంగారం ధర 10 గ్రాములకు రూ. 94,210గా ఉంది.దేశ ఆర్థిక రాజధాని ముంబైలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం 1,02,610లు ఉండగా.. 22 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర రూ.94060గా కొనసాగుతోంది. చెన్నైలో 10 గ్రాముల బంగారం ధర 24 క్యారెట్ల ధర రూ. 1,02,610లకు చేరుకుంది. 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.94060గా ఉంది. ఇవే ధరలు బెంగళూరు, కేరళ, కోల్‌కతా, పూణే వంటి ప్రధాన నగరాల్లో కూడా కొనసాగుతున్నాయి. వెండిని ఆభరణాలు, నాణేలు, వంటపాత్రల తయారీ కోసం మాత్రమే కాదు రసాయనిక చర్యలలో ఉత్ప్రేరకంగా కూడా ఉపయోగిస్తున్నారు. రోజు రోజుకీ వెండిని ఇతర ఎలక్ట్రానిక్ వస్తువుల తయారీలో కూడా ఎక్కువగా వినియోగిస్తుండం పెరిగిపోతుంది. ఈ నేపథ్యంలో వెండి ధరలకు రెక్కలు వచ్చాయి. పసిడి బాటలోనే పయనిస్తూ పై పైకి చేరుకుంటుంది. అయితే ఈ రోజు వెండి ధర స్వల్పంగా తగ్గింది. నేడు హైదరాబాద్ సహా తెలుగు రాష్ట్రాల్లో కేజీ వెండి ధర స్వల్పంగా అంటే వంద రూపాయలు మేర తగ్గింది.

# 'టీమిండియా బెస్ట్ కెప్టెన్ అతడే.. సాధారణ జట్టుతో అద్భుత విజయాలు'

టీమిండియాకు ఎంతో మంది ఇప్పటి వరకు కెప్టెన్లుగా పనిచేశారు. అయితే, వీరిలో ప్రపంచకప్ టైటిల్స్ అందించిన సారథులు మాత్రం ప్రత్యేకం. 1983లో కపిల్ దేవ్ తొలిసారి భారత్‌ను వన్డే వరల్డ్‌కప్ టోర్నీలో గెలిపించి ఐసీసీ ట్రోఫీని అందించగా.. 2007లో మహేంద్ర సింగ్ ధోని తొట్టతొలి టీ20 ప్రపంచకప్‌లో టీమిండియాను చాంపియన్‌గా నిలిపాడు. జట్టు పరివర్తన దశలో సాహసోపేత నిర్ణయాలు తీసుకున్న ధోని.. 2011లో సొంతగడ్డపై భారత్‌కు వన్డే వరల్డ్‌కప్ కూడా అందించాడు. ఆ తర్వాత రెండేళ్లకు అంటే.. 2013లో ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీ టైటిల్ కూడా గెలిచాడు. ఇక ధోని తర్వాత మళ్లీ రోహిత్ శర్మ భారత్‌కు ఐసీసీ ట్రోఫీలు అందించిన కెప్టెన్‌గా నిలిచాడు. టీ20 ప్రపంచకప్-2024తో పాటు ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీ-2025 ట్రోఫీని రోహిత్ సేన గెలిచింది. ఇలా ఈ ముగ్గురు మేజర్ టైటిళ్లు గెలిచినా.. ధోని మాత్రం మూడు ట్రోఫీలతో వీరిద్దరి కంటే ఓ అడుగు ముందే ఉన్నాడు.

**అత్యుత్తమ కెప్టెన్ ధోని**




ఈ నేపథ్యంలో ధోనిని ఉద్దేశించి భారత మాజీ క్రికెటర్, కామెంటేటర్ సంజయ్ మంజ్రేకర్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. "పాత రోజుల్లో ఇమ్రాన్ ఖాన్ (పాకిస్తాన్).. అతడి తర్వాత అత్యుత్తమ కెప్టెన్ అంటే మహేంద్ర సింగ్ ధోని. సారథిగా తానెంత చేయగలడో అంతా చేశాడు. తానై ముందుండి నడిపించాడు. ఒంటిచేత్తో భారాన్ని మోశాడు. అనుభవం లేని.. ఓ సాధారణ జట్టును ప్రపంచకప్ విజేతగా నిలిపాడు. అందుకు టీ20 ప్రపంచకప్-2007 చక్కటి ఉదాహరణ.

**అందరికీ ఇది సాధ్యం కాదు**

ముఖ్యంగా మెగా టోర్నీ ఫైనల్స్‌లో అతడి ఆత్మవిశ్వాసం చూస్తే ముచ్చటేసేది. సాధారణ లీగ్ మ్యాచ్‌లాగే ఫైనల్లోనూ కూల్‌గా పనిచేసుకుంటూ పోతాడు. అందరికీ ఇది సాధ్యం కాదు. ఆటగాళ్లలోని అత్యుత్తమ ప్రతిభను వెలికితీసి సునాయాసంగా గెలిచేస్తాడు. కీలక సమయాల్లో రాణించగల ఆటగాళ్లు దొరుకుతూనే ఉంటారు. కానీ వారి సేవలను సద్వినియోగం చేసుకోగల కెప్టెన్లు అరుదు. అందుకే నా దృష్టిలో ఎంఎస్ అత్యుత్తమ, విభిన్న కెప్టెన్" అని సంజయ్ మంజ్రేకర్ స్టాలిన్ మథియాస్ పాడ్‌కాస్ట్‌లో పేర్కొన్నాడు.

### ఆరో పతకం ఆశలు ఆవిరి.. సింధుకు షాకిచ్చిన తొమ్మిదో సీడ్!

బీడబ్ల్యూఎఫ్ వరల్డ్ ఛాంపియన్‌షిప్స్‌లో దూసుకెళ్తున్న పీవీ సింధు పోరాటం ముగిసింది. మహిళల సింగిల్స్‌లో పతకంపై ఆశలు రేపిన తెలుగు తేజం అనూహ్యగా క్వార్టర్ ఫైనల్లో ఓటమితో టోర్నీ నుంచి నిష్క్రమించింది. ఉత్కంఠగా సాగిన పోరులో తొమ్మిదో సీడ్ పుత్రి కుసుమ వర్దానీ (ఇండోనేషియా) చేతిలో ఐదుసార్లు ఛాంపియన్ అయిన సింధు ఓటమిపాలైంది. దాంతో.. మరోసారి మెగా టోర్నీలో టైటిల్ సాధించకుండానే సింధు ఇంటిదారి పట్టింది. ప్రపంచ ఛాంపియన్‌షిప్స్‌లో జోరు చూపిస్తున్న సింధు క్వార్టర్ ఫైనల్లో చేతులెత్తేసింది. పదహారో రౌండ్‌లో రెండో సీడ్‌ను చిత్తు చేసిన ఒలింపిక్ విజేత.. ఇండోనేషియా షట్లర్ మర్దానీకి పోటీ ఇవ్వలేకపోయింది. తొలి సెట్‌లో ఆధిపత్యం చెలాయించిన వర్దానీ 21-14తో ముందంజ వేసింది. అయితే.. రెండో సెట్‌లో గొప్పగా పోరాడిన సింధు ప్రత్యర్థికి షాకిస్తూ 21-13తో సెట్ గెలిచింది. దాంతో, మ్యాచ్ మూడో సెట్‌కు వెళ్లింది. అయితే.. నిర్ణయాత్మక సెట్‌లో భారత షట్లర్ దూకుడుగా ఆడలేకపోయింది. ఫలితంగా 16-21తో సెట్‌తో పాటు సెమీఫైనల్ బెర్తును చేజార్చుకుంది సింధు. దాంతో, ఈ పోటీల్లో ఆరోసారి ఛాంపియన్‌గా నిలవాలనుకున్న ఆమె కలలు కల్లలయ్యాయి. ఈ



టోర్నీలో భారత స్టార్ గతంలో ఒక స్వర్ణం, రెండు రజతాలు, రెండు కాంస్యాలు సాధించింది. జాంగ్ నింగ్ (చైనా) తర్వాత వరల్డ్ చాంపియన్‌షిప్స్‌లో అత్యధికంగా ఐదు పతకాలు గెలుపొందిన రెండో షట్లర్ సింధునే కావడం విశేషం.

**తనీషా, ధ్రువ్ జోడీకి చుక్కెదురు**

మిక్స్‌డ్ డబుల్స్‌లోనూ తనీషా క్రాస్టో, ధ్రువ్ కపిల జోడీ కూడా ఓటమితో టోర్నీ నుంచి నిష్క్రమించింది. పదహారో రౌండ్‌లో ఐదో సీడ్ జంటపై సంచలన విజయంతో ఆశలు రేపిన ఈ జోడీ సైతం క్వార్టర్ ఫైనల్లోనే వెనుదిరిగింది. శుక్రవారం హోరాహోరీగా జరిగిన పోరులో నాలుగో సీడ్ జంట చెన్ తంగ్‌జీ, తో ఇవీ(మలేషియా) చేతిలో పరాజయం పాలైంది భారత ద్వయం. దాంతో, ఈ టోర్నీలో పతకం గెలిచిన మూడో భారత జంటగా రికార్డు నెలకొల్పే అవకాశాన్ని చేజార్చుకున్నారు తనీషా, ధ్రువ్.

## క్రీడా వాయిస్

### హర్మన్‌ప్రీత్ హ్యాట్రిక్ గోల్.. చైనాను చిత్తు చేసిన టీమిండియా



స్వదేశంలో జరుగుతున్న హాకీ ఆసియా కప్‌లో భారత జట్టు బోణీ కొట్టింది. ఆరంభ పోరులో డిఫెండింగ్ ఛాంపియన్ చైనాకు షాకిస్తూ పాయింట్ల ఖాతా తెరిచింది టీమిండియా. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ హ్యాట్రిక్ గోల్స్‌తో చెలరేగగా ప్రత్యర్థిని చిత్తుగా ఓడించింది. సారథి జోరుకు జుగురాజ్ సింగ్ గోల్ కూడా తోడవ్వడంతో 4-3తో మ్యాచ్‌ను ముగించిన టీమిండియా గ్రూప్ ఏ నుంచి అగ్రస్థానంలో నిలిచింది. రాజ్‌గిర్ వేదికగా ప్రారంభమైన ఆసియా కప్‌లో భారత పురుషుల హాకీ జట్టు అదిరే ఆటతో చైనాను మట్టికరిపించింది. గ్రూప్ దశలోని తొలి పోరులో ఆట మొదలైన కాసేపటికే ప్రత్యర్థి జట్టు తొలి గోల్ చేసి ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. అయినా సరే ఒత్తిడికి లోనవ్వని భారత బృందం టాప్ గేర్‌లో ఆడింది. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ చైనా డిఫెన్స్‌ను ఛేదిస్తూ హ్యాట్రిక్ గోల్స్ చేశాడు. చైనా ఆటగాళ్లు సైతం మరో రెండు గోల్స్ చేయడంతో స్కోర్లు సమం అయ్యాయి. ఉత్కంఠ నెలకొన్న వేళ.. జుగ్‌రాజ్ సింగ్ బంతిని గోల్ పోస్ట్‌లోకి పంపడంతో టీమిండియా ఆటగాళ్లు సంబురాలు చేసుకున్నారు. ఈ మెగా టోర్నీలో భారత జట్టు ఛాంపియన్‌గా నిలిస్తే ఈ ఏడాది జరుగబోయే ఎఫ్ఐహెచ్ హాకీ వరల్డ్ కప్ బెర్తు కైవసం చేసుకుంటుంది.






# 'మహావతార్ నరసింహ' కలెక్షన్స్.. దేశాన్ని ఏకం చేసిన గర్జన

'మహావతార్ నరసింహ' కలెక్షన్స్ పరంగా రికార్డ్ క్రియేట్ చేసింది. జులై 25న విడుదలైన ఈ యానిమేటెడ్ చిత్రానికి ప్రపంచవ్యాప్తంగా ఆదరణ లభించింది. సినిమా రిలీజై ఆరు వారాలు పూర్తి అయినప్పటికీ కొన్నిచోట్ల హౌస్‌ఫుల్ కలెక్షన్స్‌తో రన్ అవుతుంది. దీంతో ఈ చిత్రం కలెక్షన్స్ పరంగా అరుదైన మైలురాయిని అందుకుంది. ఈ మేరకు చిత్ర యూనిట్ ఒక పోస్టర్‌ను పంచుకుంది. 'మహావతార్ నరసింహ' చిత్రం రూ. 300 కోట్ల గ్రాస్ క్లబ్‌లో చేరిపోయింది. ఇండియా బిగ్గెస్ట్ యానిమేటెడ్ చిత్రంగా నిలిచిందంటూ నిర్మాణ సంస్థ హొంబాలే ఫిల్మ్స్ ప్రకటించింది. దేశాన్ని ఏకం చేసిన నరసింహ గర్జన అంటూ పేర్కొంది. శ్విన్ కుమార్ దర్శకత్వంలో హొంబలే ఫిల్మ్స్ సమర్పణలో శిల్పా ధవాన్, కుశల్ దేశాయ్, చైతన్య దేశాయ్ సంయుక్తంగా 'మహావతార్ నరసింహ' యానిమేటెడ్ చిత్రాన్ని తెరకెక్కించారు. తెలుగులో గీతా ఆర్ట్స్ బ్యానర్ నుంచి అల్లు అరవింద్ విడుదల చేశారు. కేవలం తెలుగులోకే రూ. 47 కోట్ల నెట్ రాబట్టి రికార్డ్ క్రియేట్ చేసింది.

# వాడి ప్రేమకథలో వేలు పెడితే ఇలాగే ఉంటుంది.. 'మోగ్లీ' గ్లింప్స్




రోషన్ హీరోగా నటిస్తున్న చిత్రం 'మోగ్లీ' తాజాగా ఈ చిత్రం నుంచి గ్లింప్స్ విడుదలైంది. రాజీవ్ కనకాల– సుమ వారసుడిగా చిత్రపరిశ్రమలో ఎంట్రీ ఇచ్చిన రోషన్ 'మోగ్లీ' ప్రేమకథతో వస్తున్నాడు. తాజాగా విడుదలైన గ్లింప్స్ నాని వాయిస్‌తో మొదలౌతుంది. 25 సంవత్సరాలు నిండని ఓ కుర్రాడు 30 మందిని తిండి, నిద్ర లేకుండా పరిగెత్తించాడంటూ నాని వాయిస్‌తో డైలాగ్ ప్రారంభమౌతుంది. వాడు గ్యాంగ్ స్టర్ కాదు, క్రిమినల్ కాదంటూనే వాడి కథేంటో తెలుసుకోవాలంటే మోగ్లీ చూడాలని చెప్పాడు. ఇందులో హీరోయిన్‌గా సాక్షి సాగర్ నటించారు. కలర్‌ఫోటో సినిమా దర్శకుడు సందీప్ రాజ్ ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు.




# బీర్ అనేది ఒక ఎమోషన్.. ఆసక్తికరంగా తమన్నా కొత్త వెబ్ సిరీస్ ట్రైలర్

ఇటీవలే 'ఓదెల 2'తో ప్రేక్షకులను అలరించిన మిల్కీ బ్యూటీ తమన్నా ఈసారి వెబ్ సిరీస్‌తో అలరించడానికి ప్రేక్షకుల ముందుకు వస్తుంది. నటి తమన్నా బాలీవుడ్ నటి డయానా పెంటీ ప్రధాన పాత్రల్లో వస్తున్న తాజా వెబ్ సిరీస్ 'డు యూ వనా పార్ట్‌నర్' కాలిన్, అర్చిత్‌కుమార్ ఈ వెబ్ సిరీస్‌కు సంయుక్తంగా దర్శకత్వం వహిస్తుండగా.. ప్రముఖ ఓటీటీ 'అమెజాన్ ప్రైమ్ వీడియో' ఒరిజినల్ సిరీస్‌గా ఈ చిత్రం రుపొందుతుంది. ఈ వెబ్ సిరీస్ సెప్టెంబర్ 12 నుంచి స్ట్రీమింగ్ కాబోతుండగా.. తాజాగా ట్రైలర్‌ను విడుదల చేసింది చిత్రయూనిట్. కార్పోరెట్ జాబ్‌లతో విసిగిపోయిన ఇద్దరు స్నేహితులు స్వయంగా బీర్ తయారు చేసి కంపెనీ పెడదం అనుకుంటారు. ఈ క్రమంలో వారికి ఎదురైన అనుభవాలు ఏంటి అనేది ఈ వెబ్ సిరీస్ స్టోరీ అని తెలుస్తుంది. కామెడీ అండ్ థ్రిల్లర్‌గా ఈ సిరీస్ రాబోతుంది.

# పెళ్లి పీటలెక్కనున్న విశాల్.. హీరోయిన్ సాయి ధన్సికతో నిశ్చితార్థం

కోలీవుడ్ అగ్ర నటుడు విశాల్, నటి సాయి ధన్సిక వివాహ బంధంలోకి అడుగుపెట్టనున్నారు. నేడు విశాల్ విశాల్ పుట్టినరోజు సందర్భంగా వీరి నిశ్చితార్థం చెన్నైలోని విశాల్ నివాసంలో అత్యంత సన్నిహితులు, కుటుంబ సభ్యుల సమక్షంలో జరిగింది. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఈ జంట తమ ప్రేమ విషయాన్ని మే నెలలోనే వెల్లడించిన విషయం తెలిసిందే. నిజానికి ఈరోజు వీరి వివాహం జరగాల్సి ఉండగా.. నడిగర్ సంఘం భవన(తమిళ ఫిల్మ్ అసోసియేషన్) నిర్మాణ పనులు పూర్తి కావాల్సి ఉన్నందున వివాహాన్ని వాయిదా వేసుకున్నారని తెలుస్తోంది. హీరోయిన్ ధన్సిక విషయానికి వస్తే.. హీరోయిన్ పక్కన జూనియర్ ఆర్టిస్ట్‌గా కెరీర్ మొదలుపెట్టిన ఈ అమ్మడు రజనీకాంత్ కబాలి సినిమాతో ఒక్కసారిగా స్టార్ హీరోయిన్‌గా మారింది. ఈ సినిమాలో సూపర్ స్టార్ కూతురిగా నటించడంతో అందరి కళ్లు ఈ ముద్దుగుమ్మపై పడ్డాయి. అనంతరం తమిళంతో పాటు తెలుగులో ఫుల్ బిజీగా మారింది ఈ అమ్మడు.



VISWAM VOICE Telugu Daily: Edited, Printed, Published and Owned by KHANDAVELLI SUNIL KUMAR, H.No:3-168, Pedda Brahmamgarriveedi, Rayavaram, Rayavaram (M), East Godavari District, Andhra Pradesh. Pin:533346. Ph:092460 33999, 9238823333, 8099966647, Printed at Kumar Publication, H.No.9-125, Indiramma Colony, Rayavaram, Rayavaram(M), East Godavari District, Andhra Pradesh. Pin:533346, Editor: KHANDAVELLI SUNIL KUMAR. RNI No: APTEL 2017/73603, viswamvoice@gmail.com